


38 సంవత్సరాల విప్లవానుభవం

అసమాన ప్రతిభాపాటవాలు

కార్మికవర్గతత్వం

ఆదర్శ కమ్యూనిస్టు జీవితం

సి.పి.ఐ.(మావోయిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడు

పార్టీ ప్రవక్త, భారత విప్లవ సారధి

# కామ్రేడ్ చెరుకూరి రాజకుమార్ (ఆజాద్)కు అరుణారుణ జోహార్లు

ప్రజలు, విప్లవ పార్టీ నిర్మాణం, ఎం.ఎల్.ఎం. సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసంతో భారత విప్లవ విజయానికి పట్టుదలతో కఠోర శ్రమ చేసిన కామ్రేడ్ చెరుకూరి రాజకుమార్ (గంగాధర్, మధు, పరిమళ్, ఆజాద్) చెదరని చిరునవ్వు, నిశిత దృష్టి విప్లవ శ్రేణుల్ని నిరంతరం పెనవేసుకునే వుంటాయి.

1950 దశకంలో కరుణ, లక్ష్మయ్య చౌదరిల ఇంట పుట్టిన రాజకుమార్ చిన్నప్పటి నుండి చురుకైన వాడు, తెలివైనవాడు కావడంతో కోరుకొండ స్కూలులో విద్యాభ్యాసం చేసాడు. తర్వాత వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజిలో చేరి గిరాయిపల్లి అమరుడు, బిటెక్ విద్యార్థి కామ్రేడ్ జనార్ధన్ సహ విద్యార్థి అయ్యాడు. అక్కడే విప్లవ రాజకీయాల్లోకి ప్రవేశించాడు. రాడికల్ విద్యార్థి సంఘ స్థాపనలోనూ, మొదటి కార్యవర్గంలోను తర్వాత ఆ సంస్థకు రాష్ట్ర అధ్యక్షుడుగాను ఉన్నాడు. 1974 నుండి ఆర్.ఎస్.యు., విప్లవోద్యమ నిర్మాణం కోసం పని చేసాడు. ఎమర్జెన్సీలో మీసా కింద అరెస్టు అయ్యాడు. విశాఖలో ఎంటెక్‌లో చేరి విద్యార్థులను, ప్రజలను సమీకరించి సిటీ బస్సులను జాతీయం చేసిన ఉద్యమానికి నాయకత్వాన్నిచ్చాడు. 1979 ఆగస్టులో నాసా కింద అరెస్టయ్యాడు. మద్రాసులో జాతుల సమస్యపై అఖిల భారత సెమినార్ నిర్వహించాడు. కర్నాటకలో పార్టీని నిర్మించి, అభివృద్ధి చేసి దానికి రాష్ట్ర నాయకుడుగా ఎదిగాడు.

1990 ఆగస్టులో కేంద్ర ప్రత్యేక ప్లీనంలో సీఓసీ సభ్యుడుగా, 1995లో సి.సి.సెక్రెటేరియట్ సభ్యుడుగా, 2000లో పొలిట్‌బ్యూరో సభ్యుడుగా ఎన్నికయ్యాడు. 2004లో ఏర్పడిన ఐక్య పార్టీలో కూడా పి.బి. సభ్యుడుగా ఎన్నికయ్యాడు. 2004లో ఎ.పి. ప్రభుత్వంతో

**జూలై 7,8 తేదీల్లో పార్టీ పిలుపు ఇచ్చిన బంద్‌ను విజయవంతం చేసిన ప్రజలకు జేజేలు**


సంపుటి: 34

సంచిక: 3

మే - జూన్ 2010

వెల: పది రూపాయలు

# క్రాంతి

సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

## దోపిడీ పాలకవర్గాల గుండెల్లో గుబులు పుట్టించిన

# ముక్రాం డెలిబరేట్ ఆంబుష్

## పి.ఎల్.జి.ఎ. చరిత్రలో ఒక మైలురాయి

ముక్రాం ఆంబుష్ భారతదేశ ప్రజాయుద్ధ చరిత్ర పుటల్లో గొప్ప స్థానాన్ని పొందింది. దేశ ప్రజలందరి దృష్టిని విశేషంగా ఆకర్షించింది. మావోయిస్టు పార్టీ నాయకత్వం కింద దిన దినం ప్రవర్ధమానమవుతున్న ప్రజా గెరిల్లా సైన్యం చేసిన ఈ ఆశ్చర్యకరమైన, అత్యద్భుత, సాహసిక ఆంబుష్ పాలక వర్గాలను కుదిపివేయగా, పీడిత ప్రజలకు పండగలాగా సంతోషాన్నిచ్చింది. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ, భూస్వామ్య వర్గాలకు ముద్దు బిడ్డ అయిన హోంమంత్రి చిదంబరం వెంటనే తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించాడు. గ్రీన్‌హంట్ పేరిట మావోయిస్టు పార్టీనీ, విప్లవ ప్రజానీకాన్ని వేలాది కేంద్ర బలగాలతో రక్తపాతంలో ముంచి, ఖనిజాల వేటకు బయలుదేరిన బహుళజాతి కంపెనీలకు ఊడిగం చేయ తలపెట్టిన చిదంబరంకు ముక్రాం ఘటన పీడ కలగా



⇨

*(మొదటి పేజీ తరువాయి)*

జరిగిన చర్చలను పి.బి. తరపున దగ్గరుండి గైడ్ చేశాడు. ఎ.పి. బాధ్యతలు చూస్తూ సి.ఆర్.బి.లో భాగమయ్యాడు. ఎన్.టి., డీకే ఉద్యమాలతో దగ్గర సంబంధంలో ఉన్నాడు. కొద్ది కాలం అంతర్జాతీయ సంబంధాలను చూసిన కామ్రేడ్ గంగాధర్, పార్టీ ప్రవక్తగానే కాక రాజకీయ శిక్షణతోపాటు వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేవాడు. గొప్ప పఠనాశక్తిగల ఆజాద్ విప్లవోద్యమ నిర్మాణంలో అత్యంత శ్రద్ధాశక్తులతో, దశాబ్దాలుగా శత్రువు కళ్లుగప్పి జాగరూకతతో పని చేశాడు. సిద్ధాంత, రాజకీయ విషయాలలో లోతైన అవగాహనతో శత్రు పథకాలను ఓడిస్తూ ఉద్యమ పురోగమనానికి ఎంతో కృషి చేసాడు. సాయుధ పోరాటానికీ, సంఘటిత మైదాన పోరాటాలకు మధ్య సమన్వయం సాధిస్తూ అన్ని రకాల విప్లవ శక్తుల మధ్య ఐక్యతను సాధించాడు కామ్రేడ్ గంగాధర్.

మార్చి నెలలో దేశంలోని విప్లవ ప్రజానీకం అంతా ఆజాద్ అరెస్టు గురించి తల్లడిల్లి పోయారు. ఆజాద్ క్షేమమని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. ఆ ఆనందం ఎన్నో రోజులు నిలువలేదు. జూలై 2న తెల్లవారుజామున ఆదిలాబాద్ జిల్లా వాంకిడి మండలం సరేయిపల్లి–జోగాపూర్ అడవి మధ్యలో పోలీసులు సృష్టించిన ఎదురుకాల్పుల కట్టు కథలో కామ్రేడ్ ఆజాద్‌ను ఉత్తరఖండ్‌కు చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు హేమ్‌చంద్రపాండేతో పాటు హత్య చేసి ఎ.కె.47 తుపాకిని పక్కనబెట్టారు. కామ్రేడ్ ఆజాద్ మరణం భారత విప్లవోద్యమానికి తీరని నష్టం. పునర్నిర్మాణమవుతున్న ఆంధ్ర ప్రదేశ్ కర్నాటక ఉద్యమాలకు తీవ్రమైన దెబ్బ. వారి ఆశయ సాధనకు పునరంకితమవుదాం.

*(కామ్రేడ్ ఆజాద్ (గంగాధర్) విప్లవ జీవిత చరిత్రను తరువాత సంచికలో ప్రచురిస్తాం. – సంపాదకవర్గం)*

తోచింది.ఈ ఊహించని పరిణామానికి దిగ్భ్రాంతికి గురై రాజీనామా ఇవ్వడానికి సిద్ధపడినాడు. ఉదయం లేవగానే మావోయిస్టు పార్టీపై విషం గక్కే చిదంబరం నోటి దురుసుకు తాళం పడింది. ప్రతిపక్షాలు, భాగస్వామ్య వర్గాలు మొదలు తన స్వంత పార్టీ నుండి చిదంబరం "మేధావి అహంకారం" మీద విమర్శల జడివాన కురిసింది. చిదంబరం ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ అభాసుపాలైందనీ, అది పారామిలటరీ బలగాలను బలిపశువులను చేస్తుందని మాజీ పోలీసు అధికారులు వ్యాఖ్యానించారు. చిదంబరం అనేవాడు బహుళజాతి కంపెనీల ప్రతిరూపంగా, నేడు బహుళజాతి కంపెనీల దోపిడి తీవ్రత, దూకుడుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ముక్రాం ఆంబుష్ కలుగజేసిన రాజకీయ ప్రకంపనలు ఎన్నో తంత్రులను మీటాయి. ఆంబుష్‌లో చనిపోయిన 76 మంది పోలీసుల శవాల వద్ద జగ్దల్‌పూర్‌లో విషాద వదనంతో దర్శనమిచ్చిన చిదంబరం ఆ ప్రకంపనల ధ్వని తరంగాల శబ్దాన్ని వినిపించాడేగానీ, అది వేరుగా బహుళజాతి కంపెనీల పాలిట మృత్యు సంగీతంగా వినిపించింది.

పత్రికలు, బ్యూరాక్రాట్లు, మేధావులు పలురకాలుగా ఈ ఘటనపై స్పందించారు. ఈ ఘటన జరిగిన వెంటనే పోలీసులు జారీ చేసిన ప్రకటనలో ఇంత పెద్ద ఎత్తున పోలీసులు చనిపోవడానికి కారణం ల్యాండ్‌మైన్స్ పేల్చడమేననీ, మావోయిస్టులు పన్నిన వలలో చిక్కి పోలీసులు హతులు అయినారని, వేయి మందికి పైగా గెరిల్లాలు దాడి చేశారని ప్రకటంచారు. హిందూ పత్రిక ఏకా ఎకి పోలీసులు నిద్రమత్తులో ఉండగా మావోయిస్టులు దాడి చేసి రక్తపాతం సృష్టించారని కట్టుకథ అల్లింది. ఈ ఊహాగాన వార్తలతో దేశంలో పెద్ద ఎత్తున చర్చ ప్రారంభమైంది. అసలు మావోయిస్టు పార్టీకీ, పి.ఎల్.జి.ఎ.కు ఇంత పెద్ద మొత్తంలో హతమార్చే శక్తి వుందా? అసలు ఇది ఎలా జరిగిందనే విషయంపై చర్చ కేంద్రీకృతమైంది. ప్రభుత్వం, పోలీసులు జరిగిన ఘటన యాదృచ్ఛికమని, అది తమ శక్తిని తక్కువ చేయజాలదని, ఏదో ఒక్క తప్పువల్ల జరిగిందే తప్ప మా ప్లాను సరైందేనని ప్రజలను నమ్మించడానికి ప్రయత్నిస్తూ వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోఒక మంచి ప్లానుతో మావోయిస్టుల అణచివేత కొనసాగుతున్నదని, ఇక ముందు కూడా సాగుతుందని చెప్పే చిదంబరం, ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌లు చివరకు పోలీసులు చనిపోవడానికి తమ బాధ్యత నుండి తప్పించుకొని పోలీసు అధికారులను బలిపశువులుగా చేశారు. ఈ కట్టు కథలను ప్రజలు ఎవ్వరూ నమ్మలేదు. కొన్ని సంవత్సరాలుగా మధ్య, తూర్పు ఇండియాలో పి.ఎల్.జి.ఎ. చేస్తున్న గెరిల్లా దాడులను గమనిస్తున్నారు. ఇలాంటి ఆంబుష్ అసాధ్యమేంకాదని నమ్ముతూ ఈ చర్యకు హర్షామోదం తెలియజేశారు.

ఈ ఘటన తర్వాత పాలకవర్గాలు మరోమారు విప్లవ సిద్ధాంతంపై, విప్లవకారులపై దుమ్మెత్తి పోయడం ప్రారంభించాయి. మావోయిస్టులు అనుసరిస్తున్న బూజుపట్టిన సిద్ధాంతం, నేటి భారతదేశ పరిస్థితులకు సరిపడదనీ, భారతదేశంలో "పార్లమెంటరీ ప్రజాస్వామ్యం" మాత్రమే విజయం సాధిస్తుందనీ, తుపాకీతో ఏమీ సాధించలేరనీ, ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదనీ, హింసను విడనాడి చర్చలకు రావాలని రక రకాలుగా ప్రకటనలు గుప్పించాయి.

మావోయిస్టులు కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ పరిపాలనను స్థంభింప చేశారని, ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ పరిపాలన పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని, శాంతి భద్రతలు నెలకొల్పిన తర్వాతనే అభివృద్ధి చేపట్టాలని, అందుకు మావోయిస్టులను ముందుగా నిర్మూలించాలనే సాకుతో గ్రీన్‌హంట్‌ను ప్రభుత్వం ప్రకటించింది. హోంమంత్రి చిదంబరమయితే మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులు, వారు స్కూల్ బిల్డింగ్‌లు, మొబైల్ టవర్లు, రోడ్లు పేల్చి వేస్తున్నారు, అభివృద్ధికి ఆటంకంగా మారారు అని చెబుతూ మావోయిస్టులపై యుద్ధం చేస్తున్నామనీ, ఇప్పటికే వారి చేతుల్లో నుండి 40 శాతం భూభాగాన్ని విముక్తి చేశామని, మరో రెండు సంవత్సరాల్లో తక్కిన భూభాగాన్ని విముక్తి చేసి, మావోయిస్టులను పూర్తిగా నిర్మూలిస్తామని అనేకసార్లు ప్రకటిస్తూ వచ్చాడు.

మావోయిస్టులు దేశ ఆంతరంగిక భద్రతకు పెను ముప్పు అని ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ప్రకటిస్తూ వస్తున్నాడు. దీంట్లో భాగంగానే మావోయిస్టులనూ, ప్రజలను అణచడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున హత్యాకాండ ప్రారంభించింది.

2009 ఆగస్టు నుండి గ్రీన్‌హంట్ ఆపరేషన్ ప్రభుత్వం ప్రారంభించింది. 70 వేల కేంద్ర రిజర్వు బలగాలు, రెండు లక్షలకు పైగా రాష్ట్ర బలగాలతో కూడి దేశంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మావోయిస్టులపై సైనిక చర్యను ప్రారంభించారు. ఆగస్టు నుండి ప్రారంభమైన గ్రీన్‌హంట్ మూడవ దశ ఏప్రిల్ నుండి ప్రారంభమైంది. అప్పటికే 150 మందికిపైగా అమాయకులైన ఆదివాసులను హత్య చేశారు. అమానవీయ పద్ధతుల్లో మహిళలనూ, పిల్లలను హింసకు గురిచేసి చంపివేశారు. పత్రికా స్వేచ్ఛను పూర్తిగా హరించారు. వేలాది మందిని అరెస్టులు చేసి చిత్రహింసలు పెట్టారు.

ప్రభుత్వం స్ట్రాటెజిక్ హామ్లెట్స్ (శిబిరాలు) నిర్మించి అందులో ఆదివాసులను నిర్బంధించారు. గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకించిన మేధావులను వివిధ పద్ధతుల్లో బెదిరిస్తూ వారిపై దమనకాండ కొనసాగిస్తున్నారు. గాంధియన్ అయిన హిమాంశు కుమార్ ఆశ్రమాన్ని కూల్చివేసి, ఆయన్ని బస్తర్ నుండి బహిష్కరించారు. ఆయన గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకిస్తూ, గొంపాడులో హత్యాకాండకు

ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన మహిళ శంభకు చికిత్స చేయించి సాక్షిగా నిలిపే ప్రయత్నం చేసినందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అతనిపై ఈ నిర్బంధాన్ని అమలు చేసింది. అరుంధతీరాయ్ లాంటి వాళ్లను అక్రమ కేసుల్లో ఇరికించి జైలులో పెట్టడానికీ, నూతన అణచివేత చట్టాల్ని తేవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్న ప్రజాస్వామికవాదులు, మేధావుల పీక నొక్కడానికి ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

ప్రభుత్వ ఎంగిలి మెతుకులకు ఆశపడిన బ్యూరాక్రాట్స్, మేధావులు, ఆర్నాబ్‌స్వామి (గోబెల్స్‌స్వామి) లాంటి టీవీ వ్యాఖ్యాతలు నిరంతరం మావోయిస్టుల, ప్రజాస్వామ్యవాదుల, మేధావులపై విషం కక్కుతూ టీవీలో ప్రసంగాలు చేస్తున్నారు.

ఇంకా కొంత మంది మేధావులు దేశంలో కొన్ని ప్రాంతాలు వెనకబడినాయని, ప్రభుత్వం తీసుకొంటున్న అభివృద్ధి కార్యక్రమాలు ఈ ప్రాంతాల ప్రజలకు చేరడంలేదని, ఆదివాసులకు నిజంగానే సమస్యలున్నాయని, అయితే వీటిని ఆధారం చేసుకొని మావోయిస్టులు తమ లక్ష్యాన్ని సాధించుకోవడానికి ప్రయత్నించడం క్షంతవ్యం కాదని సన్నాయి నొక్కులు నొక్కుతూనే వున్నారు. వీరు బహుళజాతి కంపెనీల, పోలీసుల హింసను ఏ రోజూ ఖండించిన పాపాన పోలేదు.

ఇలాంటి సందర్భంలో ముక్‌రాం ఘటన పాలకవర్గాలను వారి వంది మాగదులను తన స్వరం మార్చుకొనేలా చేసింది. పాలకవర్గాల పాలసీలో ఏమాత్రం మార్పు లేనప్పటికీ గృహమంత్రిత్వ శాఖ వెనకబడిన ప్రాంతాల్లో మావోయిస్టుల నిర్మూలన తర్వాతనే అభివృద్ధి పరచడం అనే చర్విత చరణ పాటను మొదటిసారిగా వదులుకొని, అభివృద్ధి కూడా ముఖ్యమైన అంశమని, దీనికి కూడ ప్రాముఖ్యత ఇవ్వాలని అంగీకరించింది.

విప్లవాన్ని కాంక్షించే మేధావులు, ప్రజాస్వామికవాదులు ఈ ఘటనపై విశ్లేషణ చేస్తూ, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని, ప్రభుత్వం నిస్సిగ్గుగా బహుళజాతి కంపెనీల ప్రయోజనం కోసం గ్రీన్‌హంట్ పేరిట ఆదివాసులపై హత్యాకాండ సాగిస్తున్నదని దుయ్యబట్టారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళన ఆ రోజు ఉత్సవంగా మారి విద్యార్థులంతా నృత్యాలు చేశారు. జవహర్‌లాల్ యూనివర్సిటీలో ఇలాంటి పరిణామాల్ని చూసి పాలకవర్గాల పాత్రికేయులకు, బి.జె.పి. సిద్ధాంత కర్తలకు, శరీరంపై జెర్రులు పారినట్లుగా మారి ఆందోళనతో పత్రికల్లో సంపాదకీయాలు రాశారు.

ఒకే ఘటనలో 76 మంది పారామిలటరీ బలగాలు హతం కావడాన్ని పాలకవర్గాలు జీర్ణించుకోలేక పోయాయి. మావోయిస్టులతో ప్రారంభించిన యుద్ధంలో ఎన్నడూలేని విధంగా నష్టం జరగడంతో భారత ప్రభుత్వ బలం తగ్గిపోతున్నదనే సంకేతాలు ప్రపంచ దేశాలకూ, సామ్రాజ్యవాదులకు అంతకంటే ఎక్కువగా భారత ప్రజలకు, ప్రపంచ ప్రజానీకానికి అందుతాయని కేంద్ర ప్రభుత్వం కలవరపాటుకు గురైంది. దీనితో ప్రభుత్వం మరో యుద్ధానికి పెద్ద ఎత్తున సన్నాహాలు ప్రారంభించింది.

ప్రభుత్వం వెంటనే భద్రతా కమిటీ సమావేశం వేసి, సైన్యాన్ని వినియోగించే విషయంలో తీవ్రంగా చర్చించింది. వైమానిక బలాన్ని ఉపయోగించి దాడులు చేసే విషయంలో చర్చించింది. వెంటనే సైన్యాన్ని, వైమానిక విభాగాన్ని సంప్రదించింది. గత రెండు సంవత్సరాలుగా సైన్యం ఇప్పటికే 50 వేల మంది పారామిలటరీ బలగాలకు శిక్షణ నిచ్చింది. వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్లను రంగంలోకి దింపింది. సైన్యం ఇప్పటికే గ్రీన్‌హంట్ ఆపరేషన్‌కు అవసరమైన సలహాలు ఇస్తున్నది. ప్రస్తుత సమావేశాల తర్వాత సైన్యం నేరుగా రంగంలోకి దిగే ప్రమాదం పెరిగింది.

రాష్ట్రాల్లో సరిపడినంత పోలీసు బలగాలు లేవనీ, మరో మూడు లక్షల మంది పోలీసులను వెంటనే రిక్రూట్ చేసుకోవాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. మరిన్ని ఇ.ఆర్.బి.ల కోసం రిక్రూట్‌మెంట్ ప్రారంభించారు. వెంటనే సీమా శసస్త్ర బల్ (ఎస్.ఎస్.బి.)తో పాటు బి.ఎస్.ఎఫ్. బలగాలను ఉద్యమ అణచివేతకు దింపడం ప్రారంభమైంది. వీరు ఈ మూడవ దశ గ్రీన్‌హంట్‌లోనే భాగమైనారు. మరిన్ని ఆర్మీ హెలికాప్టర్స్, అధునాతన ఆయుధాలు, పారా మిలటరీ బలగాలకు అందజేస్తున్నారు. వీటిలో పాటు ఇంటలిజెన్స్ విభాగాలను పటిష్టం చేసి, మరింత దూకుడుగా దాడి చేసే ప్లాను రూపొందిస్తున్నారు.

ముక్‌రాం ఘటన ఒక లిట్మస్ పేపర్ పరీక్షలా పని చేసింది. పాలకవర్గాన్ని, వారిని సమర్థించే మేధావులను ఒకవైపు, మావోయిస్టులను, ప్రజలను, ప్రజాస్వామికవాదులను మరోవైపు నిలబెట్టాయి. ఎవరి విధానాలను వారు సమీక్షించుకొంటూ సాన పెట్టుకుంటున్నారు. అన్ని వర్గాలు, సెక్షన్లు, ప్రజలు, ప్రభుత్వం అందరూ స్పందించారు. అందుకు ఒకే ఘటనలో ఇంత మంది పోలీసులు చనిపోవడం, 1947 తర్వాత భారత పాలకవర్గాలకు ఎదురుకాని సంఘటన అయితే, భారత విప్లవోద్యమ చరిత్రలో దీన్ని మైలురాయిగా ఎంచి మావోయిస్టుల గెరిల్లా యుద్ధంలో చరిత్రను ముక్‌రాం ఘటనకు ముందూ వెనకాల చరిత్రగా చెప్పుకోవాల్సి వుంటుంది.

ముక్‌రాం ఆంబుష్ పి.ఎల్.జి.ఎ. సాధించిన గొప్ప విజయాల్లో ఒకటిగా చరిత్రలో నిలుస్తుందనే దానికి సందేహం లేదు. పి.ఎల్.జి.ఎ. ఇంత గొప్ప విజయం సాధించడానికి దానికి ఎలాంటి రాజకీయ,

మిలటరీ అనుభవాలు లభించాయి, దాని మిలటరీ నైపుణ్యం ఏమేరకు పెరిగింది, దానికి లభించిన ప్రజల అండ ఎంతగా వుంది. అది నెలకొల్పిన త్యాగ సంప్రదాయాలను విషయాలను పరిశీలించడం ద్వారానే దాని విజయాన్ని అంచనా వేయగలం.

ఐక్యత 9వ కాంగ్రెసులో పి.ఎల్.జి.ఎ.ను పి.ఎల్.ఎ.గా, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయాలనీ, దండకారణ్యం, బీహార్, జార్ఖండ్‌లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలనే కేంద్ర కర్తవ్యం పి.ఎల్.జి.ఎ.కు రాజకీయ ప్రేరణగా నిలిచింది. అప్పటి నుండి అది ఒకే లక్ష్యంతో ప్రభుత్వ దాడిని ఎదుర్కొంటూ గెరిల్లా యుద్ధంలో అనేక అనుభవాలు సాధించింది. అనేక దాడుల్లో పాల్గొని గెరిల్లా యుద్ధ నైపుణ్యాన్ని సంపాదించింది. ఉర్పల్ మెట్ట, రాణిబోధిలి, బలిమెల, నయాగఢ్ రెయిడ్, మదన్‌వాడ, లాహిరి లాంటి దాడుల్లో పాల్గొని అనేక విజయాలు సాధించి పి.ఎల్.జి.ఎ. పటిష్టపడింది. ఈ నాలుగేళ్ల కాలంలో పి.ఎల్.జి.ఎ. పటిష్టపడుతూ గెరిల్లా దాడుల్లో విజయాలు సాధిస్తుంటే, ప్రభుత్వ పారా మిలటరీ బలగాలు, స్పెషల్ బలగాలు గెరిల్లా యుద్ధంలో పి.ఎల్.జి.ఎ.తో తలపడడంలో ఓటమిపాలవుతూ, తీవ్ర నష్టాలు పొందుతూ వస్తున్నాయి. అవి పి.ఎల్.జి.ఎ.తో ముఖా ముఖి పోరాటంలో నిలబడలేకపోతున్నాయి. ప్రభుత్వం తన బలగాల మోరల్‌ను నిలబెట్టడానికి తీవ్రంగా కృషి చేస్తున్నప్పటికీ, గెరిల్లా యుద్ధం ముందు దానికి సాధ్యం కావడం లేదు.

గ్రీక్ వీరుడు ఆంటియస్ తన తల్లి భూమిని అంటిపెట్టుకొని వున్నంత కాలం ప్రపంచంలో అతన్ని ఏ శక్తీ ఓడించలేదని ఒక పురాణ కథ వుంది. అలాగే పి.ఎల్.జి.ఎ. ప్రజలనంటిపెట్టుకొని, ప్రజల విశ్వాసాన్ని పొంది, నిరంతరం వారి చురుకైన భాగస్వామ్యంతో శత్రువుతో పోరాటంలో అనేక విజయాలు సాధిస్తున్నది. సంఘటితమైన ప్రజాసంఘాలు, జనతన సర్కార్‌ల రూపంలో దిన దినం అభివృద్ధి చెందుతున్న ప్రజల రాజకీయ అధికార సంస్థలు, విశాల ప్రజారాసులు, దేశ ప్రజలు దక్షిణాసియా ప్రజలు, ప్రపంచ కార్మికవర్గం, ప్రగతిశీల ప్రజాస్వామికవాదులు, మేధావులు పి.ఎల్.జి.ఎ.కు అండగా వున్నారు. నిరంతరం వర్గ పోరాటంలో ఉంటూ, భూస్వామ్య, దళారీ పాలకవర్గాల, సామ్రాజ్యవాదుల దోపిడీ పీడనలతో పోరాడుతున్న ప్రజలు, పి.ఎల్.జి.ఎ. సాధిస్తున్న విజయాలతో మరిన్ని వర్గ పోరాటాల్లో మిలిటెంట్‌గా పాల్గొంటున్నారు. నేడు ప్రజలు, భూమి, అధికారం, ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్నారు. పార్లమెంటరీ వ్యవస్థ పాలకవర్గాల మాయాబజార్ అని ప్రజలంతా ఎక్కడికక్కడే బహిష్కరిస్తూ, సాయుధ పోరాటాన్ని చేపడుతున్నారు. ముక్రాంలో పి.ఎల్.జి.ఎ. సాధించిన విజయం దేశ వ్యాపితంగా వర్గ పోరాటంలో పాల్గొంటున్న ప్రజలకు ఎలాగైతే ఉత్తేజాన్ని ఇస్తున్నదో, పి.ఎల్.జి.ఎ.కు కూడా ఆ మద్దతు మరిన్ని విజయాలు సాధించడానికి గ్యారంటీనిస్తున్నది.

ముక్రాం ఆంబుష్‌లో ప్రజల భాగస్వామ్యం గురించి మనం చెప్పుకోవాలి. ఆంబుష్‌కు మొదటి నుండి సహకరిస్తున్న ప్రజానీకం పాత్ర ఆంబుష్ సమయంలో కూడా చాలా బాగుంది. ఆంబుష్ ప్రారంభం కావడంతోనే చుట్టుపక్కల గ్రామాల మిలీషియా, ప్రజలు ఆంబుష్‌లో చేరడమేగాక ఆంబుష్‌లో గాయపడిన పి.ఎల్.జి.ఎ. యోధులను ఫైరింగ్ మధ్యనే వెంట వెంటనే రక్షణ స్థలాలకు చేర్చి వారికి ట్రీట్‌మెంట్ అందేలా చేశారు. అమరులైన కామ్రేడ్స్ శవాలతో పాటు శత్రువు నుండి స్వాధీనం చేసుకున్న సమస్త ఆయుధాలు, ఇతర సామాగ్రినంతా యుద్ధం మధ్యలోనే మోసుకొని తెచ్చారు. ఎక్కడికక్కడ శత్రువు అడ్వాన్స్ కాకుండా మిలీషియా యూనిట్లు అడ్డు నిలిచాయి. వీరు సాంప్రదాయక ఆయుధాలతో శత్రువుతో పోరాడారు. ప్రభుత్వం పోలీసులు తలపెడుతున్న నరమేధానికి వ్యతిరేకంగా ప్రజల ప్రతిఘటన సాయుధ రూపంలో పెల్లుబికింది.

ప్రభుత్వం గ్రీన్‌హంట్ ఆపరేషన్ ప్రారంభించి పథకం ప్రకారం విప్లవోద్యమంపై దాడిని కేంద్రీకరించింది. ఈ ఆపరేషన్‌ను దశల వారిగా కొనసాగిస్తున్నారు. త్రిశూల్ క్యాంపెయిన్ రూపంలో కార్పెట్ సెక్యూరిటీని పటిష్టపరుస్తూ, రోడ్డు పక్కల గ్రామాలపై కంట్రోల్‌ను సాధించడం ద్వారా విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకొని రావడానికి ప్రయత్నిస్తున్నారు. రోడ్ ఓపనింగ్ పార్టీల పేరిట రోడ్లపై ఉన్న గ్రామాల ప్రజలకు నరకం చూపిస్తున్నారు. ఈ పాశవిక నిర్బంధకాండకు తట్టుకోలేక ప్రజలు గజ గజ వణికిపోయారు. రాత్రుల్లో వందలాది మంది పోలీసులు, ఎస్.పి.ఒ.లు ఏ గ్రామం మీద దాడి చేసి, ఎంత మందిని పట్టుకొని కాల్చి చంపుతారో, ఎంత మంది మహిళలపై అత్యాచారం చేసి చంపుతారో తెలియని భయాందోళన పరిస్థితిని కల్పించారు. ప్రజలపై సాగించే ఈ భయానక దాడిలో చనిపోయిన వారిని నక్సలైట్లుగా ప్రచారం చేశారు. గ్రామాల్లో నుండి ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ తయారు చేసుకొంటూ మరో పెద్ద దాడికి సిద్ధమవుతూ వచ్చారు. తాము చేపట్టిన కార్యక్రమాల్లో విజయాలు లభిస్తున్నాయనీ, గత ఆరు నెలలుగా తమ బలగాలపై పెద్ద దాడులు ఏవీ జరగలేదని నమ్మబలుకుతూ ప్రభుత్వానికి విశ్వాసాన్ని ప్రకటిస్తూ వచ్చారు.

మావోయిస్టు పార్టీ, పి.ఎల్.జి.ఎ. ఈ దాడిని ఎదుర్కోవడానికి ప్రజలను సంసిద్ధం చేస్తూనే, ఒక మంచి నిర్ణయాత్మక దాడికి సన్నాహాలు చేసింది. ఈ సన్నాహాలు విజయవంతంగా పూర్తి చేసి ముక్రాం ఆంబుష్‌ను నిర్వహించింది. ఈ ఆంబుష్‌లో ప్రభుత్వ, పోలీసుల పటాటోపం ఆవిరి అయిపోయింది. పార్టీ నాయకత్వంలో ప్రజలు, పి.ఎల్.జి.ఎ. ప్రభుత్వ ప్రతీఘాతుక దాడిని తమకు అనుకూలమైన ప్రదేశంలో, తగిన సమయంలో ఏ రోజైనా, ఏవిధంగానైనా ఓడించగలరని నిరూపించారు.

*(మిగతాది 32వ పేజీలో...)*

# ముక్‌రాం ఆంబుష్‌లో అమరులైన పి.ఎల్.జి.ఎ. సాహస యోధులకు విప్లవ జోహార్లు

ఏప్రిల్ 6, 2010 ఉదయం 5.50 నుండి 8.50 గంటల వరకు దంతెవాడ జిల్లా కుంట బ్లాక్‌లోని చింతల్‌నార్ అవుట్‌పోస్టుకు 4 కి.మీ. పరిధిలోని ముక్‌రం-తాడిమెట్ల గ్రామాల మధ్య అడవిలో అర్ధసైనిక బలగాలు, కోబ్రా కమాండోలతో భీకరమైన పోరాటంలో మన పి.ఎల్.జి.ఎ. త్యాగాలకు వెనుదీయకుండా హెూరా హెూరీగా పోరాడి శత్రువు గుండెల్లో తూటాలై పేలుతూ 76 మంది అర్ధసైనిక బలగాలను అంతమొందించింది. ఆ క్రమంలో ఎనిమిది మంది మన ప్రియతమ ప్రజా విముక్తి గెరిల్లా యోధులు నేలకొరిగారు. వీరిలో కామ్రేడ్స్ రుక్మతి, వాగా, ఇంగా, విజ్జా, రాజు, మంగు, రతన్, రామాల్‌లు వున్నారు. వీరి జీవిత చరిత్రలు డీకే ఎస్.జడ్.సి. కరపత్రంలో ప్రకటించినమేరకు సంక్షిప్తంగా తెలియజేస్తున్నాం.

## సెక్షన్ కమాండర్ కామ్రేడ్ మాడివి రుక్మతి



కామ్రేడ్ రుక్మతి (26) పశ్చిమ బస్తర్ డివిజన్ (బీజాపూర్ జిల్లా)లోని నేషనల్ పార్కు ఏరియా పర్మగఢ్ పంచాయితికి చెందిన ముకరం గ్రామస్తురాలు. నిరుపేద బంజారా ఆదివాసి కుటుంబంలో కుట్రు దగ్గరి మంగుపేట గ్రామంలో మాడివి చంపా - మంగు దంపతులకు జన్మించిన పెద్ద కూతురు. తనకు ఇద్దరు తమ్ముళ్ళు, ఓ చెల్లెలు వుంది. చిన్నప్పటి నుండి ఇంట్లో పని చేయడంలో, ఇప్పపూలు ఏరడంలో, తన తమ్ముళ్లను ఆడించి పాడించడంలో తల్లికి చేదోడు వాదోడుగా వుండేది. గ్రామంలో తోటి పిల్లలతో ఆటలాడుతూ, పాట పాడుతూ పశువులు గాసేది. కుట్రు ప్రాంతంలో 1980 దశకం నుండి విప్లవోద్యమం కొనసాగుతున్నది. తెగ పెద్దల, ఫారెస్టు అధికారుల, పట్వారీల దోపిడినీ, పెత్తనాన్నీ తన కళ్లతో చూసింది. 1990లో కుట్రు ప్రాంతంలో విప్లవోద్యమాన్ని అణచడానికి జనజాగరణ్ అభియాన్‌లో తమ ముకరం గ్రామంలోని సంగ నాయకత్వంపై ప్రయోగించిన హింస తన మనసులో పదిలపరుచుకున్నది. పెరిగి పెద్దదై గ్రామంలో కె.ఎ.ఎం.ఎస్. మహిళా సంగంలో సభ్యురాలైంది. గ్రామంలో మహిళలపై పితృస్వామ్యం అణచివేత, రీతి రివాజుల పేర మహిళలపై జరుగుతున్న పీడన, దోపిడీ గురించి తెలుసుకుని సంగంలో చైతన్యవంతురాలైంది. 2004 ఫిబ్రవరిలో పి.ఎల్.జి.ఎ.లో భర్తీ అయింది. 2005 జూన్‌లో సల్వాజుడుంకు వ్యతిరేకంగా పోరాటంలో పాలుపంచుకుంది. 2005 అక్టోబర్ నుండి ప్రధాన బలగాలలో చేరి ఎన్.ఎం.డి.సి. మైనింగ్ పై దాడి, ముర్కినార్, ఉర్పల్‌మెట్ట, తోంగుగూడెం, బట్టుగూడెం, తాడిమెట్ల లాంటి అనేక సైనిక దాడుల్లో సాహసికంగా పోరాడింది. సెక్షన్ కమాండర్‌గా గత సంవత్సరం నుండి భాధ్యతలు చేపట్టింది. ఈ ఆంబుష్‌లో శత్రువును మట్టికరిపిస్తూ, సీజింగ్ చేసుకుంటున్న క్రమంలో శత్రువు విసిరిన గ్రేనెడ్ పేలి, తీవ్రంగా గాయపడి అయిదు గంటల తర్వాత అసువులుబాసింది. ఆదర్శవంతమైన వీరనారి కామ్రేడ్ రుక్మతి.

## సెక్షన్ కమాండర్ కామ్రేడ్ పొడియం వాగా



పొడియం వాగా (28) దక్షిణ బస్తర్ డివిజన్ (దంతెవాడ జిల్లా) కొంట బ్లాక్‌లోని రేగడిగట్ట గ్రామంలో మధ్యతరగతి కోయ ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. చిన్ననాటి నుండి విప్లవ రాజకీయాలతో వుత్తేజితమై డి.ఎ.కె.ఎం.ఎస్., ప్రజా మిలీషియాలో చురుగ్గా పాల్గొన్నాడు. 2006లో పూర్తికాలం విప్లవ కార్యకర్తగా పి.ఎల్.జి.ఎ.లో భర్తీ అయ్యాడు. కొన్ని రోజులు కుంట ఏరియాలో ఎల్.జి.ఎస్., ప్లాటూన్‌లో పని చేశాడు. 2009 ఫిబ్రవరిలో ప్రధాన బలగాలలో సభ్యుడుగా చేరాడు. కామ్రేడ్ వాగా మిజో, నాగా బలగాలపై చేసిన దాడుల్లో, అలాగే పాలోడి, సింగన్‌మడుగు, తోద్క, పరాల్‌నార్ దాడుల్లో సాహసంగా శత్రువుతో పోరాడాడు. ఇటీవలనే సెక్షన్ కమాండర్‌గా ప్రమోట్ అయ్యాడు. శత్రువుతో హెూరా హెూరిగా పోరాడుతూ పీడిత ప్రజల కోసం తన ప్రాణాలర్పించాడు.

## సెక్షన్ డిప్యూటీ కమాండర్ కామ్రేడ్ ఉర్స సుద్రు (విజ్జా)

కామ్రేడ్ ఉర్సు సుద్రు (23) పశ్చిమ బస్తర్ డివిజన్ (బీజాపూర్ జిల్లా)లోని అల్వూరు పంచాయితిలోని పామ్రా గ్రామంలో



జన్మించాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో తన చిన్నాన్న పెంచి పెద్ద చేశాడు. ఈ ప్రాంతంలో సల్వాజుడుంకు వ్యతిరేకంగా భూంకాల్ మిలీషియాలో చురుగ్గా పాల్గొన్నాడు. 2006 జనవరిలో పి.ఎల్.జి.ఎ.లో పూర్తికాలం సభ్యునిగా చేరాడు. 2006 చివర్లో ప్రధాన బలగాల్లోకి బదిలీ అయ్యాడు. క్రమశిక్షణాయుతమైన పి.ఎల్.జి.ఎ. సభ్యుడిగా వుంటూ, పార్టీ కమిటీల విశ్వాసాన్ని పొందాడు. పార్టీ సభ్యునిగా ఎదిగి, సెక్షన్ డిప్యూటీ కమాండర్‌గా బాధ్యలు చేపట్టారు. గత మూడున్నర సంవత్సరాలలో శత్రువుపై జరిపిన ఉర్పల్‌మెట్ట, తాడిమెట్ల, బట్టిగూడెం, తోంగ్‌గూడెం, పాలోడి దాడులలో పాల్గొన్నాడు. ఆంబుష్‌లో సెక్షన్ డిప్యూటీగా శత్రువుతో హెూరాహెూరీగా పోరాడుతూ నేలకొరిగాడు.

## సెక్షన్ డిప్యూటీ కమాండర్ కామ్రేడ్ సోడి ఇంగా



కామ్రేడ్ సోడి ఇంగా (22) దక్షిణ్ బస్తర్ డివిజన్ (దంతెవాడ జిల్లా) కొంట బ్లాక్, కిష్టారం ఏరియాలోని బూటాల్ కర్రిగుండం గ్రామంలో నిరుపేద కోయ ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. చిన్ననాటి నుండే విప్లవ కుటుంబంలో పెరిగినందున, విప్లవోద్యమ భావాలతో ప్రభావితమైనాడు. మిలీషియాలో చురుగ్గా పని చేశాడు. సల్వాజుడుం గూండాలను, ఆంధ్ర గ్రేహౌండ్స్ బలగాలను ఎదుర్కోవడంలో సాహసంగా ముందుండేవాడు. 2006 ప్రారంభంలో పూర్తికాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో చేరాడు. 2007లో ప్రధాన బలగాల్లో చేరి క్రమశిక్షణాయుతమైన గెరిల్లా యోధునిగా ఎదిగాడు. గత సంవత్సరం సెక్షన్ డిప్యూటీ బాధ్యతలు చేపట్టాడు. అనేక దాడుల్లో శత్రువుతో వీరోచితంగా పోరాడాడు. ఆంబుష్‌ను ప్రారంభిస్తూ శత్రువును కిల్లింగ్ జోన్‌కు తరుముతున్న క్రమంలో క్లోజ్‌డ్ క్వార్టర్ బ్యాటిల్‌లో వీరమరణం పొందాడు.

## కామ్రేడ్ సల్వం రామా

కామ్రేడ్ సల్వం రామా (26) దక్షిణ బస్తర్ డివిజన్ (దంతెవాడ జిల్లా) జేగురగొండ ప్రాంతంలోని మొర్రుపల్లి గ్రామస్తుడు. నిరుపేద దొర్ల ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. యుక్త వయస్సు రాగానే డి.ఎ.కె.ఎం.ఎస్.లో చేరి సంగ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. మిలీషియాలో కూడా పని చేశాడు. 2007లో పూర్తికాలం కార్యకర్తగా పి.ఎల్.జి.ఎ.లో చేరాడు. 2008లో ప్రధాన బలగాలలో సభ్యునిగా వుంటూ నిజాయితీగా, కమ్యూనిస్టు యోధుడుగా విప్లవోద్యమంలో



పాల్గొన్నాడు. గత రెండేళ్లలో ప్రధాన బలగాలు చేస్తున్న అనేక దాడులలో పాల్గొంటూ తన బాధ్యతలను నిర్వహించాడు. ఆంబుష్‌లో తీవ్రంగా గాయపడి, తన గ్రామం మొర్రువల్లి తరలించిన పిదప తన నాలుగేళ్ల వసిపాపను దగ్గరగా తీసుకొని "విప్లవోద్యమంలో చేరి దోపిడీవర్గాలను రూపుమాపడానికి మీరందరూ నాలాగే పోరాడాలి" అని పిలుపునిస్తూ పి.ఎల్.జి.ఎ. జిందాబాద్ అని నినాదాలు ఇస్తూ అంతిమ శ్వాస విడిచాడు.

## కామ్రేడ్ ఉండామి రాజు



కామ్రేడ్ ఉండామి రాజు (23) దక్షిణ బస్తర్ డివిజన్ (బీజాపూర్ జిల్లా) ఊసూర్ బ్లాక్‌లోని కొండపల్లి గ్రామ నివాసి. విప్లవ కార్యకలాపాలలో ఉత్తేజితుడై సంగం, మిలీషియా కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. 2006లో దోపిడీ ప్రభుత్వాన్ని కూలదోయడానికి పి.ఎల్.జి.ఎ.లో భర్తీ అయ్యాడు. 2008 మధ్యలో రీజనల్ కంపెనీ–2లో సభ్యుడిగా బదిలీ అయ్యాడు. బందా ఆంబుష్, దామన్‌జోడి రెయిడ్‌లలో సాహసంగ పోరాడాడు. ఆంబుష్‌లో శత్రువును చుట్టుముడుతూ చాలా దగ్గరగా పోరాడుతున్న క్రమంలో నేలకొరిగాడు. కామ్రేడ్ రాజు తనతోటి సభ్యులతో ఆప్యాయంగ వుంటూ, అందరి మన్ననలను పొందాడు. నిరంతరం చిరునవ్వు ముఖంతో వుండి అందరిని ఉల్లాసంగ వుంచేవాడు.

## కామ్రేడ్ మడ్కం మంగు (23)



కామ్రేడ్ మడ్కం మంగు (23) దక్షిణ బస్తర్ డివిజన్ (బీజాపూర్ జిల్లా) ఊసూర్ బ్లాక్‌లోని రేంగమ్ గ్రామస్తుడు. నిరుపేద కోయ ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. 18 సంవత్సరాల వయసులో డి.ఎ.కె.ఎం.ఎస్., మిలీషియాలో చేరి చురుగ్గా పాల్గొన్నాడు. 5వ తరగతి వరకు చదువుకున్నాడు. 2006లో పూర్తికాలం కార్యకర్తగా పి.ఎల్.జి.ఎ.లో భర్తీ అయ్యాడు. 2008లో ప్రధాన బలగాలలోని రీజనల్ కంపెనీ–2

⇨

# కేంద్ర మిలటరీ కమీషన్ ఇన్‌చార్జ్ కామ్రేడ్ బసవరాజు (బి.ఆర్.)తో ఇంటర్వ్యూ

**క్రాంతి:** భారతదేశంలో 1947 తర్వాత అతిపెద్ద ఘటనగా దేశవ్యాపితంగా పెద్ద చర్చ జరుగుతున్న ముక్‌రాం ఘటనను వివరించండి?

**బి.ఆర్.:** మన పార్టీ 9వ కాంగ్రెస్‌లో ఆమోదించిన వ్యూహం-ఎత్తుగడల ప్రకారం కేంద్ర కర్తవ్యంగా డీకే, బీజేలను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నాం. అలాగే గెరిల్లా యుద్ధ దశ నుండి చలన యుద్ధ దశకు మన యుద్ధ తంత్రాన్ని అభివృద్ధి చేసుకోవాలనే, పి.ఎల్.జి.ఎ.ను పి.ఎల్.ఎ.గా అభివృద్ధి చేసుకోవాలనే కర్తవ్యాలను రూపొందించుకున్నాం. ఆ కర్తవ్య నిర్వహణలో భాగంగానే ముక్‌రాం ఘటనను మనం చూడాల్సి వుంటుంది. ఇది మొదటిదికాదు. గతంలో కూడా డెలిబరేట్ ఆంబుష్‌లను చేసాం. డీకే, ఎ.ఒ.బి., పశ్చిమ బెంగాల్, బీజే, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో చిన్న, మధ్య, పెద్ద తరహా చర్యలు అనేకం జరుగుతున్నాయి. ముక్‌రాం ఘటన మూడు నెలలు వెసులుబాటును ఇచ్చింది. పది చిన్న ఘటనలకన్నా ఒక పెద్ద ఘటన ఎక్కువ ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. మన శక్తి సమర్థతల్ని మరింతగా పెంచుతుంది. ఆ విధంగానే ముక్‌రాం ప్రాధాన్యతను అర్థం చేసుకుందాం.

1987 నుండి ఇటువంటి ఘటనలను చెప్పుకోవాలి. మన పార్టీ చరిత్రలో తూర్పు గోదావరి జిల్లాలో దారగడ్డ, ఆదిలాబాద్ జిల్లాలో ఆలంపల్లిలలో మొదటి డెలిబరేట్ ఆంబుష్‌లు జరిగాయి. అక్కడ అప్పుడు కాల్బుల శక్తి మీద ఆధారపడి చేసాం. అప్పుడు ఒక సెక్షన్ శత్రు బలగాలనయినా మట్టుబెట్టాలనేది మన లక్ష్యం. అందుకు మూడు రెట్లు మన బలాన్ని కేంద్రీకరించాం. ఈ రెండు దశాబ్దాల కాలంలో మన బలగాలు, ఆయుధ శక్తి, యుద్ధ నైపుణ్యం, ప్రజాబలం చాలా రెట్లు పెరగడంతో పాటు ఉద్యమం అనేక ప్రాంతాలకు విస్తరించింది. ముఖ్యంగా రెయిడ్స్‌లో అలాగే ఆంబుష్‌లలో అనుభవాలు వచ్చాయి.

ముక్‌రాం డెలిబరేట్ ఆంబుష్‌లో కూడా మూడు రెట్ల బలగాలను మనం ఉపయోగించాం. ఒక కంపెనీ స్థాయి బలగాల్ని మొత్తంగానే నాశనం చేయాలనుకున్నాం. ఈ ఘటనలో గాయపడిన పోలీసులు ఎనిమిది మంది చనిపోయినట్లు నటించి తప్పుకున్నారు. మనం

⇨

---

లోకి బదిలీయై, బండ ఆంబుష్‌లో, దామన్‌జోడి లాంటి రెయిడ్‌లలో పాల్గొన్నాడు. కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా నేర్చుకుంటూ ఎదుగుతున్నాడు. ఆంబుష్‌లో శత్రువుతో పోరాడుతూ అమరుడయ్యాడు.

## కామ్రేడ్ పొడియం రతన్



కామ్రేడ్ పొడియం రతన్ మాడ్ డివిజన్ (బీజాపూర్ జిల్లా)లోని భైరంగఢ్ బ్లాక్‌లోని ఇంద్రావతి ఏరియాలో జాడ్కా గ్రామస్తుడు. పేద కోయ ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. 18 సంవత్సరాల వయసులో డి.ఎ.కె.ఎం.ఎస్., మిలీషియాలో చేరి చురుగ్గా పాల్గొన్నాడు. సల్వాజుడుంకు వ్యతిరేకంగా పోరాటంలో వున్నాడు. 2005 చివరిలో పూర్తికాలం కార్యకర్తగా పి.ఎల్.జి.ఎ.లో చేరాడు. 2007లో రీజనల్ కంపెనీ-1లోకి బదిలీ అయ్యాడు. నయాగఢ్, దామన్‌జోడి, బండ దాడుల్లో సాహసంగ పాల్గొన్నాడు. క్రమశిక్షణాయుతంగా వుంటూ సీనియర్ పార్టీ సభ్యునిగా వుంటూ అందరి మన్నలను పొందాడు. శత్రువుతో హెూరా హెూరిగా పోరాడుతూ వీరమరణం పొందాడు.

కామ్రేడ్స్ రామా, రాజు, మంగు, రతన్‌లు నలుగురూ పార్టీ సభ్యులు. నలుగురు కమాండర్లతో కలుపుకుని ఎనిమిది మంది పార్టీ సభ్యులు (నాయకులు) ఆదర్శ జీవితాలు మనకు మార్గాన్ని చూపుతాయి.

ఈ వీరయోధుల త్యాగం వృథాకాదు. వీరి సాహసం, దృఢసంకల్పం, చొరవ, త్యాగనిరతి, నిరంతరం పీడిత ప్రజలకు, గెరిల్లా యోధులకు, పార్టీకి ప్రేరణ ఇస్తాయి. వీరి ఆశయ సాధనకై పోరాడుదాం. గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా పెంపొందిద్దాం. శత్రువు తలపెట్టిన బహుముఖ దాడియైన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడిద్దాం. దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా చేద్దాం.

భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేద్దాం. ★

ఫైర్ పవర్ మీద ప్రధానంగా ఆధారపడి ఆంబుష్‌లను విజయవంతం చేయడంలో తగినంత అనుభవాన్ని సంపాదించాం. అందుకే ఈ ఘటనలో ఒకరు మినహా మిగిలిన 75 మందిని కూడా ఫైరింగ్‌లోనే మట్టుబెట్టాం. గతంలో మన దగ్గర ఆటో, సెమీ ఆయుధాలు లేవు. ఇప్పుడు మన ఫైర్ పవర్ పెరిగిన మాటా, ఎ.కె.47 లాంటి మెరుగైన తుపాకులు వున్నమాట నిజమే. ఇప్పటికి పోలీసులు, సి.ఆర్.పి.ఎఫ్. గ్రేహౌండ్స్, ప్రత్యేక బలగాల దగ్గర వున్నంత సంఖ్యగానీ, బెటర్ వెపన్స్‌గాని లేవు. మనకు దొరికిన ఆయుధాలు అన్నీ ఆటో, సెమీ ఆయుధాలే. మన దగ్గర ఉన్న వాటితో పోలిస్తే వాళ్ల దగ్గరనే ఎక్కువ ఆటో, సెమీ ఆయుధాలున్నాయి. మనలో కొద్ది మంది దగ్గర ఆయుధాలే లేవు. మనం పేల్చింది (వాళ్ల 'యుద్ధ రథాన్ని' (ఎం.పి.వి.)) ఒక్క మందుపాతరనే. మిగిలినవి తర్వాత మనమే తవ్వి తెచ్చుకున్నాం. వాటి అవసరం రాకుండానే ఆ ఘటన విజయవంతం అయింది.

ఏప్రిల్ 6న ఉదయం ఆరు గంటలకన్నా ముందే ఫైరింగ్ మొదలయింది. పి.ఎల్.జి.ఎ. బలగాలు ప్లాను చేసుకున్న నాలుగవ రోజుకు ఇది జరిగినా మన ప్రయత్నాలు చాలా ముందు నుండే వున్నాయి. మన పరిశీలన, పథక రచన పకడ్బందీగా వున్నాయి. 62వ బెటాలియన్‌కు చెందిన ఆల్ఫా కంపెనీ బలగాలు లోపలికి వచ్చిన విషయం అర్థం అయింది. మన ఊహకు అనుగుణంగానే శత్రువు వచ్చాడు. ఏప్రిల్ 5 రాత్రి ముక్‌రాం దగ్గర పడుకొని తెల్లవారి లేచి తిరుగు ప్రయాణం అవుతున్నప్పుడు ఆ దారిలో పెద్ద దెబ్బ కొట్టాం.

ఆ రోజు ఉదయం మన బలగాలు ఇంకా ఆంబుష్ సైటుకు వచ్చి పూర్తిగా సెటిల్ కాకముందే సి.ఆర్.పి.ఎఫ్. బలగాలు సైట్‌లోకి వచ్చాయి. వాళ్లే ముందు మన వాళ్లను చూసి ఫైర్ చేసారు. మన వాళ్లు ముందు నుండి ప్లాన్‌తో వుండడంతో అన్ని వైపుల నుండి చుట్టివేసి వాళ్లను ఎటూ పారిపోకుండా దిగ్బంధనం చేసి దెబ్బకొట్టారు. ఒక అరగంటలోనే చుట్టివేసి, మొదటి గంటలోనే పూర్తిగా పైచేయి సాధించారు. ముందే నిర్ణయించుకున్నట్లు అనుకూలత పెరగడంతో రెండో గంట, మూడో గంట కూడా అఫెన్స్ కొనసాగించి భారీగా మట్టుబెట్టి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంతో దేశ చరిత్రలోనే ఒక పెద్ద ఘటనగా అది నిలిచిపోయింది.శత్రువు రోజువారి తెల్ల బీభత్సాలకు సమాధానంగానే ఎర్రబీభత్సం సృష్టించాం.

**క్రాంతి:** ఈ సంఘటనలో పి.ఎల్.జి.ఎ. బలగాలు ఏ విధంగా విజయాన్ని సాధించాయి?

**బి.ఆర్:** డీకేలో సల్వాజుడుం సందర్భంగా ప్రజల మీద ప్రభుత్వం పాశవిక దాడి చేసింది. 250 మందిని హత్య చేసి, వందల మంది మహిళలపై అత్యాచారాలు చేసి, కోట్ల ఆస్తి ధ్వంసం చేసిన విషయం ప్రపంచానికి తెలిసిందే. గ్రీన్‌హంట్ కమాండోలు మొదట చింతగుప్పలో మన చేతిలో చావు దెబ్బ తిన్నాక బీజాపూర్, దంతెవాడ రెండు జిల్లాల్లోనే 52 మందికి పైగా అమాయక ప్రజల్ని రెండు నెలల్లో హత్యలు చేసారు. సల్వాజుడుంలో చేసిన హత్యల కన్నా ఎక్కువ స్థాయిలో జరిగాయి. ప్రజల్లో విపరీతమైన కసి వుంది. సల్వాజుడుంను ఓడించిన ఉత్సాహం వుంది. రాణీబోధిలి, ఉర్పల్‌మెట్ట లాంటి ఘటనలతో మన చేతుల్లోకి చొరవ ఎలా తీసుకోవాలో అర్థమయింది. గ్రీన్‌హంట్‌ను ఓడించాలన్న పట్టుదల వుంది. ఇప్పుడు ఇక్కడున్న కేడర్‌లో 90 శాతంకు పైగా స్థానిక ఆదివాసీ ప్రజలున్నారు. వారే నాయకులు. ప్రజలలో, కేడర్‌లో ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న గ్రీన్‌హంట్ లాంటి విధానాలపట్ల, సల్వాజుడుంపట్ల వ్యతిరేకత బలంగా వుంది. గ్రీన్‌హంట్ దాడిని ఓడించకపోతే తమ ఉనికికే ప్రమాదం కనుక తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ప్రజలు అన్ని విధాల సహకరించారు. ఇది ప్రజా యుద్ధం. పి.ఎల్.జి.ఎ. చేసిన దాడిలో మొబైల్ యుద్ధ లక్షణాలున్నాయి. ప్రజామద్దతు సంపూర్ణంగా లభించింది.

చుట్టూ పోలీసు స్టేషన్లు, క్యాంపులున్నాయి. కార్పెట్ సెక్యూరిటీ ఉన్న ప్రాంతం. పి.ఎల్.జి.ఎ. బలగాలన్నీ దాడిని బాగా రిహార్సల్స్ చేసాయి. లోతుగా ప్రతీ విషయాన్ని చర్చించాయి. సరైన ప్లానును రూపొందించుకుని, దాడిని నిర్వహించడానికి సర్వసన్నద్ధమయ్యాయి. పి.ఎల్.జి.ఎ. పెద్ద సంఖ్యలో ఉన్నా చర్చించుకున్న విధంగా, రిహార్సల్స్‌లో నేర్చుకున్న విషయాలతో సమైక్య భావంతో ఒకే మనిషిలా దాడిలోను, సీజింగ్‌లోను కూడా ధైర్యంగా పాల్గొన్నారు. కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్, కోఆర్డినేషన్, ఇంటలిజెన్స్ ($సి_4$ఐ) గొప్పగా సమన్వయించబడ్డాయి. కాబట్టే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలిగింది. కొన్ని నష్టాలు, త్యాగాలు లేకుండా విజయాలు ఉండవు. ఈ దాడిలో ఎనిమిది మంది ప్రాణత్యాగం చేసారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ నష్టాలు దాడి పురోగమనంలో అనివార్యం. అందుకు అవసరమైన సంసిద్ధత, త్యాగ గుణం మన బలగాల్లో సంపూర్ణంగా వుంది. విజయం సాధిస్తామనే విశ్వాసం, నమ్మకం మొదటి నుండి మన బలగాల్లో వుంది. రాణిబోధిలి అనుభవం ఒక రకమైనది. ముక్‌రాం అనుభవం మరొకరకమైనది. అభివృద్ధికరమైనది. ఇది మన బలగాల నైపుణ్యాన్ని మరింతగా పెంచింది.

**క్రాంతి:** ముక్‌రాం ఘటనలో ప్రజల సహకారం ఏవిధంగా వుంది?

**బి.ఆర్.:** ఇక్కడి గ్రామాల్లో జనతన సర్కార్లు వున్నాయి. వాటి రక్షణకు మిలీషియా వుంది. పి.ఎల్.జి.ఎ.లో ఈ పునాది బలగాల పాత్ర ముఖ్యమైనది. గ్రామంలో వృద్ధులు, పిల్లలు, రోగులు,

బలహీనులు తప్ప మిగిలిన అందరూ ఏదోఒక నిర్మాణంలో పని చేయడం మనకు తెలిసిందే. ముఖ్యంగా అధిక సంఖ్యలో భూంకాల్ మిలీషియాలో పని చేస్తున్నారు. గ్రామాల్లో సాధికారత, స్వావలంబనను సాధించడంలో సర్కార్ల పాత్ర గొప్పది. ఈ ప్రాంత ఉద్యమాన్ని కాపాడుకోవడంలో భాగంగా విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని గుర్తించి ప్రజలు ప్రధాన బలగాలకు అన్ని విధాలుగా సహకరిస్తారు. ప్రజాయుద్ధ నిర్వహణలో పి.ఎల్.జి.ఎ. ప్రధానంగా ప్రజల మీదనే ఆధారపడి తిండి, సరఫరాలు, రిక్రూట్‌మెంటు, ఇంటెలిజెన్స్, దాడులలో పాల్గొనడంతో సహా అన్నీ చేసారు. ఒక్కమాటలో ప్రజలే సర్వస్వంగా పి.ఎల్.జి.ఎ. ప్రతిఘటన జరిగింది. ఈ ఘటనలో ప్రజలు ప్రధాన బలగాలతోపాటు పాల్గొన్నారు. కాల్పులు మొదలుకాగానే చుట్టుపక్కల గ్రామాల స్త్రీలు, పురుషులు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. వస్తూనే మంచాలు తెచ్చారు. కాల్పుల మధ్యనే గాయపడిన వారిని వైద్య సహాయం అందేచోటికి చేర్చారు. వారి ప్రాణాలు కాపాడారు. అమరుల శవాలను అక్కడి నుండి దూరంగా తెచ్చారు. తర్వాత వారి గ్రామాలకు చేర్చారు. పోలీసుల దగ్గర స్వాధీనం చేసుకున్న మొత్తం 79 ఆయుధాలు, వేల తూటాలు, అనేక వస్తువులు తీసుకొచ్చారు. మొత్తం పి.ఎల్.జి.ఎ. బలగాలను ఉత్సాహపరిచారు. జావకాసి సరఫరా చేసారు. అంతా క్లియర్ అయ్యేవరకు దగ్గరే వున్నారు. అలాగే శత్రువుకు అదనపు బలగాలు రాకుండా అడ్డుకోవడంలోనూ, వాళ్లు తిరిగి వెళ్లేటప్పుడు సాంప్రదాయక విల్లంబులతోనే ప్రతిఘటించి అడ్డంకులు కల్పించడంలోను చురుకుగా పాల్గొన్నారు. గ్రీన్‌హంట్ రెండో దాడిని ఓడించిన ప్రజల, పి.ఎల్.జి.ఎ. విజయాన్ని కథలు కథలుగా విస్తృతంగా ప్రచారం చేసి ఉత్సాహంగా పండుగ చేసుకున్నారు.

**క్రాంతి:** ఇప్పుడు జరుగుతున్న ప్రభుత్వ దాడులకు, యుద్ధాన్ని తలపింపజేస్తున్న తెల్లబీభత్సానికి మూలకారణం ఏమిటి?

**బి.ఆర్.:** కేంద్రంలోనూ, అన్ని రాష్ట్రాల్లోను ఉన్న ప్రభుత్వాలు దోపిడీ పాలకవర్గాల నాయకత్వంలో ఉన్నాయి. ఇవి సామ్రాజ్యవాదుల ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో నడిచే భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ వర్గాలు. 1947 నుండి సామ్రాజ్యవాదానికి అనుకూలంగా అనుసరించిన విధానాలనే 1991 తర్వాత నూతన ఆర్థిక విధానాల పేరుతో బహిరంగంగానూ, వేగంగా అమలుచేస్తూ ప్రపంచ బ్యాంకు పాలసీలకు మన దేశ ఆర్థిక విధానాన్ని బలిపెట్టారు. దశాబ్దాల నుండి మన వనరులను కొల్లగొట్టి బహుళజాతి సంస్థలకు కారుచౌకగా అమ్మి వేస్తున్నారు. ఇప్పుడు భూములు, గనులు ప్రధానంగా లక్షల ఎకరాల భూమిని, లక్షల కోట్ల రూపాయలు విలువ చేసే ఖనిజ సంపదను సామ్రాజ్యవాద గుత్త సంస్థలకు, దేశంలోని దళారులకు ఇవ్వడానికి ఆదివాసీలను, రైతులను అడవి నుండి, భూముల నుండి ఖాళీ చేయించి నిర్వాసితులను చేస్తున్నారు. ఇది ఒక రకంగా దేశ సార్వభౌమాధికారాన్నీ, సంపదను కాపాడుకునే విషయమైతే, మరో రకంగా కోట్లాది ప్రజల అస్తిత్వానికి సంబంధించిన జీవన్మరణ సమస్య. అందుకే దేశవ్యాపితంగా పెద్ద వ్యతిరేకత వచ్చింది.

ఎస్సార్, జిందాల్, వేదాంత, ఎన్‌రాన్, రస్ అల్‌ఖైమా లాంటి గుత్త సంస్థలతో, పెద్ద పెద్ద వ్యాపార సంస్థలతో టాటా, బిర్లా, మిట్టల్, అంబానీ లాంటి దళారులూ, పెట్టుబడిదారులైన పెద్ద స్టీల్, అల్యూమినియం కింగ్స్‌తో అన్యాయమైన, అసమానమైన పోస్కో లాంటి పెద్ద ఒప్పందాలు (ఎం.ఒ.యు.లు) చేసుకున్నారు. ఒడిషాలో కళింగనగర్, కాశీపూర్, నియమగిరి, దేవ్‌మాలి పర్వతాలు; పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రాం, సాల్బనీ, సింగూర్, లాల్‌గఢ్ వరకు బీహార్‌లో పలామూ, జార్ఖండ్‌లో ఈస్ట్ సింగ్‌భూమ్; ఛత్తీస్‌గఢ్‌లో లోహండిగూడ, బోధ్‌ఘాట్, రావ్‌గాట్, బైలదిల్లా, పల్లెమాడు; ఉత్తరాంధ్రలో ఏజెన్సీ ప్రాంతాలలో బాక్సైట్ తవ్వకాలతో లక్షలాది ఆదివాసీలను తరిమివేయడానికి, ఆ సంపదను కొల్లగొట్టడానికి ప్రభుత్వం ప్రజలపై యుద్ధం చేస్తుంది. ప్రజలు నిర్వాసితులు కావడానికి సిద్ధంగా లేరు. దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టుపెట్టడాన్ని సహించరు. స్వతంత్రం, స్వావలంబన కోసం ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. దోపిడీ పీడనలులేని నూతన సమాజమే స్వావలంబన, సార్వభౌమాధికారానికి గ్యారంటీ కాబట్టి దీర్ఘకాల ప్రజాయుద్ధానికి సిద్ధపడుతున్నారు. ఛత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిషా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రా, ఉత్తరప్రదేశ్ ఇంకా అనేక చోట్ల జరుగుతున్న అనేక ఘటనలకు ఇదే కారణం. ప్రభుత్వం ప్రజలపై చేస్తున్న యుద్ధానికి ప్రధాన కారణం ఇదే.

**క్రాంతి:** ప్రభుత్వ విధానాలకు, నిర్వాసిత సమస్యకు వ్యతిరేకంగా బలమైన ప్రజాఉద్యమాలు ఎక్కడికక్కడ జరుగుతున్నాయి. విప్లవ పార్టీ వాటిని నడుపుతుందా?

**బి.ఆర్.:** నేను ప్రధానంగా రెండు ఉదాహరణలు చెబుతాను. ఒకటి లాల్‌గఢ్, రెండోది నారాయణపట్నం. లాల్‌గఢ్‌లో ఒక తరహాలో పోరాటం మొదలయింది. చాలా చిన్న చిన్న డిమాండ్స్. మొత్తం 14 అంశాలే. అవన్నీ ప్రజాస్వామిక డిమాండ్స్. పోలీసులు క్షమాపణ చెప్పాలి అనేది అందులో ఒకటి. పోలీసు, పారామిలటరీ బలగాలు పిల్లల స్కూల్స్ ఖాళీ చేయాలి. కేసులు ఉపసంహరించాలి. నీరు కావాలి, వైద్యం చేయాలి లాంటి డిమాండ్స్‌ను పరిష్కరించకుండా నిర్బంధ విధానాలు అనుసరిస్తే ప్రజలు సంఘటితపడి 1856 నాటి సంతాల్ తిరుగుబాటు, 1967 నక్సల్బరి పోరాట స్ఫూర్తితో మిడ్నాపూర్, బంకురా, పురూలియా ఒక్కటై రోడ్లను దిగ్బంధించారు. ఏడు పోలీస్ స్టేషన్లలోని పోలీసుల్ని తరిమివేశారు. ఇదంతా శాంతియుతంగానే చేసారు. పైగా ఈ

పోరాటం నడిచిన ఏడు నెలల కాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 30 సంవత్సరాలకు పైగా ఆ ప్రాంతాన్ని ఎంతగా నిర్లక్ష్యం చేసిందో బహిర్గతం చేసారు. నందిగ్రాం, సింగూర్‌లలో, లాల్‌గఢ్‌లో విజయాలను దెబ్బకొట్టడానికి పెద్ద ఎత్తున బలగాలను దించి అణచివేత చర్యలు చేపడితే సల్డాలో పోలీసు క్యాంపు మీద పి.ఎల్.జి.ఎ. మెరుపు దాడి చేసి 21 మందిని ఖతం చేసి 53 ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. ఇందులో మన కామ్రేడ్స్ అయిదుగురు అమరులయ్యారు. సల్డా ఘటన విప్లవ శ్రేణుల్లో గొప్ప ఉత్సాహాన్నిచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో నక్సల్బరీ పోరాటం తాత్కాలికంగా దెబ్బతిన్న తర్వాత మరల ఇప్పుడు నాలుగు దశాబ్దాలకు పెల్లుబికిన ప్రజాందోళన విప్లవోద్యమంగా ఎదిగింది. నక్సల్బరి మార్గమే పరిష్కారంగా గుర్తింప చేసింది.

అలాగే ఒడిషాలోని నారాయణపట్నం పోరాటాన్ని చూస్తే వీర శ్రీకాకుళం (1968) పోరాటం గుర్తుకు వస్తుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు, దోపిడీ అణచివేత విధానాలు అప్పుడూ ఇప్పుడూ ఒకే విధంగా ప్రతిబింబంలాగానే కనబడతాయి. ఇక్కడ సుండీలు వ్యాపారం పేరుతో వచ్చి సారా అలవాటు చేసి భూములు ఆక్రమించి, రాజకీయాలు నడుపుతూ ఆదివాసీలను ఆ భూముల్లోనే కూలీలుగా మార్చివేశారు. భూమి కోసం మొదలైన ఈ పోరాటం మితవాద బంధనాల్ని చేధించుకుని మిలిటెంట్ రూపాల్లోకి మారడంతో 18 పంచాయితీలలోని 220 గ్రామాలు కదలాయి. ప్రజలు 2,500 ఎకరాల భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకోవడంతో పాటు అనేక గ్రామాల నుండి వేలాది మంది ప్రజలు భూస్వాములు, వ్యాపారుల ఇండ్ల మీద దాడులు చేసి తరిమివేశారు. పోలీసులు, ప్రభుత్వం, భూస్వాములు కలిసి శాంతి సంఘాలు పెట్టినా, దాడులు చేసినా ప్రజలు సంఘటితంగా ప్రతిఘటించారు. కామ్రేడ్స్ సింగన్న, ఆంద్రులు ఈ పోరాటంలో అమరులయ్యారు. ఆ ఉద్యమంను రక్షించుకోవడంలో భాగంగానే నారాయణపట్నం, బందుగాం ప్రాంతాల్లో మిలీషియా, ప్రధాన బలగాలు ఆంబుష్‌లలో చాలా మంది పోలీసుల్ని మట్టుబెట్టి ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకువెడుతున్నారు.

ఇవ్వాళ అక్కడ శక్తులు పెరిగాయి. శ్రీకాకుళ ఉద్యమాన్ని పునఃప్రారంభించే పరిస్థితి వుంది. విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ వ్యతిరేక పోరాటం, నారాయణపట్నం ప్రజాప్రతిఘటన, ఖమ్మం జిల్లాలో పోలవరం నిర్వాసితుల పోరాటాలు, ఓపెన్‌కాస్టు గనుల వ్యతిరేక పోరాటాలు, ప్రత్యేక తెలంగాణా ఉద్యమం మనం తిరిగి ఆంధ్రా, ఉత్తర తెలంగాణాలలో బలం పుంజుకోవడానికి తోడ్పడతాయి. ఒడిషాలో మల్కన్‌గిరి, రాయగఢ, కందమాల్, నియమగిరి, నవరంగపూర్‌లలో మన శక్తులు పెరిగాయి. నియమగిరి ప్రజలు మావోయిస్టు పార్టీ రావాలి, తుపాకులు ఇవ్వాలి అంటున్నారు. ఆదివాసులలో కోందులు బాగా వెనకబడిన వారు. వీరు అందులో కూడా వెనకబడిన డోంగ్రియా కోందులు. వాళ్ల వేదాంతకు వ్యతిరేకంగా పోరాడడానికి సిద్ధపడుతున్నారు. ఛత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలలో జరుగుతున్న ఉద్యమాలు అందరికీ తెలిసినవే. వీటన్నిటి వెనుక విప్లవ పార్టీ కృషి వుంది.

**క్రాంతి:** ప్రజావిముక్తి సైన్యంగా మారాలంటే పి.ఎల్.జి.ఎ.లో ఎటువంటి మార్పులు రావాలి?

**బి.ఆర్.:** పి.ఎల్.జి.ఎ.లో అధిక శాతం ఆదివాసీ ప్రజలే. మనం కేంద్రీకరిస్తున్నది వెనుకబడిన ప్రాంతాల్లోనే. మనది వెనుకబడిన వ్యవసాయక దేశం. ఆదివాసీ ప్రజానీకం పరిస్థితి మరీ వెనుకబడి వుంది. భారతదేశంలో ఆదివాసులను పాలకులు మనుషులుగానూ, పౌరులుగానూ గుర్తించని పరిస్థితి. సామాజిక, ఆర్థిక విషయాల్లో అభివృద్ధి లేని కారణంగా విద్య అందుబాటులోలేదు. భావజాలంలో పరిమితి ఏర్పడింది. అంధ విశ్వాసాలు, అశాస్త్రీయ భావాలు వారిలో కొనసాగుతున్నాయి. వాటి నుండి బయటపడవేయాలి. ఇక్కడ ఉత్పత్తి పరిమితంగా వుంటుంది. మార్కెట్ సంబంధాలు పెరగకపోవడంతో జీవితం కూడా చాలా పరిమితమైపోయింది. విశాల ప్రాపంచిక రాజకీయ జ్ఞానాన్ని అందించాల్సి వుంది. వెనుకబాటుతనం, అశాస్త్రీయతల కారణంగా సందిగ్ధత, గందరగోళం రాకుండా తర్ఫీదు జరుగుతుంది. విద్యాకమిటీ నిర్వహణలో నడుపుతున్న మాస్, మోపాస్‌ల పాత్ర, సి.ఎన్.ఎం. ప్రదర్శనల పాత్ర పెరిగింది. అలాగే విప్లవోద్యమం రోజు రోజుకు విస్తరిస్తూ కొత్త కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నది. ప్రజలకు అనేక సమస్యలున్నాయి. అనేక రంగాల్లో, వివిధ సెక్షన్ల ప్రజలు నూతన తరహాలో కొత్త కొత్త పోరాట రూపాలనెంచుకుని పోరాడుతున్నారు. అయితే వారివద్ద రాజ్యాధికార అవసరాన్ని చెప్పి వారిని సాయుధ పోరాటానికి సిద్ధం చేయాలి. వారి వద్ద ఆయుధాలు లేవు. దోపిడీపాలక వర్గాల దగ్గర బలమైన సైన్యం, ఆయుధాలున్నాయి. రాజ్యం, చట్టం, కోర్టులు, జైళ్లు ఉన్నాయి. తరతరాలుగా దోపిడీ, అణచివేతల్లో సంపాదించిన అపారమైన అనుభవం, కుట్ర రాజకీయాలు, అనేక యుద్ధాలను నడిపిన చరిత్ర వుంది. అటువంటి బలమైన, క్రూరమైన శత్రువుతో తలపడాలంటే వ్యూహం–ఎత్తుగడల విషయంలో స్పష్టమైన రాజకీయ చైతన్యం కావాలి. మెరుగైన ఆయుధాలు ఉపయోగించాలి. పెద్ద పెద్ద ఫార్మేషన్స్‌తో యుద్ధాన్ని నిర్వహించాలి. అన్ని రకాల అవసరాలకు శక్తులను, వస్తువులను సిద్ధం చేసుకోవాలి. ప్రజలపై ఆధారపడి చేసే యుద్ధంలో ఒక క్రమబద్ధత, నిర్దిష్టత, స్పష్టత, సంకల్ప బలం, సమిష్టితత్వం, బాధ్యతపడే విధానం, క్రమశిక్షణ, నైపుణ్యం, ఉన్నతమైన చైతన్యం కావాలి. అందుకు అవసరమైన, ఉన్నతమైన శిక్షణను అందిస్తున్నాం.

సంసిద్ధత, సంకల్పబలం, త్యాగనిరతి, క్రమశిక్షణ గల పి.ఎల్.జి.ఎ. త్వరితగతిన పి.ఎల్.ఎ.గా అభివృద్ధి చెందుతుంది. రిక్రూట్స్ పెరుగుతున్నాయి. ప్రజలు సాయుధ పోరాటానికి సంసిద్ధంగా వున్నారు. శత్రువుపై దాడులు చేసి సంపాదించిన ఆయుధాలున్నాయి. మరిన్ని ఆయుధాలను సంపాదించి పి.ఎల్.జి.ఎ.ని మరింతగా అభివృద్ధి చేస్తాం. గెరిల్లా తరహా దాడుల్లో దెబ్బకొట్టడం, వేగంగా కదలడం, కేంద్రీకరణ–వికేంద్రీకరణ విధానాన్ని నైపుణ్యంతో అమలుచేయడంలో అనుభవం సాధించిన పి.ఎల్.జి.ఎ. చలన యుద్ధ తంత్రానికి అనుగుణంగా విన్యాసాలు చేయగల పి.ఎల్.ఎ.గా అభివృద్ధి చెందుతుంది.

గెరిల్లా యుద్ధం కన్నా చలన యుద్ధం పెద్దది. చలన యుద్ధంలో అన్ని రకాల కేంద్రీకరణ పెరుగుతుంది. బలగాల సంఖ్య పెరుగుతుంది. ముక్రాంలో మూడు రెట్లు బలగాలను కేంద్రీకరించాం. రేపు రేపు 5,6 రెట్లు కూడా పెంచాలి. భవిష్యత్‌లో మన బలగాల్లో చాలా మార్పు వస్తుంది.

**క్రాంతి:** బలమైన శత్రువు అంటున్నారు కదా! విప్లవోద్యమాన్ని ఎక్కువ బలంతో అణచివేయడానికి సైన్యాన్ని దింపాలనీ, విమాన దాడులు చేయాలని చర్చలు జరుగుతున్నాయి కదా ఎలా ఎదుర్కొంటారు?

**బి.ఆర్.:** ఇప్పుడు శత్రువు బలమైన వాడన్నది నిజం. విప్లవ శక్తులు ఎప్పుడూ ప్రారంభంలో తక్కువ సంఖ్యలోనే వుంటాయి. శత్రువు 10 శాతం దోపిడీ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తే విప్లవోద్యమం 90 శాతం పీడిత ప్రజలకు ప్రతినిధి. వారిమధ్య లాభాల కోసం వైరుధ్యాలు పెరిగి, సంక్షోభాల్లో చిక్కుకుని, క్రమంగా వాడి శక్తి తగ్గి క్షీణించేదే. ప్రజాయుద్ధం పెరిగి ప్రజల శక్తి అంచెంచెలుగా విస్తరించి వాడిని సర్వనాశనం చేస్తుంది. ఇది సమాజ చలన సూత్రాలు చెపుతున్న సత్యం. రష్యా, చైనా, వియత్నాం విప్లవాల చరిత్ర నిరూపించినది. వాడి యుద్ధం దాడి రూపంలో ఉంటుంది. విప్లవ యుద్ధం ఆత్మరక్షణ స్థితి నుండి దీర్ఘకాల ప్రజా యుద్ధ పద్ధతిలో పెరిగి ఒక క్రమంలో పి.ఎల్.ఎ. కూడా దాడి, నిర్మూలన పద్ధతులనే ప్రధానంగా ఎంచుకుని శత్రువును సర్వనాశనం చేస్తుంది. అందులో భాగంగా ముక్రాం ప్రతిఘటనను అర్థం చేసుకోవాలి. "శత్రువును ముక్కలు ముక్కలుగా విభజించి సంహరించాలి. "పది బెటాలియన్లను చికాకుపరచి ఒక బెటాలియన్‌ను మట్టు బెట్టాలి" అని మావో చెప్పాడు. కడుపునిండాలన్నా ఒక్కొక్క ముద్దనే తింటాం కదా! అలాగే శత్రువును కూడా నాశనం చేస్తాం.

సల్వాజుడుం ఓడిపోయింది. 'శాంతి' జపం చెల్లదిక. ప్రభుత్వం చేస్తున్నది బహిరంగ యుద్ధమే. ఛత్తీస్‌గఢ్‌లో గ్రీన్‌హంట్, బీహార్–జార్ఖండ్‌లలో గ్రీన్‌హక్, మరోచోట మరోపేరు. వీటన్నింటి అర్థం, లక్ష్యం మూడు సంవత్సరాలలో వేట, దాడి చేసి నక్సలైట్లను నిర్మూలించడం. కానీ చిదంబరం, ప్రభుత్వం ప్రజల మీద యుద్ధం చేస్తున్నట్లు ఒప్పుకోరు. 75 వేల మంది ప్రత్యేక బలగాలను, హెలికాప్టర్లను, ఆర్టిలరీ ఆయుధాలను ఉపయోగిస్తూ కూడా ఒప్పుకోరు. 50 వేల మందికి శిక్షణనిచ్చిన సైన్యం ఇంకో 50 వేల మంది సైన్యానికి తర్ఫీదును ఇవ్వడానికి ప్లాను చేస్తుంది. ఇది అంతర్యుద్ధమనీ, ప్రభుత్వ సైన్యాలు యుద్ధం చేస్తున్నాయని ఒప్పుకుంటే జెనీవా సదస్సుకు, ఆర్టికల్ 2కు కట్టుబడాల్సి వస్తుంది. యుద్ధ నియమాలు పాటించాలి. న్యాయ సూత్రాలు అమలు చేయాలి. అరెస్టయిన వారిని యుద్ధ ఖైదీలుగా గుర్తించాలి. ఇంకా చాలా చేయాల్సి వుంది. ఆ నిజాయితీ వారికి లేదు. కేంద్ర, రాష్ట్రాలు చేసిన సల్వాజుడుం, సేంద్ర, కోబ్రాలు, టైగర్లు, గ్రామసురక్ష, నాగరిక సురక్ష ప్రయోగాలన్నీ విఫలమయ్యాక, హత్యలు, అత్యాచారాలు, గృహ దహనాలు, లూటీలు, బీభత్సాలన్నీ ఉద్యమాన్ని అణచివేయలేవని అర్థమయ్యాక నేరుగా సైన్యాన్ని, వైమానిక దళాన్ని దింపి "సర్వం నిర్మూలన" చేయాలని పథకాలు వేస్తున్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఈ రకమైన దాడులను వ్యతిరేకిస్తున్నారు. 'నక్సలైట్లను, ఆదివాసీలను విడదీసి చూడలేం, ఆదివాసీల ప్రతిఘటనకు పాలకవర్గాల విధానమే కారణం' అని మేధావివర్గం మాట్లాడుతున్నారు. దేశంలోనూ, ప్రపంచ దేశాల్లో గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా బలమైన ప్రతిఘటనే వచ్చింది. మీడియాలో నెలల తరబడి పెద్ద చర్చనే జరిగింది. ముక్రాం తర్వాత ఆ చర్చలన్నీ మరింత ఊపందుకున్నాయి కూడా.

ఒకప్పుడు మన దగ్గర ఆయుధాల్లేవు. రెయిడ్స్, ఆంబుష్‌లలో మనం పైచేయి సాధించడంతోపాటు వందల ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. మన దగ్గరున్న రైఫిల్స్, సెమీ, ఆటో వెపన్స్ అన్నీ అలా సంపాదించినవే. ప్రజాయుద్ధం పురోగమించే క్రమంలో మరిన్ని దాడులు, ఆంబుష్‌లు జరుగుతాయి. విజయాలు సాధిస్తాం. మరిన్ని ఆయుధాలు సంపాదిస్తాం. మన బలగాలకు ప్రధానంగా ఆయుధాల సోర్సు శత్రువే. మరికొన్ని మనం తయారుచేస్తాం, సమకూర్చుకుంటాం.

గత కొద్ది కాలంగా మన బలగాలదే పైచేయిగా వుంది. మనం దెబ్బకొట్టిన ప్రతీ సందర్భంలోను పోలీసు, పారా మిలిటరీ బలగాల మనోస్థైర్యం దెబ్బతినడమే కాకుండా దిగజారుతుంది. ఇక్కడి అననుకూలత, అనారోగ్యాలు ప్రధానంగా ప్రజావ్యతిరేకత కారణంగా సెలవులు పెట్టడం,రాజీనామాలు చేయడం, అధికారుల ఆజ్ఞలను లెక్కచేయకపోవడంతో వారిలోనున్న మనోస్థైర్యం దెబ్బతిని మనపై దాడులకు సిద్ధం కావడంలేదు. అందులో ఒక సెక్షన్ ఈ తరహా చర్యలను ప్రజలపై దాడుల్ని బహిరంగంగా వ్యతిరేకిస్తున్నారు. అణచివేత పెరిగితే ప్రతిఘటన పెరుగుతుంది. అదే వాడి సైన్యానికి,

వైమానిక దాడులకు సమాధానమవుతుంది.

**క్రాంతి:** చివరగా, ప్రజాయుద్ధ స్వభావం ఏవిధంగా వుంటుంది?

**బి.ఆర్.:** ప్రజల మౌలిక సమస్యలైన తిండి, బట్ట, ఇల్లు, స్వేచ్ఛ పరిష్కారం అయ్యేవరకు నిరంతరం పోరాడుతూనే వుంటారు. భూమి, అడవి, నీరు లాంటి ప్రజలందరికి సంబంధించిన సమస్యలు సాధించుకోవడానికి, కాపాడుకోవడానికి ఉద్యమిస్తారు. ఈ రకమైన తక్షణ, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి భిన్నపోరాట రూపాలున్నాయి. సాయుధ పోరాటం కూడా అందులో భాగమే. ప్రజలు సంఘటితపడి సాయుధం, నిరాయుధంగా, రహస్యంగా బహిరంగంగా, వివిధ రూపాల్లో ప్రతిఘటించే పరిస్థితినే ప్రజాయుద్ధంగా అర్థం చేసుకోవాలి. సమస్యలు పరిష్కరించకుండా సాయుధంగా దాడులుచేసి అణచివేస్తే ప్రతిఘటన కూడా సాయుధంగానే, ప్రతిదాడిగానే వుంటుంది. ప్రజలు యుద్ధాన్ని యుద్ధం చేయడం ద్వారానే నేర్చుకుంటున్నారు. సాయుధ పోరాటానికి చాలా చరిత్ర వుంది. ప్రథమ భారత స్వతంత్ర సంగ్రామం (1857) నుండి కొన్ని వందలసార్లు ఆదివాసీ ప్రజలు, రైతాంగం సాయుధంగా పోరాడిన చరిత్ర వుంది. వీర తెలంగాణా పోరాటం, మన్యం పితూరీ, గదర్‌వీరుల చరిత్ర ఇలా ఎన్నో వున్నాయి. నక్సల్బరీ ఉద్యమ చరిత్ర ఆ కొనసాగింపుగానే అర్థం చేసుకోవాలి.

ఆదివాసులు, దళితులు, మైనారిటీలు, మహిళలు, నిరుద్యోగులు, నిర్వాసితులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు ఇలా ఎన్నో సెక్షన్ల ప్రజలు అనేక సమస్యలతో విప్లవోద్యమంవైపు వస్తున్నారు. మన ఉద్యమం 3,4 దశాబ్దాల కాలంలో (ఒకటి రెండు చోట్లు తాత్కాలికంగా దెబ్బతిన్నా) అనేక ప్రాంతాలకు విస్తరించడంతో పాటు సైనికంగా, నిర్మాణపరంగా, రాజకీయంగా బలపడింది. ఈ రోజు భారతదేశంలో ఒకే ఒక నిజమైన పార్టీ ప్రతిపక్షంగా సి.పి.ఐ.(మావోయిస్టు) నిలిచింది. అందుకే దోపిడీ పాలకవర్గాలు సి.పి.ఐ.(మావోయిస్టు)ను ఒకే ఒక తీవ్ర అంతర్గత భద్రత సమస్యగా చెబుతున్నారు. మొత్తం శక్తులను కేంద్రీకరిస్తున్నారు. దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజల నుండి మనల్ని వేరు చేయాలని దుష్టపన్నాగాలు పన్నుతున్నారు. ప్రజల అండదండలున్నంత వరకు పార్టీ, పి.ఎల్.జి.ఎ. సజీవంగా, నిత్య నూతనంగా, సృజనాత్మకంగా, విప్లవకరంగా అభివృద్ధి చెందుతుంది.

అందుకు అయిదు విషయాల మీద శ్రద్ధ వహిస్తున్నాం.

1) ప్రజల మౌలిక సమస్యల ఎడల చిత్తశుద్ధి, పట్టుదలతో కూడిన దీర్ఘకాలిక పోరాటం చేస్తున్నాం.
2) అన్ని సెక్షన్ల ప్రజలను, వివిధ పోరాట రూపాలలో సమీకరించే సమర్థతను పెంచుకుంటున్నాం.
3) శత్రువుల మధ్య వైరుధ్యాలను, బహీనతలను అర్థం చేసుకుని దెబ్బకొట్టే స్థితికి ఎదుగుతున్నాం.
4) అన్ని విషయాల్లోను ప్రజలపై ఆధారపడుతూనే ప్రజల్ని చైతన్యపరిచి సాయుధం చేస్తున్నాం.
5) కార్మికవర్గ నాయకత్వాన్ని, అన్ని వర్గాల మధ్య ఐక్యతను సాధిస్తున్నాం.

"బలహీనులు ఎక్కువ మంది వుండి బలవంతుడిని ఓడించవచ్చు"ని అర్థం చేయిస్తున్నాం. ప్రజల మధ్య ఐక్యతను సాధిస్తూ "ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని సాధించడం ద్వారానే విప్లవోద్యమం విస్తరిస్తున్న సత్యాన్ని గ్రహించి" ఆచరిస్తున్నాం. ఇదే ప్రజాయుద్ధ స్వభావం. ముక్రాం ఘటనను విడి ఘటనగా చూడకూడదు. అనేక దాడులు, ప్రతిఘటనల నుండి పెంపొందిన అనుభవం, గుణపాఠాలు నేర్పిన నైపుణ్యంగా చూడాలి. పి.ఎల్.జి.ఎ., ప్రజల శక్తి సమర్థతలు వున్నాయి. అందుకే సంఘటిత శక్తిగా అన్ని రకాల బలగాల సమ్మేళనంగా వున్నతమైన సమన్వయంతో అది విజయాన్ని పొందింది.

ఈ ఘటన పాలకవర్గాల గుండెల్లో రైళ్లు పరిగెట్టించిన మాట నిజం. శత్రువు ముందే రూపొందించుకున్న ఎల్.ఐ.సి. వ్యూహంతో ఇప్పుడు కొత్త డిప్లాయ్‌మెంటుకు పూనుకుంటున్నాడు. సైన్యాన్ని, వైమానిక దళాలను (సాధికారికంగా) నడపడానికి ప్రజల మద్దతు, చట్టం అనుకూలతలేదు. కాబట్టి వేరు వేరు మార్గాల్లో ప్రవేశపెడతాడు. ఇప్పటికే బలగాల తరలింపుకు గరుడ కమాండోస్‌ను, హెలికాప్టర్లను వినియోగిస్తున్నాడు. బ్రిగేడర్ ర్యాంకు వున్న మాజీ సైనిక అధికారులను నియమిస్తున్నాడు. ఇక ముందు మనపై దాడికి డివిజన్ స్థాయిలో తలపడవచ్చు. శిక్షణ, ప్రిపరేషన్స్‌లో వున్నారు. మన ఫార్మేషన్ కన్నా ఉన్నత ఫార్మేషన్‌లోనే దెబ్బకొట్టాలని ముందునుండే సామ్రాజ్యవాదులు ముఖ్యంగా అమెరికా ఎల్.ఐ.సి. పాలసీలో రాసి చిదంబరం లాంటి వారిని ఎంపిక చేసి మరీ గైడ్ చేస్తూ వున్నారు. ప్రజా యుద్ధంలో ఆ సవాల్‌ను ఎదుర్కోవడానికి ప్రజలను సంసిద్ధం చేయాల్సిన బాధ్యత పార్టీ మీద, పి.ఎల్.జి.ఎ. మీద, ప్రజాసంఘాల మీద వుంది.

ప్రజా సైన్యం లేకుండా ప్రజలకుండేదేమీ లేదు!
ప్రజలే చరిత్ర నిర్మాతలు!!

★

*(ముక్రాం–తాడిమెట్ల మధ్య జరిగిన ఘటనకు సంబంధించి 'క్రాంతి' ప్రశ్నలు రాసి పంపింది. వెంటనే స్పందించి సమాధానాలు రాసి పంపినందుకు కామ్రేడ్ బి.ఆర్.కు 'క్రాంతి' విప్లవాభినందనలు తెలియజేస్తున్నది)*

# వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసి, కార్పోరేట్లకు పట్టం కట్టిన 2010-11 కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు

ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ ఫిబ్రవరి 26న లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2010-11 వార్షిక బడ్జెట్ రూపకల్పనలో గ్రామీణ, సామాజిక రంగాలకు కేటాయింపులు, పన్ను రాయితీలతో సగటు జీవులను, గ్రామీణ బడుగు వర్గాలను అలరిస్తున్నట్లుగా కనిపిస్తూనే మరోవైపు భారీ వడ్డనలకు పూనుకున్నాడు. 'ఆమ్ ఆద్మీ' దండకం పఠిస్తూనే విదేశీ పెట్టుబడి సంస్థల, దేశీయ గుత్త పెట్టుబడి సంస్థల పంట పండించే సంస్కరణల ఎజెండాను ముందుకు తీసుకువచ్చాడు. ద్రవ్య లోటును 6.85 శాతం నుంచి తక్షణమే 5.85 లేదా 5 శాతం వరకు కుదించటం, తర్వాత వచ్చే సంవత్సరం చివరికల్లా 9 శాతం వరకు నిర్దేశించిన వృద్ధి రేటును సాధించుకోవటం తమ బడ్జెట్ లక్ష్యంగా చెప్పాడు. అసలు ఒకపక్క విపరీతంగా ధరలు పెరిగి సామాన్యుల జీవితాలు అతలాకుతలం అవుతుంటే ధరలను అదుపు చేసే ప్రస్తావనే బడ్జెట్‌లో లేదు. పాలకపక్షం వహించే ఆర్థిక వేత్తలు బడ్జెట్‌పై మెచ్చుకోలు ప్రశంసలు కురిపిస్తే, 10 శాతం వరకు 'అభివృద్ధి రేటు' సాధిస్తామంటున్న ఆర్థిక మంత్రి వ్యాఖ్యానాలపై నిష్ణాతులైన ఆర్థిక విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. సర్వవ్యాపిత అభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి కంకణం కట్టుకున్నామని చెప్పుకుంటున్న యు.పి.ఎ.-2 ప్రభుత్వం తెచ్చిన ఈ బడ్జెట్ నిజంగా ఆమ్ ఆద్మీ బడ్జెట్టా, ఆమ్ ఆద్మీని ముంచే బడ్జెట్టా పరిశీలించవలసిన అవసరం వుంది.

## వ్యవసాయానికి శూన్య హస్తం

మనది ప్రధానంగా వ్యవసాయ దేశం. దేశ జనాభాలో అధిక భాగం జనాభా పల్లెల్లో నివసిస్తూ వ్యవసాయం, దాని అనుబంధ రంగాల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇటువంటి వ్యవసాయ రంగం వృద్ధి రేటు మైనస్ 0.2కు దిగజారింది. మొత్తం దేశీయ ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 15.7 శాతానికి పడిపోయింది. వ్యవసాయ ప్రధాన దేశంలో ఇంత హీన స్థితికి కారణం పాలక ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలే. వ్యవసాయం భారమై 40 శాతం పైగా వ్యవసాయదారులు వ్యవసాయాన్ని వదిలిపెట్టాలనే తలంపుతో వున్నారు. వ్యవసాయంలో ఉపాధి కోల్పోయిన ప్రజలు పొట్టచేత పట్టుకుని పట్టణాలకు వలస పోవటం దిన దినం పెరుగుతున్నది. ఆత్మాభిమానంతో వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతుకు ఏదారీ దొరకనినాడు ఆత్మహత్యే శరణ్యమవుతున్నది.

ఇంతటి దుస్థితిలో ఉన్న రైతుకు ఊపిరి పీల్చుకునే వెసులుబాటు కల్పించే ఆలోచన లేని ఆర్థిక మంత్రికి పారిశ్రామిక వేత్తల కష్టాలు మాత్రం బాగానే కన్పిస్తున్నాయి. వ్యవసాయ రంగ వృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా ఆర్థిక మంత్రి నాలుగు సూత్రాల కార్యక్రమాన్ని ప్రతిపాదించాడు. అవి: 1. ఉత్పత్తి పెంచటం 2. దుబారాను అరికట్టడం 3. మరిన్ని రుణాలు 4. ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధి. సబ్సిడీల కోత, ఎరువుల ధరల పెరుగుదల, సాగునీటి కొరత సమస్యలను పరిష్కరించకుండా ఉత్పత్తి ఎలా పెరుగుతుంది? ఇక దుబారాను అరికట్టడానికి సంబంధించి రైతు స్థాయిలో జరిగేది కాదు. రైతు పని పంట పండించడమే. దుబారా జరిగేది. రవాణాల్లో, ప్రభుత్వ గోదాముల్లో. వాటిని పరిష్కరించాల్సింది ప్రభుత్వం. మరిన్ని రుణాలివ్వాల్సింది బ్యాంకులు. రైతుల రుణావసరాల్లో 27 శాతమే బ్యాంకులు తీరుస్తున్నాయి. బ్యాంకులు ఇవ్వాల్సిన 18 శాతాన్ని పూర్తిగా ఇవ్వటం లేదు. ఇదీ ప్రభుత్వ బాధ్యతే. ఆగ్రో-ప్రాసెసింగ్ పరిశ్రమల్లో కార్పోరేట్ సంస్థలు ప్రవేశించనున్నాయి. అక్కడ వచ్చే లాభాలు రైతుకు చేరవు. ఈ నాలుగు పనులు జరగటం ప్రభుత్వ శాఖల పరిధిలో వుంది. ఇందుకు ప్రభుత్వం ఏమి చేస్తుందనేది ఆర్థిక మంత్రి వివరించలేదు.

ఇంత ముఖ్యమైన వ్యవసాయ రంగానికి ప్రణాళికలో కేటాయింపులు 12,308 కోట్లు. గతంకంటే రెండు వేలకోట్లు మాత్రమే పెంచారు. ఇది మొత్తం ప్రణాళిక కేటాయింపులో 1.93 శాతం నుంచి 2.35 శాతానికి మాత్రమే పెరుగుతుంది. కాని పరిశ్రమలు గనుల రంగానికి వచ్చేసరికి ఈ పెరుగుదల 9 వేల కోట్లు. ఇదీ ఆమ్ ఆద్మీ అని చెప్పుకుంటున్న ప్రభుత్వం తీరు. వ్యవసాయానికి మొత్తం ప్రణాళిక కేటాయింపు 8.6 శాతం పెరుగుతున్నట్లు కనిపించినా పెరిగే ద్రవ్యోల్బణాన్ని లెక్కలోకి తీసుకుంటే ఖర్చు అయ్యేది ప్రస్తుత సంవత్సరం కన్నా తక్కువే.

వ్యవసాయ రంగాన్ని ఉద్ధరించడానికి అంటూ హరిత విప్లవాన్ని ఈశాన్య భారతదేశానికో, మరెక్కడికో విస్తరించే ప్రయత్నం జరుగుతున్నది. 1969-70ల హరిత విప్లవం భూస్వామ్య వర్గాల్లోనే పెట్టుబడిదారీ అనుకూల వర్గాన్ని సృష్టించింది. ఈ వర్గమే దళారీ పెట్టుబడిదారీ వర్గంగా ఎదిగి, అధికారంలో భాగమై విదేశీ పెట్టుబడికీ, సామ్రాజ్యవాదానికి దేశాన్ని తాకట్టు పెడుతున్నది. ఇప్పుడు తీసుకు రావాలనుకుంటున్న హరిత విప్లవం కూడా ఈశాన్య, తూర్పు, మధ్య భారతంలో పెల్లుబుకుతున్న జాతి విముక్తి, విప్లవ పోరాటాలను నీరుగార్చి

నయా ఉదారవాద ప్రపంచీకరణను నెత్తినెత్తుకొని మోసే పక్కా దళారీ వర్గాన్ని సృష్టించడం కోసమే.

యు.పి.ఎ. ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల వలన ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. అవే విధానాలను మరింత వేగంగా అమలు చేయడంలో భాగంగా లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల్లో నుండి ప్రభుత్వం పెట్టుబడులను ఉపసంహరిస్తున్నది. బీమా, బ్యాంకింగ్ రంగాల్లో పెట్టుబడులను సరళీకరించ పూనుకుంటుంది. చిల్లర వ్యాపారం, విద్య, ఇతర రంగాలలోకి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్.డి.ఐ.) ఆహ్వానించింది.

ప్రజల జీవన పరిస్థితులు దుర్భరం కావడమే కాకుండా రోజు రోజుకూ దిగజారిపోతున్నాయి. ముఖ్యంగా ఆహారం, నిత్యావసర వస్తువుల ధరలు అనేకరెట్లు పెరిగిపోయి వాటిని ప్రజలు కొనడమే గగనమైపోతుంది. ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న ధరల పెరుగుదల సమస్యను పరిష్కరించే చర్యలేమీ బడ్జెట్‌లో లేవు. ఈ బడ్జెట్ ఏరకంగానూ ద్రవ్యోల్బణాన్ని అరికట్టే అవకాశాలు లేవు. పైగా మరింత పెంచేదిగానే వుంది. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెరిగే బహుముఖ వ్యూహమేమీ లేకుండా వరుణ దేవుడి కరుణను కోరటమంటే వ్యవసాయంపై ఆధారపడిన 60 శాతం ప్రజల జీవనోపాధినీ, దేశ ఆహార భద్రతను గాలికి వదిలేయటం తప్ప మరొకటి కాదు.

## ఆమ్ ఆద్మీకి శఠగోపం

సామాన్య ప్రజలకు సంబంధించిన విద్యా, వైద్యం, నీటి సరఫరా, పారిశుద్యం, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి, ఎస్.సి., ఎస్.టి., మైనారిటీలు, కార్మికులు, ఉపాధి, మహిళలు, సామాజిక భద్రత, పోషకాహారం మొదలయిన సామాజిక సేవలకు ఈ బడ్జెట్‌లో 1,27,571 కోట్లు ఖర్చు చేస్తారు. ఇవన్నీ ఆమ్ ఆద్మీకి సేవలందించే రంగాలు. సంపన్నులు ఉన్నత, మధ్యతరగతి జనాభా 30 శాతాన్ని మినహాయిస్తే 70 శాతం ప్రజలకు చేసిన కేటాయింపు ఇంతే. ఈ రంగాల కేటాయింపులు విడి విడిగా చూస్తే ఉదాహరణకు వైద్యమే తీసుకుంటే ఆ కేటాయింపులు అధిక భాగం పట్టణ, నగర ఆసుపత్రులకు పోగా గ్రామీణ ప్రజల వైద్యానికి మిగిలేది ఎంగిలి మెతుకులే. మొత్తం ప్రణాళికలో ఈ రంగాలన్నింటికీ, అంటే 70 శాతం ప్రజలకు ఖర్చు చేయబోయేది 25 శాతమే. ఇదీ ఆమ్ ఆద్మీ బడ్జెట్‌లో కేటాయింపులు. ఈ అరకొర విదిలింపులతో 70 శాతం సామాన్య ప్రజల బతుకు సంవత్సరం తర్వాత ఎక్కడేసిన గొంగడి అక్కడే అవుతుంది. అసలు ఆమ్ ఆద్మీ అంటే పాలకులకు ఎక్కడిలేని చిరాకు. వారి గురించి మాట్లాడే మాటలన్నీ కడుపులో విషం, నోట్లో అమృతం.

ఇక ఆమ్ ఆద్మీకి సంబంధించిన గ్రామీణాభివృద్ధి కోసం అంటే ఆరు లక్షల గ్రామాల్లో నివసించే 70 శాతం ప్రజల అభివృద్ధి కోసం గత బడ్జెట్‌లో కంటే అదనంగా కేటాయించింది 3 వేల 600 కోట్ల రూపాయలు మాత్రమే. ఇందులోనే గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకం, గ్రామీణ జీవనోపాధి మిషన్ మొదలయినవి కలిసి వుంటాయి. ఉపాధి హామీ పథకానికి ఘనంగా కేటాయింపులు చేసినట్లు చెప్పుకుంటున్నారు. వాస్తవానికి ఈ నిధులన్నీ అవినీతి రాజకీయాలతో ఎవరికి అందుతున్నాయో అందరికీ తెలిసిందే.

ఎక్సైజ్ సుంకం పెంచి 32 వేల కోట్ల అదనపు ఆదాయం తెస్తామని బడ్జెట్ అంచనాలు చూపుతున్నారు. పారిశ్రామిక వేత్తల మీద పడే ఈ ఎక్సైజ్ సుంకపు భారాన్ని వాళ్లు ప్రజల మీదకే నెడుతారు. సిమెంటు, ఉక్కు వంటి పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు పెరిగి ఆ బరువు గృహ నిర్మాణం మీదపడి మధ్యతరగతి ఆ భారాన్ని మోయక తప్పదు. వేతన జీవులకు ఆదాయ వర్గాలకు ఆదాయ పన్నులలో వెసులుబాటు కల్పించినట్లే కల్పించి పెట్రోల్, డీజిల్ ధరలు, గృహ నిర్మాణ ఖర్చు పెంచి ఒక చేత్తో ఇచ్చిన దాన్ని మరో చేత్తో లాగేసుకుంటున్నారు. ఇది అమెరికా సామ్రాజ్యవాదపు కొత్త వారసుడు ఒబామా బుర్రలో పుట్టిన ఫెయిర్ టాక్స్‌కు నకలు. నేరుగా ప్రజల ఆదాయం మీద భారీగా పన్నులు వేయకుండా పరోక్ష పద్ధతిలో వారి వ్యయం మీద పన్నులు వేయడం ఈ కొత్త విధాన లక్ష్యం. గత రెండు దశాబ్దాలుగా ఆర్థిక సంస్కరణలు, వుదారవాద విధానాలతో వినియోగ సంస్కృతిని విచ్చలవిడిగా పెంచి ఇందుకు బాటలు వేశారు. ఆదాయ పన్ను రాయితీలతో, పొదుపు పథకాల్లో ప్రజలు వెనకేసుకున్న నాలుగు రాళ్లను పరోక్ష పన్నులతో జేబులకు కత్తెర వేసి ఖాళీ చేస్తారు. బడ్జెట్ ప్రతిపాదనలు ఏ విధంగానూ ఆమ్ ఆద్మీకి ప్రయోజనకరమైనవి కావు. అయినా ప్రధాని దృష్టిలో, సోనియా దృష్టిలో ఇది బ్రహ్మాండమైన బడ్జెట్.

## వ్యాపార వర్గానికి పెద్ద హస్తం

ఇది పారిశ్రామిక వాణిజ్య వర్గాలకు డ్రీమ్ బడ్జెట్. చిదంబరం బాటలోనే ప్రణబ్‌ముఖర్జీ రెండవ బడ్జెట్ కూడా పయనిస్తోంది. అధికారానికి ప్రమాదంగానీ, సమీపంలో ఎన్నికలుగానీ లేకపోవటంతో యు.పి.ఎ.–2 ప్రభుత్వం ఏదైతే చేయాలనుకుందో దానిని నిర్భయంగా చేస్తున్నది. కార్పొరేట్లు, పారిశ్రామిక వర్గాలు కోరుకున్నట్లుగా ఈ బడ్జెట్ రూపొందించారు. అందుకే వారు హర్షాతిరేకాలు వెల్లడిస్తున్నారు. రెండంకెల వృద్ధి లక్ష్యంతో సాగుతున్న ప్రయాణంలో సామాన్యులు అధికంగా కోల్పోతుంటే, కార్పొరేట్లు, పారిశ్రామిక, వాణిజ్య వర్గాలు అధికంగా సొమ్ము పోగేసుకుంటున్నాయి. ఈ వర్గాలకు ఇచ్చిన రాయితీలు చూస్తేనే కళ్లు బైర్లు కమ్ముతాయి. కార్పొరేటర్లకు ఇచ్చిన పన్నుల మినహాయింపు వల్ల 26,000 కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయింది. దీంతో దేశంలోని 30 కోట్ల బీద వాళ్లకు కనీసం వంద రోజుల ఉపాధి సృష్టించవచ్చు. అదే సామాన్య

ప్రజలకు కేటాయించిన ప్రతి పైసా తిరిగి రాబట్టే విధంగానే బడ్జెట్ రూపొందించారు.

పారిశ్రామిక వృద్ధిరేటు 9.25 శాతంగా పెరిగిందని ప్రభుత్వం చెప్పుకుంటున్నది. కాని ఆర్థిక మాంద్యం నుండి కార్పోరేట్ రంగాన్ని బయటపడేయడానికి మూడు విడతలుగా ఉద్దీపన ప్యాకేజీల కింద ఐదు లక్షల కోట్ల రూపాయలు అప్పనంగా దోచిపెడితేనే ఇది సాధ్యమైంది. ఇప్పుడు దీన్ని పెంచి పోషించే ప్రయత్నాలు జరుగుతున్నాయి తప్ప, 70 శాతం ప్రజానీకానికి జీవనాధారం అయిన వ్యవసాయ రంగానికి ఒరగబెడుతున్నది ఏమీ లేదు. వుద్దీపన ప్యాకేజీలు ఉపసంహరిస్తున్నామని ప్రభుత్వం అంటున్నది గాని భారీ యెత్తున ప్రభుత్వ వ్యయానికి తెరలేపారు. మౌలిక వసతుల ప్రాజెక్టులపై ప్రణాళికా వ్యయంలో 46 శాతం నిధులు వెచ్చించటం ఇందులో భాగమే. ఇది కార్పోరేట్, పారిశ్రామిక రంగాల వృద్ధి రేటును కాపాడే వ్యయ యజ్ఞం తప్ప మరొకటికాదు. సర్కారు వ్యయం బడా కాంట్రాక్టర్ల, రాజకీయ నాయకుల సంపదను మరింత పెంచుతుంది.

## ప్రైవేటుకు పట్టం

ప్రైవేట్ రంగానికి పెద్ద పీట వేయడానికి ప్రభుత్వం తలపెట్టింది. అందుకు బడ్జెట్‌లో భారీ ప్రోత్సాహకాలు కల్పించింది. ద్రవ్యలోటు పూడ్చుకోవడానికి లాభాలు గడిస్తున్న నవరత్న ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మి నలభై వేల కోట్ల రూపాయలు పోగేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ద్రవ్యలోటు పూడ్చుకోవడానికి ఉత్పత్తి పెంచకుండ, బడా బాబుల ముక్కుపిండి పన్నులు వసూలు చేయకుండా ఈ మార్గాన్ని ఎంచుకోవటమంటే, ఈ పేరుతో దశాబ్దాలుగా కూడబెట్టిన ప్రజల సంపదను ప్రైవేటు రంగానికి ధారదత్తం చేయటమే. ఇకిప్పుడు బ్యాంకింగ్ రంగానికి ఎసరు పెట్టింది. ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు సిద్ధం అవుతున్నది. టాటాలు, బిర్లాలు, అంబానీలు బ్యాంకింగ్ రంగంలోకి ప్రవేశించడానికి ఈ బడ్జెట్ మార్గం సుగమం చేసింది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య నమూనా (పి.పి.సి.) మాత్రం దిన దిన ప్రవర్థమానమవుతూ సంపూర్ణ ప్రైవేటు భాగస్వామ్యం దిశగా అతి వేగంగా పరుగులు తీస్తున్నది. ప్రస్తుతం అతిపెద్ద టెలికాం కంపెనీ అయిన బి.ఎస్.ఎన్.ఎల్.ను పూర్తిగా ప్రయివేటీకరించేందుకు వధ్యశిల పైకి తెచ్చింది. ఇందుకు సలహాలిస్తున్న సామ్ పిట్రోడా నాలెడ్జీకి ప్రభుత్వం కమీషన్ కూడా ముట్టజెపుతున్నది. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించటం ఇప్పటికప్పుడు జరుగుతున్నదేమీ కాదు. 1991లో సంస్కరణలు మొదలు పెట్టినపుడే ఇది ప్రారంభమైంది. రాను రాను ఊపందుకుంటున్నది. ప్రభుత్వ విధానాన్ని ప్రైవేటు రంగం ఎలా సొమ్ము చేసుకుంటుందో పట్టిక చూస్తే అర్థమవుతుంది.

పట్టిక ప్రకారం పైన చెప్పిన కాలంలో పబ్లిక్ రంగం లాభాలు రెట్టింపు వుంటే, ప్రైవేట్ రంగం సుమారు అయిదు రెట్లు లాభాలార్జించింది. వాటి ఆస్తులు పబ్లిక్ రంగంలో సుమారు రెట్టింపు దాటితే, ప్రైవేటు రంగంలో నాలుగు రెట్లు పెరిగాయి. ఉద్దీపన పథకం అమలు జరిగిన కాలంలో ఇవి ఇంకా లాభాలార్జించి వుంటాయి. ఎలాగంటే అసలు ఉద్దీపన పథకాలు వారి లాభాలను, ఆస్తులను రక్షించడానికే గనుక. ముందు ముందు ప్రభుత్వం తన బాధ్యతలను పూర్తిగా ప్రైవేటు రంగానికే అప్పజెప్పడానికి సిద్ధమవుతున్నది. అంటే ఆమ్ ఆద్మీని కార్పోరేట్, వ్యాపార వర్గాల దయా దాక్షిణ్యాలపై బతికే స్థితికి నెడుతున్నది.

బడ్జెట్‌లో సంపన్న వర్గాలను బాగుచేసే పథకాలు, కేటాయింపులు ఇలా వుంటే, రక్షణ రంగానికి నానాటికి కేటాయింపులు పెరిగిపోతున్నాయి. గత బడ్జెట్‌లో కంటే ఈ బడ్జెట్‌లో 4 శాతం పెంచి, రక్షణ పద్దును 1 లక్షా 47 వేల 344 కోట్లు చేశారు. మొత్తం బడ్జెట్‌లో ఇది 11 శాతం. భారీ స్థాయి రక్షణ వ్యయంలో భారత్ ప్రపంచంలో 10వ స్థానంలో వుంది. 1988–89లో 13 వేల 341 కోట్లుగా వున్న రక్షణ బడ్జెట్ ఇప్పుడు లక్షన్నర కోట్లకు పెరిగిపోయింది. ఇదే కాలంలో మొత్తం ఆఫ్రికా ఖండం సైనిక వ్యయం 12 బిలియన్ డాలర్ల నుంచి 16 బిలియన్ డాలర్లకు మాత్రమే పెరగ్గా, భారత సైనిక వ్యయం తగ్గిందెన్నడూ లేదు. మేరు పర్వతంలా అది నిరంతరం పెరిగిపోతూనే వుంది. దక్షిణిసియాలో భారత్‌కు రాగల యుద్ధ ప్రమాదమేదీ లేనప్పటికీ ఒక అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దేశం ఇంతటి భారీ స్థాయి సైనిక వ్యయం చేస్తున్నది. దీనికి కారణం అది అమెరికా అగ్రరాజ్యానికి దక్షిణాసియాలో స్థానిక పోలీసుగా వ్యవహరించటం, సామ్రాజ్యవాద ఆయుధ కంపెనీలకు బంగారు బాతుగా మారటం. అంతేగాక, ఈ భారీ రక్షణ వ్యయంతో దళారీ ప్రభుత్వం

**1616 కంపెనీల బ్యాలెన్స్ షీట్ల విశ్లేషణ (రూ. కోట్లు)**

| | 2002–03 | 2003–04 | 2004–05 | 2005–06 | 2006–07 | 2007–08 | 2008–09 |
|---|---|---|---|---|---|---|---|
| నికరలాభం | | | | | | | |
| పబ్లిక్ | 28363 | 36870 | 47382 | 45020 | 59124 | 65784 | 56686 |
| ప్రైవేట్ | 23550 | 36672 | 60176 | 76163 | 117989 | 157275 | 116822 |
| మొత్తం ఆస్తులు | | | | | | | |
| పబ్లిక్ | 340468 | 383150 | 435901 | 491998 | 565295 | 676906 | 788608 |
| ప్రైవేటు | 629891 | 699894 | 828947 | 1018511 | 1366683 | 1889071 | 2309119 |

సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు, స్వదేశీ కార్పోరేట్‌లు దేశంలోని అపార ఖనిజ సంపదలను, సహజ వనరులను యధేచ్ఛగా దోచుకునేందుకు అడ్డంకులు లేకుండా రక్షణ కల్పించడానికి, దేశంలో కొనసాగుతున్న వివిధ జాతుల పోరాటాలను, మావోయిస్టు విప్లవోద్యమాన్ని అణచివేయడానికి నిశ్చయించుకుంది.

## రాష్ట్ర బడ్జెట్

దేశ బడ్జెట్ చిత్రం ఈ విధంగా వుంటే, ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌ను 1 లక్షా 13 వేల 675 కోట్ల రూపాయలతో ముఖ్యమంత్రి రోశయ్య శాసనసభలో ప్రవేశపెట్టాడు. పదిహేనుసార్లు బడ్జెట్లు సమర్పించిన రోశయ్య అంకెల గారడీ ఈ బడ్జెట్‌లో కూడా స్పష్టంగానే కన్పించింది. అప్పులు, కేంద్ర నిధులు, పన్ను వసూళ్లు, మద్యం రాబడి అనే నాలుగు స్తంభాలు ప్రధానాధారంగా బడ్జెట్‌ను రూపొందించాడు.

బడ్జెట్ కేటాయింపుల అంకెలు ఘనంగా చూపినప్పటికీ కోతలు కూడా అంతే పెట్టాడు. జలయజ్ఞానికి, ఉచిత విద్యుత్ సబ్సిడీకి, రెండు రూపాయల కిలో బియ్యం పథకానికి, ఆర్థికంగా వెనకబడిన వర్గాల స్కాలర్‌షిప్‌ల పద్దుకు కలిపి మొత్తం మీద రూ. 4879 కోట్లు కోతలు పడ్డాయి. అదే సమయంలో విద్య, పంచాయితీరాజ్, మున్సిపాలిటీ, స్త్రీ, శిశుసంక్షేమం, వ్యవసాయం, సాంఘిక, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమం, సంక్షేమ పించన్లు, స్కాలర్‌షిప్పులు–ట్యూషన్ ఫీజుల చెల్లింపులకు కలిపి గత సంవత్సరంకంటే రూ. 5520 కోట్లు పెంచారు. తద్వారా ఉద్యమాలతో రాష్ట్రం అట్టుడుకుతున్న నేపథ్యంలో సామాన్యుల కోపాన్ని చల్లబరచాలని చూశాడు. అదేవిధంగా ప్రజా ప్రతినిధులను సంతోషపెట్టడానికి ఎమ్మెల్యేల ఎమ్మెల్సీల నియోజక వర్గ నిధులను రూ. 50 లక్షల నుంచి కోటికి పెంచాడు. వ్యవసాయ రంగం పట్ల ఆమాత్రం ప్రేమ చూపలేకపోయాడు.

రాష్ట్ర ఆర్థిక ప్రగతి అద్భుతంగా వున్నట్లు ముఖ్యమంత్రి బడ్జెట్ ప్రసంగంలో చిత్రించాడు. కానీ వాస్తవానికి గవర్నర్ చెప్పిన ప్రకారం 5.1 శాతం తగ్గింది. గత సంవత్సరం కూడా ముందు ఇలాగే చెప్పి, తర్వాత ఖజానాపై భారం పడిందని వ్యాట్ పన్ను, ఆర్టీసీ ఛార్జీలు, రవాణా ఛార్జీలు, గనుల సీనరేజిని ప్రభుత్వం పెంచింది. పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ ఏడాది రవాణా ఛార్జీలు, కొత్త పన్నుల వడ్డన తప్పదు. ప్రపంచ బ్యాంకు రుణాల పైన అతిగా ఆశలు పెట్టుకున్నారు గనుక, ఆశించినంత రాకపోతే యూజర్ ఛార్జీల మోత తప్పదు. నిధుల కొరత అని చెప్పి గత సంవత్సరం చివర్లో అన్నింటికీ కొరతలు పెట్టారు. ఈ సంవత్సరం కూడా అది తప్పేటట్లు కన్పించటం లేదు. పావలా వడ్డీ చెల్లింపులు చేనేత రుణాల మాఫీ, మధ్యాహ్న భోజన పథకంతో సహా అన్నింటికీ నిధుల కొరతనే. నిధుల కొరత అంటూ అన్నింటికీ కోతలు పెట్టిన రోశయ్య బడ్జెట్ ఖర్చు పెట్టిన ప్రతీ పైసా రాబట్టడానికి మాత్రం అన్ని మార్గాలను పకడ్బందీగా తయారు చేసి పెట్టింది. జనంతో మద్యాన్ని పూటుగా తాగించి ఖజానా నింపాలని ప్రభుత్వం నిశ్చయించుకుంది. అందుకే బెల్ట్ షాపులకు అడ్డూ అదుపు లేకుండా అనుమతులిచ్చింది. ఇప్పటి వరకు రాజధాని, శివార్లలో భూములమ్మి బొక్కసం నింపుకుంటున్న ప్రభుత్వం ఇక రాష్ట్రంలో ఎక్కడైనా భూములు అమ్మటానికి సిద్ధమైంది. ప్రపంచంలో ఏ ప్రభుత్వానికి లేని భూములమ్ముకునే దరిద్రం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే పట్టింది. ఇక కాంగ్రెస్ లీడర్ల భూ ఆక్రమణలకు అడ్డేలేదు.

రైతు పక్షపాతినని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఒరగబెట్టిందేమీ లేదు. పంట పొలాలకు 9 గంటల విద్యుత్ నినాదాలకే పరిమితమైంది. వ్యవసాయ రుణాల మాఫీకింద లబ్దిదారులైన రైతులకు మళ్లీ రుణసౌకర్యం లేదు. మద్దతు ధర లేని పంటలకు రుణాలివ్వద్దని బ్యాంకర్లకు ఆదేశాలిచ్చారు. దుబారా ఖర్చులు, మానసిక రుగ్మతలు రైతుల ఆత్మహత్యలకు కారణమని చులకనగా మాట్లాడారు. 'వరి పండించే రైతులు సోంబేరులు, చేతకాని వారు' అని రైతును అవమానించారు. కరువు, ఆపైన వరదలతో బికారులుగా మారిన రైతులను ఆదుకోవడానికి బడ్జెట్‌లో ఏమీలేదు. కేంద్రం ప్రకటించిన తక్షణ సాయం వేయి కోట్ల రూపాయలు రైతులకు సరిగా అందిన దాఖలాలేదు. రాను రాను వ్యవసాయానికి కేటాయింపులు తగ్గిస్తూ, వ్యవసాయమే దండగ అనే స్థితికి దిగజార్చిన ప్రభుత్వం కార్పోరేట్ ఆసుపత్రులకు దోచి పెట్టడానికి ఆరోగ్య శ్రీకి మాత్రం కేటాయింపులు పెంచింది. సెజ్‌ల పేరిట బక్క రైతుల పంట పొలాలను బడా బాబులకు ధారదత్తం చేయటం నిరాఘాటంగా సాగించదలిచింది. అసలు రైతును గాలికొదిలి ఆదర్శ రైతు పేరిట సొంత పార్టీ కార్యకర్తల ఉపాధికి బాటలేసింది.

స్థూలంగా రోశయ్య బడ్జెట్ ప్రజల కోసం చేసే ఖర్చులలో కోతలు, ప్రజల నుంచి రాబట్టే పద్దులో పన్నుల మోతలు, ఛార్జీల వాతలతో చేసిన అంకెల గారడి.

## చివరిగా

ఎన్నికల రాజకీయాలతో కూడుకున్న వ్యవస్థీకృతమైన దోపిడీ రాజకీయార్థిక వ్యవస్థలో బడ్జెట్ గణాంకాల గారడీ అనేది ప్రజల ప్రమేయంతో, ఆమోదంతో సంబంధంలేని ఒక కఠోర వాస్తవం. సామాన్య మానవుణ్ణి తన కాళ్ల మీద తనను నిలబెట్టే వ్యవస్థలోనే ప్రజల బడ్జెట్‌లతో ప్రజలకు న్యాయం చేకూరుతుంది తప్ప స్టాక్ మార్కెట్ కొలమానమైన బడ్జెట్‌లతో సామాన్యులకు న్యాయం జరగదు.

★

# సి.పి.ఐ.(మావోయిస్టు) కేంద్ర రీజినల్ బ్యూరో కార్యదర్శి కామ్రేడ్ ఆనంద్‌తో మావోయిస్టు ఇన్ఫర్మేషన్ బులెటిన్ (ఎం.ఐ.బి) ఇంటర్వ్యూ

**ఎం.ఐ.బి:** *మీరు దేశంలో సాయుధ పోరాటం జరుగుతున్న ప్రాంతాల్లో చాలా ముఖ్యమైన ప్రాంతానికి కార్యదర్శిగా శత్రు విధానాలు, పథకాలు, ఎత్తుగడలను అధ్యయనం చేస్తున్నారు గదా! మావోయిస్టులపై అంతిమ దాడి లేదా యుద్ధానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సన్నాహాలను మీరు ఏ విధంగా చూస్తున్నారు?*

**ఆనంద్:** స్పష్టంగా చెప్పుకోవలసి వస్తే ఇది మా పార్టీ ఊహించనిదేమీ కాదు. వాస్తవానికి, గత అనేక సంవత్సరాలుగా మేము క్రూరమైన యుద్ధంలో వున్నాం. ఉత్తర తెలంగాణలో వర్గపోరాటం తీవ్రమయ్యే క్రమంలో పెద్దయెత్తున శత్రుదాడి వుంటుందనే అంచనాతోనే స్పష్టమైన అవగాహనతో 1980ల ప్రారంభంలో మేము దండకారణ్యానికి విస్తరించాము. ఆవిధంగా అవసరమనే దండకారణ్యానికి రిట్రీట్ అయ్యే సన్నాహాలు చేసుకున్నాం. వర్గపోరాట అభివృద్ధి క్రమంలో అదే రుజువయ్యింది. ఉత్తర తెలంగాణలోను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా బలమైన పోరాటం, ప్రజా పోరాటాలు, ప్రజల సాయుధ ప్రతిఘటనా వెల్లువను సృష్టించినప్పటికీ, ఒక సమయంలో పెద్ద మొత్తంలో మా శక్తులను డి.కె.కు రిట్రీట్ చేయాల్సి వచ్చింది. ఇక డి.కెలో క్రూరమైన ప్రభుత్వ దాడి 2005లో సల్వాజుడుం పేరుతో హంతక భయానక సాయుధ క్యాంపెయిన్‌తో నూతన దశలోకి ప్రవేశించింది. దీనికి ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడు మహేంద్రకర్మ, ఛత్తీస్‌గఢ్‌లోని హిందూ ఫాసిస్టు రమణ్‌సింగ్ ప్రభుత్వం నేతృత్వం వహిస్తున్నాయి.

సల్వాజుడుం మా చేతిలో చావు దెబ్బ తిన్నప్పటి నుంచి, రాణిబోదిలి, ఎర్రబోరు వంటి మా వీరోచిత ప్రతిఘటనా చర్యలతో అది వెనకడుగు వేసినప్పటి నుండి, ప్రతీఘాతుక పాలకులు పారామిలిటరీ బలగాలతో, అవసరమైతే సైన్యంతో పెద్దయెత్తున మాపై దాడులు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. 2006 నుండే సల్వాజుడుం ఫలితాల్ని సాధించలేదనీ, భారీ ఎత్తున శిక్షణ పొందిన కమాండో బలగాలను దింపాలనీ కాంకేర్‌లోని జంగల్ వార్‌ఫేర్ స్కూలును నడుపుతున్న బ్రిగేడియర్ పోన్‌వార్ నొక్కి చెప్తూ వస్తున్నాడు. రాజకీయ, మిలిటరీ వ్యవస్థలో అనేక మంది కీలకమైన వ్యక్తులకు కూడా ఇదే అభిప్రాయం వుంది.

ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మేము తీవ్రంగా నష్టపోయిన తర్వాత, శత్రువు ముందుకు తీసుకు వస్తున్న సామ్రాజ్యవాద ప్రోత్సాహక ఎల్.ఐ.సి విధానాన్ని, విప్లవ వ్యతిరేక బహుముఖ వ్యూహాన్ని, ఎత్తుగడలు, పథకాలను శ్రద్ధగా అధ్యయనం చేస్తున్నాం. అందుకని ఇది మేము ఊహించనిదేమీ కాదు. అంతేగాక, సామ్రాజ్యవాదులు, దేశంలోని దళారీ నిరంకుశ బూర్జువాలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రపంచ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ నెలకొని వుంది. కనుక ప్రపంచ మార్కెట్‌లో ఈ పోటీని తట్టుకొని, అధిక లాభాలు సంపాదించడానికి ఈ రాబందులకు చౌకగా దొరికే ముడి పదార్థాలు చాలా అవసరం. ఇందుకోసం పశ్చిమ బెంగాల్ నుండి ఝార్ఖండ్, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ వరకు ఖనిజ సంపద సమృద్ధిగా వున్న ఆదివాసీ ప్రాంతాలను కబళించడానికి ఎం.ఓ.యు.లు ప్రారంభమయ్యాయి. అయితే ఈ ప్రాంతాల్లో సి.పి.ఐ(మావోయిస్టు) నాయకత్వంలో ప్రజలు తీవ్రమైన సాయుధ పోరాటాలు చేస్తున్నారు. ఆ విధంగా మేము సల్వాజుడుం హత్యాకాండ క్యాంపెయిన్‌ను ఓడించిన తర్వాత, కేంద్ర ప్రభుత్వం ఇదే బాట పట్టి పెద్దయెత్తున కేంద్ర బలగాలను దింపి సల్వాజుడుం–2 (ఆపరేషన్ గ్రీన్‌హంట్) పేరుతో మరింత తీవ్ర స్థాయిలో ఈ హత్యాకాండ క్యాంపెయిన్‌ను కొనసాగిస్తోందని అంచనా వేశాం. ఈ ప్రాంతంలోని ఖనిజ సంపదను ఎటువంటి అడ్డంకులు లేకుండా దోచుకుపోవడానికి ఆరాటపడిపోతున్న ఈ రాబందులు కాంగ్రెస్, బి.జె.పి, సి.పి.ఐ(ఎం) తదితర రాజకీయ పార్టీలకు, పోలీసు ఉన్నతాధికారులకు, ప్రభుత్వ వున్నతాధికారులకు, మీడియాలోని ఒక పెద్ద సెక్షన్‌కు ఎంత సొమ్ము మేపారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ కార్పోరేట్ సంస్థలు పెద్ద మొత్తాలు ముట్టజెప్పాయనేది స్పష్టం. అందుకే యు.పి.ఎ రెండవసారి అధికారంలోకి వచ్చిన వెంటనే మావోయిస్టు వ్యతిరేక పథకాలను వేగవంతం చేసింది. మావోయిస్టు భూతం అమాయక ప్రజల్ని మింగేస్తుందనే భయాలు సృష్టించడానికి పెద్ద కుట్రతో అబద్ధాలు, గణాంకాలు; నిజాలు,కట్టు కథలు కలగలిపి మావోయిస్టులు అభివృద్ధికి అడ్డుపడుతున్నారని, బలవంతంగా డబ్బు వసూళ్ళు చేస్తున్నారని, మతిలేని హింసకు పాల్పడుతున్నారని ఒకటేమిటి! ఎంత దుష్ప్రచారం చేయాలో అంతా చేస్తున్నారు. హోంశాఖ మొదట సి.పి.ఐ.(మావోయిస్టు)ను టెర్రరిస్టు సంస్థగా ప్రకటించి, దేశవ్యాప్త నిషేధం విధించి పెద్దయెత్తున దాడి చేయడానికి పునాది తయారు చేసి పెట్టింది.

అదే సమయంలో ప్రజల శాంతియుత ఉద్యమాలను అణచడానికి 26 కంపెనీల కేంద్ర బలగాలను లాల్‌గఢ్‌కు పంపింది. పాలకవర్గాల్లోని వివిధ సెక్షన్ల మధ్య ఎన్ని విభేదాలున్నా, వాళ్ళ మధ్య కుక్కల కొట్లాట ఎంతగా వున్నా వాళ్ళ ఉమ్మడి వర్గ ప్రయోజనాలను కాపాడుకొని ముందుకు తీసుకుపోవడానికి, పీడిత విప్లవ ప్రజానీకాన్ని అణచివేయడానికి గాంధేయ కాంగ్రెస్‌గాని, స్వదేశీ బి.జె.పి లేదా మార్క్సిస్టు సి.పి.ఐ.(ఎం) గాని అంతా ఒక్కటయ్యారు.

మేం ఈ పరిణామానికి సిద్ధపడి తయారీలు చేసుకుంటూ వుండినాం కాబట్టే శత్రువు ఎన్ని ప్రయత్నాలు చేసినా, శిక్షణ పొందిన బలగాలను దించినా బెంగాల్ నుంచి ఉత్తర తెలంగాణ వరకు గల బెల్ట్‌లో ప్రజాయుద్ధానికి లేదా వివిధ విప్లవ సంస్థలకు పెద్దగా నష్టం కలిగించలేకపోయాడు. జూన్ మొదటి పక్షంలో, యు.పి.ఎ ప్రకటన చేసిన 15 రోజుల్లోనే మా పొలిట్‌బ్యూరో ప్రస్తుత పరిస్థితి మీద, శత్రువు ఎటువంటి చర్యలు తీసుకుంటాడు, ఆ ఎత్తుగడలను మేము ఎలా ఎదుర్కోవాలి అనే దానిపై స్పష్టమైన అంచనాకొచ్చి సర్క్యులర్ విడుదల చేసింది. సర్క్యులర్ గురించి ఇప్పటికే అనేకమంది వార్తా విశ్లేషకులు, రక్షణ నిపుణులు అని చెప్పబడేవాళ్ళు తమ విశ్లేషణల్లో చెప్పారు. మేము చెప్పినట్లే జరుగుతున్న విషయాలను, మారుతున్న పరిస్థితిని చూస్తున్నారు కదా! ఒక్క మాటలో చెప్పాలంటే, అభివృద్ధి నిరోధక పాలకులు తీసుకొస్తున్న ఈ యుద్ధం ఊహించినట్లే జరుగుతున్నది. మానవజాతి చరిత్రలో ఫాసిస్టు పాలకవర్గాలు ఎప్పుడూ ఇటువంటి క్రూరమైన పద్ధతులే అవలంభించాయి. క్రూరమైన బలప్రయోగం, జాతిహననాలు, పచ్చి అబద్ధాలతో కూడిన నీచమైన మానసిక (ప్రచార) యుద్ధం, బురద చల్లడం తప్ప వాళ్లు ఇంకొకటి ఆలోచించరు.

చివరగా, అభివృద్ధినిరోధక పాలకుల ప్రస్తుత దాడిని అంతిమ దాడిగా వర్ణించడం ఏమాత్రం సరిగా ఉండదు. మావోయిస్టు విప్లవకారుల నాయకత్వంలో భారత ప్రజలు సాగించే అంతిమయుద్ధం అమెరికా సామ్రాజ్యవాదులతో చేసే యుద్ధం కావచ్చు. చిదంబరం, అతని ముఠా సాగిస్తున్న ప్రస్తుతదాడి పాలకవర్గాల మూర్ఖపు దుస్సాహసంగా చరిత్రలో మిగిలిపోక తప్పదు. వాళ్ళు ఎడతెగని యుద్ధంలో పీకల్లోతు కూరుకుపోయి నిరంతరం మరిన్ని మరిన్ని బలగాలను పంపక తప్పని స్థితికి నెట్టబడతారు. ఆదివాసీ నివాస ప్రాంతమంతా భారతదేశంలో మరో వియత్నాం కానుంది. ఇది తప్పక ఆర్థిక, రాజకీయ సంక్షోభాన్ని కూడా పెంచి, దేశవ్యాప్త అలజడికి దారితీస్తుందని మేం ఖచ్చితంగా చెప్పగలం. ఆపరేషన్ గ్రీన్‌హంట్ అభివృద్ధి నిరోధక పాలకవర్గాలకూ వారి సామ్రాజ్యవాద యజమానులకూ, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులకు ఒక దారుణమైన వైఫల్యంగా మిగిలిపోతుంది.

**ఎం.ఐ.బి:** *కాని ఆపరేషన్ గ్రీన్‌హంట్ లాంటివేమీ లేవని, అదంతా మీడియా సృష్టేనని చిదంబరం అంటున్నాడు...?*

**ఆనంద్:** (పరిహాసంగా నవ్వుతూ) అతడన్నదీ నిజమే కావచ్చు. వేట అంటే ఆదివాసీ నివాస ప్రాంతమంతటా వున్న ఖనిజసంపదను కార్పోరేట్ కంపెనీలకు అప్పగించడానికి ఆ ప్రాంతంలోని ఆదివాసులను నిర్మూలించటం లేదా అక్కడినుండి ఆదివాసులను తరిమేయటం. దీన్ని ఆపరేషన్ ఆదివాసీహంట్ (ఆదివాసుల వేట) లేదా ఆపరేషన్ ట్రైబల్‌హంట్ (గిరిజనుల వేట) అంటే సరిగ్గా సరిపోతుంది. సరే దీని మీద చిదంబరం చెప్పేదాన్ని ఒప్పుకుందాం.అతడు ఏం చేయదల్చుకుంటున్నాడు? వియత్నాంలో చేసినట్లు 'వ్యూహాత్మక పల్లెలు' అనే వాటిలో ఆదివాసులకు పునరావాసం ఏర్పాటు చేయాలనుకుంటున్నాడు. కాని, ఈ 'వ్యూహాత్మక పల్లెలు' వియత్నాంలో శక్తివంతమైన అమెరికా సేనలను రక్షించలేకపోయాయి. అలాగే డి.కె.లో గాని ఇంకెక్కడైనా గాని చిదంబరం బలగాలకు, అభివృద్ధినిరోధక, పరాన్నభుక్కు భారత పాలకవర్గాలను ఈ వ్యూహాత్మక పల్లెలు రక్షించలేవు.

ఇక కేంద్రం చేసే పెద్ద దాడి ఏమీ లేదని, కేవలం మావోయిస్టులను ఎదుర్కోవడానికి రాష్ట్రాలకు సహాయం మాత్రమే చేస్తున్నామని చెపుతున్న చిదంబరం ప్రపంచంలోనే పెద్ద అబద్ధాలకోరుగా రుజువవుతున్నాడు. పెద్దదాడి ఏమీ లేదని బొంకుతూనే నిరంతరం కేంద్ర బలగాలను తరలిస్తూ హిట్లర్, జార్జి బుష్‌ల వంటి తన నీచమైన ఫాసిస్టు లక్షణాలను బహిర్గత పరుస్తున్నాడు. వాస్తవానికి పాలకులు వాడే పదజాలం అంతా అబద్ధాలు. ప్రజలు మాట్లాడేదానికి విరుద్ధం. వాళ్ళు శాంతి అన్నారంటే దానర్థం యుద్ధం. అలాగే ఎన్‌కౌంటర్ అంటే క్రూరమైన హత్య. పోలీసులు ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించటం చాలావరకు పాలకుల పదజాలంలో భాగమైపోయింది. మహేంద్రకర్మ, రమణ్‌సింగ్‌లు వర్ణించే సల్వాజుడుం శాంతి క్యాంపెయిన్ వాస్తవానికి హత్యల, అత్యాచారాల, గృహదహనాల, విధ్వంసాల క్యాంపెయిన్. ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస క్యాంపులంటే అర్థం వ్యూహాత్మక పల్లెలు లేదా నాజీ కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపులు (నిర్బంధ శిబిరాలు). పాలకుల పదజాలంలో అభివృద్ధి అంటే ప్రజల్ని నిర్వాసితుల్ని చేయటం. లా అండ్ ఆర్డర్ అంటే ప్రజల్ని పూర్తిగా దోపిడి, అణచివేతలకు గురిచేయటం. ఆమ్‌ఆద్మీ అంటే ఆమ్‌ఆద్మీ(సగటు మనిషి)ని లూటీ చేయటం. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లలో యుద్ధాన్ని బీభత్స స్థాయికి తీసుకుపోయి, విమానాల ద్వారా బాంబులు కురిపించి ఆ దేశంలో వేలాది మంది పౌరుల్ని హతమార్చినందుకు, లక్షలాది ప్రజల్ని నిర్వాసితుల్ని చేసినందుకు బరాక్ ఒబామాకు ఏకంగా నోబెల్ శాంతి బహుమతినే ఇచ్చారు. పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు వాడే భాషలోని మోసానికి అంతేలేదు. సుపరిపాలన అంటే పాలకులు చెప్పేదానికి వ్యతిరేకంగా అర్థం

చేసుకోవాలి. వాళ్ళు చెప్పేవన్నీ వాస్తవంలో ఇలా మారేవే.

అందువల్ల, మావోయిస్టులపై పెద్దదాడి లాంటిదేమీ లేదని చిదంబరం అంటున్నాడంటే దానర్థం ఖచ్చితంగా పూర్తిస్థాయి విప్లవ వ్యతిరేక క్రూరమైన దాడికి సన్నాహాలు చేస్తున్నాడు అని.

**ఎం.ఐ.బి.:** *మావోయిస్టులు హింసను ఆపితే అన్ని విషయాలపై వారితో చర్చలకు సిద్ధమని చిదంబరం అంటున్నాడు. మరి మావోయిస్టులు హింసను విడనాడి చిదంబరం ప్రతిపాదనను స్వాగతిస్తారా?*

**ఆనంద్:** చిదంబరం మతిలేని వాగుడు ఈ దశాబ్దపు క్రూర పరిహాసంగా ఓడిపోక తప్పదు. ఆదివాసీ నివాస ప్రాంతాలకు వేలాది బలగాలను పంపుతావు, ఆదివాసులను ఎత్తుకుపోవటం, చిత్రహింసలు పెట్టటం, తుపాకులు ఎక్కుపెట్టి మహిళలపై అత్యాచారం చేయటం, రెండేళ్ళ పసిపాప నాలుక కోయటం, ఊహించశక్యంగాని అమానవీయ పద్ధతుల్లో ఆదివాసుల్ని చంపటం, ఎనభై ఏళ్ళ వృద్ధురాలి స్తనాలు కోసేయటం, గ్రామాలకు గ్రామాల్ని తగులబెట్టటం, పేద, నిస్సహాయ ఆదివాసుల కోళ్ళు, పందులు, మేకలు దొంగిలించటం, ఒకటేమిటి నీ సాయుధ గూండాలతో చెప్పనలవిగాని దుర్మార్గాలన్నీ చేపిస్తావు, ఆనక లేశమాత్రమైనా సిగ్గు లేకుండ హింసను ఆపమని మావోయిస్టుల్ని అడుగుతావు. పైగా ఈ క్రూరుడు మెత్తగా మాట్లాడే హోంమంత్రినని చెప్పుకుంటున్నాడు సిగ్గులేకుండా. ఇతడు పోలీసు దుస్తులు వేసుకున్న హంతకులకు, అత్యాచారాలు చేసే కీచకులకు, బందిపోట్లకు మెత్తనివాడు. అమానవీయమైన నేరాలకు పాల్పడిన ఈ పోలీసుదుస్తుల్లోని గూండాలపై ఒక్క కేసు కూడా పెట్టలేదితడు. పైగా ఈ కుళ్ళిపోయిన వ్యవస్థను, వర్గ ప్రయోజనాలను కాపాడటానికి తన చివరి రక్తపుబొట్టు వరకు పోరాడతానని ప్రతిజ్ఞ చేశాడు.

మావోయిస్టులు మొట్టమొదట హింసను విడనాడితే 72 గంటల్లోగా అన్ని సమస్యల్ని పరిష్కరిస్తానని పదే పదే వల్లిస్తూ, మావోయిస్టుల ఆధిపత్యంలోని ప్రాంతాల ప్రజలపై చేసే ఆటవిక దాడిని సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. సల్వాజుడుం గూండాలు, ఎస్.పి.ఓ.లు రాష్ట్రపోలీసు బలగాలు, కోబ్రా బలగాలు ప్రజలపై హత్యలు, అత్యాచారాలు చేయటం, ప్రజల ఆస్తుల విధ్వంసం కొనసాగించినంతకాలం మావోయిస్టులు ఆత్మరక్షణార్థం ప్రతిఘటించక తప్పలేదని అతనికి తెలుసు. తన మారణకాండను సమర్థించుకొనేందుకు ఈ పరిస్థితిని వుపయోగించుకొనే పథకం వేస్తున్నాడు. మావోయిస్టులు, ఆదివాసులు వున్న ప్రాంతాల్లో ఆత్మరక్షణ కోసం ప్రతిఘటించక తప్పని పరిస్థితిని సృష్టించి, ప్రతిఘటనలో జరిగే హింసపై పెద్దయెత్తున దుష్ప్రచారం చేశాడు. ఆ తర్వాత ప్రభుత్వం పెద్ద మనసుతో చర్చలకు ఆహ్వానించినా మావోయిస్టులు తిరస్కరించి 'మతిలేని' హింసకు పాల్పడుతున్నారని, దీన్ని అరికట్టడానికి అనే సాకుతో పెద్దయెత్తున దాడి ప్రారంభించారు. ఇరాక్‌పై దాడిచేసిన బుష్ వలె, అపార ఖనిజసంపద గల అటవీ ప్రాంతాలను ఆక్రమించేందుకు నిర్ణయించిన అభివృద్ధినిరోధక భారత పాలకవర్గాలు తమ నీచమైన లక్ష్యసాధనకు దేన్నీ వదిలిపెట్టరు. ఫాసిస్టుల విధానమే అంత. ప్రపంచ వ్యాప్తంగా మనకు కన్పించేదిదే.

రాజ్యహింస, రాజ్యప్రోత్సాహక హింస పెరిగింది. ఆదివాసులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బలగాలు అమానుషమైన నేరాలకు పాల్పడుతున్న ప్రాంతాలకు మీడియాను రాకుండా అడ్డుకొంటున్నారు. కాని ఎక్కడైనా ఒక్క పోలీసు ఇన్‌ఫార్మర్‌ను మావోయిస్టులు శిక్షిస్తే, దాన్ని గోరంతలు కొండంతలు చేసి మావోయిస్టుల్ని హంతకులుగా చిత్రించడానికి మీడియా వాళ్ళను అధికారికంగా ఏర్పాట్లు చేసి మరీ తీసుకువస్తారు. అంతేగాక, మావోయిస్టులతో శిక్షింపబడిన గూండాలు, అరాచకులతో మీడియా ముందు మీటింగులు కూడా ఏర్పాటు చేస్తారు. పాలకవర్గాల పక్షపాతి అయిన మీడియాలోని ప్రభుత్వ ముడుపులు అందుకొంటున్న కొన్ని సెక్షన్ల ద్వారా ఇటువంటి బూటకపు ప్రచారాన్ని ఉధృతం చేసి, ఆ తర్వాత ఆదివాసులను వ్యూహాత్మక పల్లెలకు తరలించి మావోయిస్టులను సమూలంగా నిర్మూలించే దీర్ఘకాలిక పథకాన్ని ప్రారంభిస్తారు. ఈ చిదంబర రహస్య పథకాన్ని ఏ మాత్రం ఇంగిత జ్ఞానం వున్న వాళ్ళైనా అర్థం చేసుకోగలరు.

అందువల్ల ప్రభుత్వం చేస్తున్న చర్చల పిలుపుకు మేం స్పందిస్తామా లేదా అనేది సమస్యకాదు. చర్చల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఆదివాసుల వీపులో కత్తి దించి, హింసను విడనాడమని ఎలా పిలుపునిస్తున్నాడో చూడండి. పులి గొఱ్ఱెను నోట కరిచిపట్టి, ప్రతిఘటించొద్దని కోరటం లాంటిదిది. చిదంబరానికి ఏమాత్రం చిత్తశుద్ధి వున్నా మొట్టమొదట ఆదివాసులపై హత్యలు, చిత్రహింసలు, అత్యాచారాలు, వారి ఆస్తుల లూటీ, విధ్వంసాలను ఆపమని తన పోలీసు బలగాలకు చెప్పి, యూనిఫాం వేసుకున్న ఈ చట్ట విరుద్ధ రౌడీలను వెంటనే ఉపసంహరించాలి. సల్వాజుడుంను ఆపమని, ఈ గూండాలు చేసిన నేరాలపై చర్యలు తీసుకోమని రమణ్‌సింగ్‌కు ఆదేశాలు ఇవ్వాలి. పోలీసుల, ప్రభుత్వ ప్రోత్సాహక గూండామూకల అమానుష చర్యల్ని ఆపే అధికారం తనకు లేదనీ, శాంతి భద్రతలు రాష్ట్రాలు చూసుకోవలసినవనీ అనటం పచ్చి అవకాశవాదమూ, పలాయన వాదమూ, నయవంచన. రమణ్‌సింగ్ గూండాలు చేస్తున్న హింసను మరింత పెంచడానికి తన బలగాలను పంపిస్తూ, హోంమంత్రిగా ఇప్పుడు తన బాధ్యత కాదనటం నీచమైన బుకాయింపు. కేంద్రం నుంచి చిదంబరం పెద్దయెత్తున బలగాలను పంపి రమణ్‌సింగ్ కాషాయ ఫాసిస్టు ప్రభుత్వానికి

సహాయం అందించకపోతే, మా పార్టీ నాయకత్వంలో ప్రజలు రమణ్‌సింగ్ గూండాలకు తగిన గుణపాఠం నేర్పేవారు. వాస్తవానికి, సల్వాజుడుంపై అన్ని వైపుల నుండి దాడులు పెరిగి, రాష్ట్ర పోలీసులు మావోయిస్టులపై, అమాయక ఆదివాసులపై యుద్ధం చేయ నిరాకరించినప్పుడు, చిదంబరం కేంద్ర బలగాలను పంపి రాష్ట్రానికి చెందిన రౌడీ మూకలను బలోపేతం చేసి, ఛత్తీస్‌గఢ్‌లో మారణకాండను కొనసాగించాడు. ప్రభుత్వ అణచివేత బలగాలు ప్రజలపై నీచమైన హింసాకాండను కొనసాగించినంతకాలం చిదంబరానికి మావోయిస్టుల్ని హింస విడనాడమని అడిగే నైతిక హక్కు లేదు.

మావోయిస్టుల మతిలేని హింస అని వాళ్లు చెపుతున్నదంతా దశాబ్దాలుగా, శతాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న పేద, నిస్సహాయ ఆదివాసులు, పీడిత సెక్షన్లు ఆత్మరక్షణ కొరకు చేస్తున్న న్యాయమైన ప్రతిహింస మాత్రమే. చిదంబరం తన పోలీసు బలగాలతో నిరాయుధ, నిస్సహాయ ఆదివాసీ పురుషులపై, మహిళలపై, పిల్లలపై జరిపిస్తున్న విచక్షణారహిత, ఉన్మాద, పైశాచిక, భయానక, వెన్ను జలదరించే, రక్తం గడ్డకట్టించే, క్రూర, బీభత్సకర హింసను ఆపితే చాలా తేలికగా శాంతి నెలకొంటుంది. మావైపు నుంచి పౌర సమాజానికి హామీనిచ్చేదేమిటంటే, క్రూరమైన రాజ్యహింస ఆగితే, ప్రతిహింస కూడా దానంతటదే ఆగిపోతుంది. దాని అవసరం వుండదు. మావోయిస్టుల, పీడితప్రజల ఈ ప్రతిహింస ఏ విధంగా చూసినా న్యాయమైనదే. 'మతిలేని హింస' చేస్తున్నారనే పేరుతో మమ్మల్ని ఏకాకుల్ని చేయాలని చిదంబరం చేసే తెంపరి ప్రయత్నాలు మట్టికొట్టుకుపోక తప్పదు. బుష్ మీడియాను చేతిలో పెట్టుకొని సద్దాంకు వ్యతిరేకంగా సృష్టించిన నీచమైన అబద్ధాలతో అమెరికా ప్రజల్ని తెలివితక్కువ వాళ్ళను చేసి కొంతకాలం నమ్మించాడు. ఈ రోజున అతని వారసుడు ఒబామా అల్‌ఖైదా భూతాన్ని చూపిస్తూ ఆఫ్ఘనిస్తాన్‌లో మారణకాండను సృష్టించి, దాన్ని పాకిస్తాన్‌కు కూడా విస్తరింపజేసి అదే పని చేస్తున్నాడు. ప్రతి అభివృద్ధినిరోధక, ఫాసిస్టు పాలకుడూ తన అంతిమ లక్ష్యాల సాధనకు ఒక బూచిని ముందుకు తెచ్చినవాడే. చమురు వనరులకోసం బుష్ అబద్ధాల కథలల్లి ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో క్రూర మారణకాండను సాగిస్తే, ఖనిజసంపదల కోసం చిదంబరం మావోయిస్టుల హింసపై అబద్ధాల కథలల్లుతున్నాడు. కార్పోరేట్ బడా సంస్థల నుంచి ముడుపులందుకుంటున్న మీడియాలోని కొన్ని సెక్షన్లు సిగ్గులేకుండా దీనికి వంత పాడుతున్నాయి.

**ఎం.ఐ.బి:** *సమీప భవిష్యత్తులో ప్రభుత్వ హింస ఆగి మావోయిస్టులకు, ప్రభుత్వానికి మధ్య చర్చలు జరిగే అవకాశం వుందనుకుంటున్నారా?*

**ఆనంద్:** ఇది అనేక అంశాలపై ఆధారపడి వుంటుంది. అంతేగాని, మావోయిస్టులు, చిదంబరంల ఇష్టాయిష్టాలపై ఆధారపడి వుండదు. జార్జిబుష్ ఇరాక్‌పై బాంబులు కురిపించి, అమెరికాను పాలిస్తున్న పిడికెడుమంది సైనిక-పారిశ్రామిక వర్గాల కోసం ఇరాక్‌ను ఆక్రమించాడు. ప్రపంచ దేశాలన్నీ ఈ సామ్రాజ్యవాద ఆక్రమణను తీవ్రంగా వ్యతిరేకించినా వెనుకడుగు వేయలేదు. అదే విధంగా భారతదేశంలోని పిడికెడుమంది కార్పోరేట్ అధిపతుల బిలియనీర్ల క్లబ్ మన్మోహన్, చిదంబరం తదితర తమ రాజకీయ ప్రతినిధులను అపార ఖనిజసంపదలున్న ప్రాంతాల్ని నిరాఘాటంగా తమ హస్తగతం చేయడానికి ముందుకు నెడుతున్నారు. కాని, ప్రజా ఆందోళనల, మావోయిస్టుల ప్రతిఘటనా విస్తృతి అంతిమంగా పాలకుల దాడికి అడ్డుకట్ట వేస్తుంది.

దేశవ్యాప్తంగా ఆందోళనలు పెరిగి, మరొక యుద్ధరంగం ప్రారంభం కావాలి. అంటే కేవలం మావోయిస్టుల సాయుధ ప్రతిఘటనా పోరాటాలు, దాడులే కాదు. ధరల పెంపు, అవినీతి, నిర్వాసిత వ్యతిరేక ఉద్యమాలు, తెలంగాణ, గోర్ఖాలాండ్, బుందేల్‌ఖండ్ తదితర ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు, పర్యావరణ విధ్వంస వ్యతిరేక, నిరుద్యోగ వ్యతిరేక, అధికారుల – కార్పోరేట్ నేరమాఫియా భూ కబ్జాల వ్యతిరేక ఉద్యమాలు, పోలీసు దురాగతాలు, దళితులపై, మహిళలపై, మత మైనారిటీలపై జరిగే దురాగతాలకు వ్యతిరేక ఉద్యమాలు తదితర అనేక సమస్యలపై ఉద్యమాలు తీవ్రం కావాలి. అప్పుడు ప్రజలపై క్రూరమైన అణచివేత సాగించటం అసాధ్యమనేది చిదంబరానికి అర్థమవుతుంది. సి.పి.ఐ(మావోయిస్టు) పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం కొనసాగుతున్న ప్రాంతాల్లో చిదంబరం అతడి ముఠా క్రూర మారణకాండలకు పాల్పడకుండా ఆపగలిగేది ఒక్కటే. రాజ్యహింసకు వ్యతిరేకంగా, పీడిత ప్రజల రక్షణ కొరకు నిజమైన ప్రజాస్వామిక శక్తులు, పౌరసమాజం సాగించే రాజీలేని, స్పష్టమైన సైద్ధాంతిక పునాది గల శాంతి ఉద్యమమే.

చివరిది, ప్రభుత్వ రౌడీబలగాలు ఆక్రమించిన ప్రాంతాల్లోని పీడిత ప్రజల వీరోచిత ప్రతిఘటన, మా పార్టీ నాయకత్వంలో ప్రజలు సాధించే విజయాలు వియత్నాం యుద్ధంలో అమెరికా కిరాయి బలగాల్లో పుట్టిన వియత్నాం సిండ్రోం వంటి మానసిక వ్యాధిని ఇక్కడి కిరాయి బలగాల్లోనూ పుట్టిస్తాయి. ఇది బలగాల్లో తిరుగుబాట్లను, పారుబోతు తనాన్ని పెంచి చిదంబరం, రమణ్‌సింగ్‌లు స్థానిక ఆదివాసులను నిర్మూలించే తమ వ్యూహాత్మక పల్లెల దురాక్రమిత, నీచమైన వ్యూహాన్ని సమీక్షించుకోవాల్సిన స్థితికి నెడుతుంది. పశ్చిమబెంగాల్ నుండి ఆంధ్రప్రదేశ్ వరకు గల విశాల ప్రాంతం తీవ్రమైన సాయుధ పోరాట జ్వాలలు ఎగిసిపడే ప్రాంతాలుగా మారి, ప్రజల సాయుధ ప్రతిఘటన నూతన ప్రాంతాలకు విస్తరించగా, మేము శత్రు బలగాలను వియత్నాం వంటి పరిస్థితిలో ఇరికించి,

ఆత్మరక్షణలోకి నెడతాం. ఈ పరిస్థితిని సృష్టించడానికి మా పార్టీ ఏ అవకాశాన్నీ వదిలిపెట్టదు. అప్పుడే మన్మోహన్‌సింగ్, చిదంబరంల లేదా క్రూరమైన ప్రతీఘాతుక విప్లవ యుద్ధాన్ని కొనసాగించే వారెవరైనా మతిలేని హింస అనే వాగుడు కట్టిపెట్టి, మొదట రాజ్యహింసకు ఫుల్‌స్టాప్ పెట్టి, చర్చల కోసం గట్టిగా ప్రతిపాదన పెడతారు. ఇందుకు మరో దగ్గర దారిలేదు.

**ఎం.ఐ.బి:** *అంటే, సి.పి.ఐ. (మావోయిస్టు), దాని పి.ఎల్.జి.ఎ., ప్రజలు దురాక్రమిత బలగాలకు వ్యతిరేకంగా దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధమవుతారంటారు..?*

**ఆనంద్:** అవుననుకోండి. మొదట మా వ్యూహం దీర్ఘకాలిక ప్రజాయుద్ధ వ్యూహం అనేది మీకు స్పష్టం చేయదల్చుకున్నాను. విశాల భూభాగం, వెనుకబడిన ప్రాంతాల్లో బలహీనమైన మౌలిక సదుపాయాలూ, పెద్దమొత్తంలో వ్యవసాయ ప్రజానీకం, పాలకవర్గాల మధ్య కుక్కల కొట్లాట మొదలైనవాటిని అనుకూలాంశాలుగా మలుచుకొని మాకన్నా బలమైన శతృవుతో తలపడటానికి అనుసరించవలసిన ఖచ్చితమైన, సరైన వ్యూహం ఇదే. మేము దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధంగా వున్నాం. శతృవుకు సంబంధించిన ప్రతినిధులు వివిధ సందర్భాల్లో చెప్పినట్లు శతృవు మమ్మల్ని రెండు, మూడు లేదా ఐదు సంవత్సరాల్లో తుడిచి పెట్టాలనుకుంటే, మమ్మల్ని తుడిచిపెట్టడానికి కొన్ని పాకెట్లను ఎంచుకొని కేంద్రీకరించితే, మేం సాయుధపోరాటంతో పాటు వివిధ పోరాటరూపాల్లో మరింత విస్తృత ప్రాంతాల్లో పోరాటం సాగించి, శతృ గుండెకాయ లాంటి పట్టణప్రాంతాలకు కూడా విస్తరించే వ్యూహాన్ని అనుసరిస్తాము. యూరప్ జనాభా కంటే ఎక్కువున్న పట్టణ ప్రాంతాల జనాభా తీవ్ర అశాంతితో రగిలిపోతోంది. ఇటువంటి చోట్ల శత్రువు తన ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను, అణచివేత యంత్రాంగాన్ని ఎంత అభివృద్ధి చేసుకున్నా, ప్రజాతిరుగుబాట్లను ఆపటం అసాధ్యం.

శతృవు గెరిల్లాల చేతుల్లో నుండి ఒక ప్రాంతాన్ని చేజిక్కించుకున్నానని అనుకున్నా, వేరేచోట్ల మరికొన్ని ప్రాంతాలు కోల్పోయానని తెలుసుకుంటాడు. ఇది మా అదుపులో వున్న భూభాగాలను శతృవు స్వాధీనం చేసుకోవటం, మరోచోట శతృవు అదుపులో వున్న భూభాగాలతో పాటు గతంలో మేము కోల్పోయిన గట్టి పట్టున్న ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవటం వంటి అనిశ్చిత(ద్వంద్వ)యుద్ధం అవుతుంది. శతృవు తన ప్రయత్నాలు తాను చేస్తాడు. కాని, సామ్రాజ్యవాద, దళారీ బూర్జువా, భూస్వామ్య కబంధహస్తాల నుండి దేశాన్ని సంపూర్ణ విమోచన గావించే మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించడం కలలో కూడా సాధ్యం కాదు. ఆకలి–పస్తులు, దారిద్ర్యం–దుఃఖం, వంచితులు–అనాథలు, నిరుద్యోగం–రోగాలు, వివక్ష–పీడన, వివిధ రూపాల్లోని దోపిడీ వున్నంతకాలం మావోయిస్టు ఉద్యమం నిక్షేపంగా వర్ధిల్లుతూ, పెద్దపెద్ద అంగలతో ముందుకు పోతుంది. మా వ్యూహమంతా దోపిడీ పీడకుల రాజ్యాన్ని కూల్చివేయడానికి సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక శక్తులను విస్తృతంగా ప్రజాయుద్ధంలోకి కదిలించడమనే లక్ష్యం చుట్టూనే వుంటుంది. ఆవిధంగా ఈ స్పష్టమైన దృక్పథం, వ్యూహాలననుసరించే మా సన్నాహాలుంటాయి.

**ఎం.ఐ.బి:** *మావోయిస్టులు ఎన్నటికీ చర్చలకు రారనీ, వాళ్లు ప్రజల సమస్యల పరిష్కారానికి శాంతియుత మార్గాల గురించి ఆలోచించరనీ మన్మోహన్‌సింగ్, చిదంబరం ఇంకా పాలకవర్గాల ప్రాపునందుకుంటున్న వారి ప్రతినిధులూ మాట్లాడుతున్నారు. ఎట్టకేలకు వచ్చినా, దాని వెనుక సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవాలనే దురుద్దేశం వుంటుందనీ వాళ్ళంటున్నారు. కనుక చర్చల గురించి ఈ విధంగా ఆలోచిస్తున్న ప్రభుత్వం గురించి మీరు ఏమనుకుంటున్నారు? రాజ్యాధికార స్వాధీనం అనే సమస్యకు శాంతియుత పరిష్కారమేమైనా వుందా?*

**ఆనంద్:** ఇంత ముఖ్యమైన ప్రశ్న వేసినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. మొదట ప్రజల్లోని నిజాయితీ సెక్షన్లలో వున్న సందేహాల గురించి(పాలకవర్గాల నుంచి ముడుపులందుకుంటున్న ఏజెంట్లు ఉద్దేశపూర్వకంగా కల్పించే సందేహాల గురించి నేను మాట్లాడటం లేదు.) వివరిస్తాను. అవేమంటే, మావోయిస్టులు సాయుధ పోరాటాన్ని అనుసరిస్తుండటం వల్ల ప్రజల సమస్యల పరిష్కారానికి శాంతియుత మార్గాల గురించి ఎన్నటికీ ఆలోచించరనేది. అదే వాస్తవమైతే కనీసవేతనాలు, ఉద్యోగుల తొలగింపు, వేతనాల్లో కోత, నిత్యావసరాలపై సబ్సిడీ, పాఠశాలలు, ఆసుపత్రులు, తాగునీటి సౌకర్యాలు, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు, ధరల పెరుగుదల వ్యతిరేక, ఫీజుల పెంపు వ్యతిరేక ఆందోళనలు, ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్లు మొదలైన ప్రజల సమస్యలను మావోయిస్టులు చేపట్టరు కదా! మావోయిస్టులు ప్రజల సమస్యలు పట్టించుకోకపోతే, మావోయిస్టుల ఉనికికే అర్థం లేదు. మరి, ఇంతకాలంగా మావోయిస్టు ఉద్యమం ఎలా కొనసాగుతున్నట్లు?

పాలకుల దోపిడీ పీడనల కారణంగా ప్రజల మౌలిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అందువల్ల ఈ మౌలిక సమస్యలను పాలకులు ఎన్నటికీ పరిష్కరించరనేది మావోయిస్టుల దృఢమైన నమ్మకం. సమస్యలు పరిష్కరించకపోగా, అందుకు విరుద్ధంగా పీడిత ప్రజలలోని వివిధ సెక్షన్ల సమస్యల పరిష్కారం కొరకు చేసే శాంతియుత, ప్రజాస్వామిక ఉద్యమాలపై పాలకులు క్రూరమైన ఫాసిస్టు అణచివేతకు పాల్పడతారు. ప్రజల సమస్యల పరిష్కారం కొరకు జరుగుతున్న పోరాట క్రమంలో మావోయిస్టులు రాజ్యాధికార స్వాధీనాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. ప్రజల సమస్యలు శాంతియుతంగా పరిష్కారమైతే వారు తమ

ప్రాణాలను ఫణంగా పెట్టి సాయుధ విప్లవం ఎందుకు సాగిస్తారు?

ప్రజల సమస్యలకు మూలకారణం సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ పాలకుల దోపిడీ పీడనలు. అందువల్ల పాలకులు ప్రజల సమస్యలను ఎన్నటికీ పరిష్కరించరనేది మా స్పష్టమైన అవగాహన. అయితే, సంఘటిత ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజలు చెప్పుకోదగ్గ విజయాలు సాధిస్తారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేందుకు వారెదుర్కొంటున్న ప్రతి సమస్యపై మేము అటువంటి ప్రజా పోరాటాలను నిర్మిస్తాము. రోజూ ఒక పూట పస్తులతో గడిపే ప్రజలకు తమ ఆదాయంలో కొద్దిపాటి మెరుగుదల వస్తేనే తమ జీవితాలకు అదెంతో ఆసరాగా భావిస్తారు. ఇక నిర్వాసిత ప్రజల జీవితాల్లో దీనికి ఎంతగా ప్రాముఖ్యత వుంటుందో ఆలోచించండి. ప్రస్తుత వ్యవస్థలో పరిష్కారమయ్యే ప్రజల సమస్యలన్నింటి పరిష్కారానికిగల మార్గాల గురించి ప్రభుత్వంతో చర్చించడానికి మేము సిద్ధమయ్యాం. కాని ప్రజల నుంచి తీవ్రమైన ప్రతిఘటన లేకుండా ప్రభుత్వం తన స్వంత చట్టాలు, రాజ్యాంగ నియమాలను సరిగ్గా అమలుచేస్తుందనే భ్రమలేమీ మాకు లేవు. భూసంస్కరణల నాటకం ఇందుకు స్పష్టమైన నిదర్శనం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రజా వ్యతిరేక విధానాల, పథకాల విధ్వంసకర దుష్పరిణామాలు ఎలా వుంటాయో అంతా తెలిసే అమలు చేస్తున్నాయి. బందిపోట్లు, దోపిడీగాళ్ళు తమ చర్యల పరిణామాల గురించి ఏమాత్రం ఆలోచించరు.

ప్రజా ఉద్యమాల వేడి, అన్నివైపుల నుండి ఒత్తిడి పెరుగుతుండటం వల్లనే ప్రభుత్వానికి ఆమాత్రమైనా ప్రజల సమస్యలను పరిష్కరించక తప్పటంలేదని అనుకుంటున్నాను. ప్రజల మౌలిక ప్రయోజనాలు ఏమేరకు సాధ్యమైనా నెరవేర్చడానికి మేము సదా సిద్ధంగా వున్నాం. పీడిత ప్రజల ప్రయోజనాలు తప్ప మాకు వేరే ప్రయోజనాలేమీ లేవు. దీన్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా మావోయిస్టు వ్యతిరేక కల్పితాలు పులిమిన కళ్ళద్దాలలోంచి చూస్తే మావోయిస్టు పార్టీ ఉనికికి కారణమేమిటనేది ఎవరికీ అర్థం కాదు.

అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలు మావోయిస్టుల చట్టబద్ధ కార్యకలాపాలను అడ్డుకోకుంటే, మావోయిస్టుల నాయకత్వంలోని పీడిత ప్రజలు శాంతియుతంగా నిర్వహించే సభలు, సమావేశాలు, ఊరేగింపులు, సమ్మెలు, పోరాటాలను అడ్డుకోకుంటే వారికి ఆయుధాలు పట్టాల్సిన అవసరమేముంది? ఆయుధాలు ప్రజల ఆత్మరక్షణ కోసమే. ప్రభుత్వం శాంతియుత పోరాట మార్గాలన్నింటినీ అడ్డుకొని ప్రజాస్వామిక పోరాటాల మీద కౄరమైన హింసకు పాల్పడినప్పుడు మాత్రమే ప్రజలు ఆయుధాలు ఉపయోగించారు. నాగాలాండ్, అస్సాం నుండి కాశ్మీరు వరకు ఎక్కడ చూసినా మనకు కన్పించేదిదే. భారతదేశం నుండి వేరుపడటంతో సహా డిమాండ్ ఏదైనప్పటికీ మెజారిటీ ప్రజల డిమాండ్లను ప్రభుత్వం ఒప్పుకొంటే సాయుధ ఘర్షణ అవసరమేముంటుంది? పోలీసులు ఆదివాసీ పురుషులను, మహిళలను, పిల్లలను ఘోరంగా కొట్టకుంటే, వారిని అంధుల్ని చేయకుంటే, వారి ఆస్తుల్ని విధ్వంసం చేయకుంటే, సోషల్ ఫాసిస్టు హర్మద్ గూండామూకలను ప్రజల మీదికి ఉసిగొల్పకపోతే లాల్‌గఢ్ ప్రజలు పిడికిలి బిగించి పోలీసు ఎస్.పిని క్షమాపణ చెప్పమని ఎందుకు డిమాండ్ చేస్తారు? ఎస్.పి ఆప్రాంతానికి మరిన్ని అణచివేత బలగాలు పంపే బదులు తన అహంకారాన్ని వదిలేసి చిత్తశుద్ధితో క్షమాపణ చెపితే లాల్‌గఢ్ ప్రజాఉద్యమం సాయుధ రూపానికెందుకు మారుతుంది? సాధారణంగా ఎక్కడ చూడండీ ఇదే కథ. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించడం దగ్గర నుండి నిరాహార దీక్షలకు కూర్చోవటం, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించటం వరకు శాంతియుత పోరాటాలనే చేపడతారు. కాని పాలకులు వీటిని తమ పోలీసు బలగాలను ఉపయోగించి ఉక్కు పాదాలతో అణచివేస్తారు. అదిగో అక్కడే ప్రజలు సాయుధ పోరాట రూపంతో సహా మరింత మిలిటెంట్ పోరాటరూపాలకు దిగుతారు.

రాజ్యాధికారం స్వాధీనం కాకుండా ప్రజల మౌలిక సమస్యలకు పరిష్కారం లభించడం అసాధ్యం. అటువంటి రాజ్యాధికార సాధనలో భారత శ్రామికవర్గ పురోగామి దళంగా మా పార్టీ పీడిత ప్రజల హక్కుల్ని, వారి న్యాయమైన పోరాటాలను సంరక్షించి ముందుకు తీసుకుపోవటానికి పి.ఎల్.జి.ఎ.ను నిర్మించింది. ఆవిధంగా మా విప్లవ అంతిమ లక్ష్యం దాని సాధనా మార్గాలు చర్చలతో సాధ్యమయ్యేవి కావు. అయితే ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే కొన్ని సమస్యలు పరిష్కరించడం సాధ్యమే. మావోయిస్టుల శాంతియుత కార్యకలాపాలను, పోరాటాలను ప్రభుత్వం అడ్డుకోకుంటే, చట్టబద్ద ప్రజాసంఘాలపై నిషేధం ఎత్తివేస్తే హింస దానంతటదే తగ్గుముఖం పడుతుంది. పాలకుల అణచివేత, మొండివైఖరుల వల్లనే హింస పెరిగింది. సమస్యల శాంతియుత పరిష్కారానికి మేమెప్పుడూ సిద్ధమే. కాని ప్రభుత్వం తప్పని పరిస్థితి కల్పిస్తే మా ఆత్మరక్షణకు ఆయుధాలు పట్టడానికి కూడా మేం సిద్ధమే. ప్రజల సమస్యల పరిష్కారం పట్ల మావోయిస్టులకు చిత్తశుద్ధి లేదని చెప్పి చిదంబరం ప్రజలను మోసగించలేడు. కాని ప్రజల సమస్యల్లో మొట్టమొదటిది, ప్రధానమైనది అంతులేని రాజ్యహింసకు స్వస్తి చెప్పటం. ఇది జరిగినప్పుడే హింస తగ్గటంలో ఏ పురోగతైనా వుంటుంది.

**ఎం.ఐ.బి:** *దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో మీకు కొంత అనుభవం వుంది కదా?*

**ఆనంద్:** అవును. అందువల్ల నిరాయుధ, అమాయక ప్రజలపై రాజ్యం జరుపుతున్న హింసను ఆపితే హింస తీవ్రత త్వరత్వరగా తగ్గుముఖం పడుతుందని నమ్మకంగా చెప్పగలం. కాల్పుల విరమణకు విఘాతం కలిగించడానికి పోలీసులు అనేకసార్లు రెచ్చగొట్టే చర్యలు చేసినా ఆరు నెలలపాటు మావోయిస్టుల ప్రతిహింస పూర్తిగా ఎలా తగ్గుముఖం పట్టిందో ఆంధ్రప్రదేశ్‌లో చర్చల సమయంలో నిష్పాక్షికంగా మధ్యవర్తిత్వం వహించిన వారు చూశారు. చివరకు మావోయిస్టులు ముందుకు తీసుకువచ్చిన డిమాండ్లను వేటినీ పరిష్కరించలేని రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం చర్చలకు విఘాతం కల్గించి కాల్పుల విరమణకు గండికొట్టింది. ఆసక్తికరంగా మావోయిస్టు ప్రతినిధులు ప్రభుత్వం ముందు పెట్టిన డిమాండ్లన్నీ రాజ్యాంగచట్రం పరిధిలోనివే. ఆంధ్రప్రదేశ్‌లో చర్చల నుంచి వైదొలగి క్రూరమైన దాడిని ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వ నయవంచన, దురుద్దేశాలు చూసిన తర్వాత చిదంబరం చర్చల ప్రేలాపనల్ని ఎవరైనా నమ్ముతారా? మరింత క్రూరమైన దాడిచేయడానికి చర్చలను సాకుగానే వాడుకునే శతృవుతో మావోయిస్టులు చర్చలకు వెళ్ళరనేది ఆంధ్రప్రదేశ్‌లో మా అనుభవం. కాని ప్రభుత్వం మొట్టమొదట తన క్రూరమైన హింసను ఆపితే కాల్పుల విరమణ సాధ్యమే.

**ఎం.ఐ.బి:** *మీరు ఒకప్పుడు ఉత్తర తెలంగాణ(ఎన్.టి) స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకించి ఉత్తర తెలంగాణ(ఎన్.టి)లో మావోయిస్టు ఉద్యమం తిరిగి పునరుద్ధరించబడుతున్నదని ఇటీవలి మీడియా రిపోర్టులు చెపుతున్నాయి. అసలక్కడ పరిస్థితి ఏమిటి?*

**ఆనంద్:** ప్రస్తుతం ఎన్.టి.లోని కొన్ని ప్రాంతాల్లో మా కార్యకలాపాలు పునరుద్ధరించబడ్డాయనే దానికంటే ఎక్కువేమీ చెప్పలేను. మా స్వీయాత్మక శక్తులు బలహీనంగా వుండటం, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ విస్తృతంగా వుండటం, శతృబలగాలు పెద్దయెత్తున మొహరించి వుండటాన్ని దృష్టిలో పెట్టుకొని జోన్‌లో మా ఎత్తుగడలు, పద్ధతుల్ని మార్చుకున్నాం. ఎ.ఓ.బి స్పెషల్ జోన్ క్రిందికి వచ్చే ఉత్తరాంధ్ర జిల్లాల్లో మా పార్టీ, పి.ఎల్.జి.ఎ. కార్యకలాపాలు విప్లవ ప్రజాసంఘాలు ఎల్లప్పుడూ కొనసాగుతూనే వున్నాయి. ఉత్తరాంధ్ర, ఒడిషా సరిహద్దు ప్రాంతాల్లో మా పి.ఎల్.జి.ఎ 38 మంది గ్రేహౌండ్స్ పోలీసులను నిర్మూలించటం, మరికొన్ని దాడుల్ని చేపట్టడం మా శక్తుల కదలికలకు అనుకూల పరిస్థితిని సృష్టించింది. ప్రజలు కూడా బాగానే ఉద్యమిస్తున్నారు.

**ఎం.ఐ.బి:** *మావోయిస్టులు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్ని వ్యతిరేకించటంతోపాటు, ఆదివాసుల సంస్కృతి, ఆచార, సంప్రదాయాలు మొదలైనవాటిలో అతిగా తలదూర్చుతున్నారని ఇది ఆదివాసులను కోపోద్రిక్తులను చేస్తున్నదనీ ప్రజల్లోని కొన్ని సెక్షన్లలో బలమైన అభిప్రాయాలున్నాయి. ఆదివాసులు సల్వాజుడుంలో చేరడానికి ఇదే ప్రధాన కారణమనీ ప్రచారం జరుగుతున్నది.*

**ఆనంద్:** అభివృద్ధి నిరోధక పాలకులు, పోలీసు వున్నతాధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రభుత్వ ప్రోత్సాహక భయోత్పాత సల్వాజుడుం క్యాంపెయిన్‌ను సమర్థించటానికి ఎక్కుపెట్టిన మానసిక యుద్ధంలో భాగంగా ఈ తెల్ల అబద్ధాల కథలల్లారు. నిరాధారమైన ఇటువంటి అబద్ధాల ద్వారా వాళ్లు తమ సల్వాజుడుం సాయుధ గూండాలను మావోయిస్టులకు వ్యతిరేకంగా యాదృచ్ఛికంగా వచ్చిన స్థానికుల తిరుగుబాటు అనీ చూపించే ప్రయత్నం చేస్తున్నారు. మావోయిస్టుల మొండితనం, అసహనాల వల్ల స్థానిక ఆదివాసులకు దూరమయ్యారని, ఇది ఆదివాసులను మరింతగా ప్రభుత్వం వైపుకు తిప్పిందని కార్పోరేట్ వ్యాపార సంస్థల నుండి ముడుపులందుకుంటున్న వారి ఏజెంట్లు అమాయక ప్రజల చెవుల్లో అదేపనిగా రొద పెడుతున్నారు. ఆదివాసుల సాంస్కృతిక జీవితాల్లోకి, సంప్రదాయాల్లోకి మావోయిస్టులు అతిగా తలదూర్చిన సంఘటన ఒక్కటైనా చూపించకుండానే ఈ ద్వేషపూరిత ప్రచారం సాగిస్తున్న ప్రముఖుల్లో చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్, బి.జె.పి మంత్రులు, నాయకులూ, మహేంద్రకర్మ లాంటి కాంగ్రెస్ నాయకులతో సహా బి.ఎస్.ఎఫ్ మాజీ డి.జి.పి ప్రకాశ్‌సింగ్, ఐ.బి మాజీ అధిపతి డోవల్ ఇంకా ఇతరులు వున్నారు.

ఇప్పటికి మూడు దశాబ్దాలుగా మావోయిస్టులు దండకారణ్యంలో వుంటున్నారు. ఈ రోజున 90శాతం పార్టీ సభ్యత్వం, వివిధ నాయకత్వ కమిటీలలోని అనేకమంది సభ్యులు, పి.ఎల్.జి.ఎ. పోరాటకారులు, అన్ని ప్రజాసంఘాల నాయకత్వంలో, ప్రజల ప్రజాస్వామిక అధికార అంగాల (జనతన సర్కార్లు) నాయకత్వంలో స్థానిక ఆదివాసులే వున్నారు. ప్రస్తుత దశలో యావత్తు డి.కె.లో అలాగే ఝార్ఖండ్, ఒరిస్సా ఇంకా ఇతర రాష్ట్రాల్లోను ఉద్యమానికి ఆదివాసులే జవజీవాలు. ఈ మూడు దశాబ్దాల మా ఉనికిలో ఆదివాసీ జనాభాతో ఎటువంటి ఘర్షణ లేదు. కాని ఆదివాసీ ప్రజానీకంలో ప్రభువులుగా చలామణి అవుతున్న కొందరు తెగ పెద్దలు వర్గపోరాటం జరుగుతున్నప్పటి నుంచి యువ మిలిటెంట్ నాయకత్వం రాకతో తమ ఆధిపత్యాన్ని కోల్పోవటం వల్ల అసంతృప్తితో సణుగుతుంటారు. కాని ఈ తెగ పెద్దల్లో కూడా ముఖ్యమైన సెక్షన్ పార్టీతోనే వుంది. పితృస్వామ్యం, మూఢనమ్మకాలు, ఇంకా ఇతర చెడులతో పోరాడుతూనే మావోయిస్టులు ఆదివాసుల సంప్రదాయాలు, సంస్కృతి, పాటలు మొదలైన వాటిలో నూతన జీవాన్ని నింపడానికి ప్రయత్నించారు. వాస్తవానికి ఈ చెడులకు వ్యతిరేకంగా జరిగిన

ఈ పోరాటం కూడా స్థానిక ఆదివాసీ నాయకత్వం ద్వారానే జరిగి ఆవిధంగా విప్లవాత్మక మార్పు సాధ్యమైంది. వారి సమిష్టి జీవితం, ఆచారాలు సంరక్షింపబడటమేగాక బలోపేతమై సహకార సంఘాల వంటి నూతన దశకు విస్తరించాయి. వారి సమిష్టి జీవితం మరింత సంఘటితపడి ప్రభుత్వ ప్రోత్సాహక భయోత్పాతానికి వ్యతిరేకంగా వారు జరిపిన ప్రతిఘటనను సమిష్టి ఉద్యమంగా తయారు చేసింది. ఆదివాసులు సంఘటితమైన ప్రాంతాల నుండి ఇన్‌ఫార్మర్లను తయారు చేయటం దాదాపు అసాధ్యమని గుర్తించిన పార్లమెంటరీ రాజకీయ పార్టీలు, పోలీసులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆదివాసేతర దోపిడీదారులు, పీడకులు కోపంతో రగిలిపోతున్నారు. అందుకే పోలీసు, పారామిలిటరీ బలగాలు, సల్వాజుడుం గూండాలు ఆదివాసుల ఇళ్ళను, గ్రామాలకు గ్రామాల్ని తగులబెట్టి, వారి మహిళలపై అత్యాచారాలు జరిపి, పురుషులను హతమారుస్తున్నారు. ప్రకాశ్‌సింగ్, అజిత్ డోవల్ లాంటి వాళ్లుఇటువంటి ద్వేషపూరిత నిందలు సృష్టిస్తున్నందుకు సిగ్గుపడాలి. 2006లో దంతెవాడ జిల్లాలో నిజనిర్ధారణ జరిపిన బృందమంతటిలో వీరిద్దరే భిన్నాభిప్రాయంగలవాళ్ళు. వీరికి కలిసిన ఎస్.పి.ఓ.లు, సల్వాజుడుం గూండాలు చెప్పిన కథలనే వీళ్లు వల్లిస్తున్నారు. ఇళ్ళు వదిలి అడవుల్లో తలదాచుకుంటున్న, గ్రామాల్లో మిగిలిన వేలాదిమంది బాధితులను కలవడానికి వీరు ఏ ప్రయత్నమూ చేయలేదు. కలవనందుకు వీరికేమీ చింతలేదు. మావోయిస్టులకు ఆదివాసుల అపారమైన మద్దతు వుందని, ప్రభుత్వం అనాగరిక సల్వాజుడుంను ప్రారంభించిన తర్వాత ఆ మద్దతు మరింత పెరిగిందనే నిజాన్ని దాచి పెట్టలేక అభివృద్ధినిరోధక పాలకులు, వారిచ్చే ముడుపులను అందుకునే ఏజెంట్లు గగ్గోలు పెడుతున్నారు. మావోయిస్టు వ్యతిరేక పుకార్లు వ్యాపింపజేసి ఆదివాసీ ప్రాంతాల్లోని అపార ఖనిజసంపదను కొల్లగొట్టుకుపోవడానికి ఆబగా ఎదురుచూస్తున్న ఈ రాబందులు మావోయిస్టు వ్యతిరేక దుష్ప్రచారంతో సల్వాజుడుం ఫాసిస్టు నిజస్వరూపాన్ని దాచిపెట్టలేరు. ★

## గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా ముక్రాం తరహాలో మరో ప్రతిదాడే

## నారాయణపూర్ డెలిబరేట్ ఆంబుష్

జూన్ 29న సాయంత్రం 5 గంటలకు నారాయణపూర్ జిల్లాలో దౌడాయ్ డెలిబరేట్ ఆంబుష్‌లో 27 మంది సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లను మట్టుబెట్టి, ఏడుగురిని గాయపరిచి 26 ఆయుధాలను స్వాధీనం చేసుకున్న పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్‌కు జేజేలు. అత్యంత సాహసోపేతంగా పోరాడి ఆంబుష్‌ను విజయవంతం చేసిన అమరులు, మన ప్రియతమ కామ్రేడ్స్ ప్లాటూన్ కమాండర్స్ బండు, శంకర్, సెక్షన్ కమాండర్ రమేష్‌లకు జోహార్లు.

గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా సి.పి.ఐ.(మావోయిస్టు) పొలిట్‌బ్యూరో అయిదు రాష్ట్రాల్లో ఇచ్చిన 48 గంటల బంద్ సందర్భంగా జరిగిన ఈ ఆంబుష్‌లో 9 ఏకేలు, 10 ఇన్‌సాస్‌లు, 3 ఎస్.ఎల్.ఆర్.లు, 2 ఎల్.ఎం.జి.లు, 2 టూ ఇంచ్ మోర్టార్లను పి.ఎల్.జి.ఎ. స్వాధీనం చేసుకుంది.

## నారాయణపట్న అమరులు కామ్రేడ్స్ సూర్యం, జగదీష్‌లకు జోహార్లు

మే 9న ఉదయం 9 గంటలకు ఒడిషా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నారాయణపట్న బ్లాక్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ సూర్యం (జీవన్, ప్రకాష్) సి.ఆర్.సి. సభ్యుడు, 2వ కంపెనీ పార్టీ కమిటీ కార్యదర్శి, మరియు గార్డ్ జగదీష్ అమరులయ్యారు. ఉదయాన్నే గ్రామాలను చుట్టుముట్టిన వందలాది మంది పోలీసు, పారామిలిటరీ, గ్రేహౌండ్స్, ఎస్.ఓ.జి. బలగాలు కామ్రేడ్ సూర్యంతో ఉన్న చిన్న టీంపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో మన కామ్రేడ్స్ ఇద్దరూ పోరాడుతూ అమరులయ్యారు. రెండు దశాబ్దాలపాటు గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోనూ, నల్లమల గెరిల్లా జోన్‌లోను ఉద్యమ నిర్మాణానికి అవిశ్రాంతంగా పోరాడిన కామ్రేడ్ సూర్యం పార్టీ అవసరాలరీత్యా కేంద్ర రీజియన్‌లో మిలిటరీ బాధ్యతలను నిర్వహిస్తున్నాడు. కామ్రేడ్ జగదీష్ చాలా కాలంగా గార్డ్‌గా కొనసాగుతున్నాడు.

(వీళ్ల జీవిత చరిత్రలను తరువాత సంచికలో ప్రచురిస్తాం – సంపాదకవర్గం)

రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా అధ్యయనం కోసం - ౨

# పార్టీలో తప్పుడు అభి

*డిసెంబరు 1929*

నాల్గవ ఎర్రసైన్యంలోని పార్టీ నిర్మాణంలో కార్మికవర్గేతర ధోరణులు చాలా బలంగా వున్నాయి. పార్టీ సరైన పంథాను అమలు పరుచుటకు ఇవి అడ్డు వస్తున్నాయి. ఈ ధోరణులను సంపూర్తిగా సరిదిద్దలేకపోతే, చైనా విప్లవ పోరాటంలో 4వ ఎర్రసైన్యానికి ఇవ్వబడిన కర్తవ్యాలను, అది నిర్వహించజాలదు. పార్టీ ఎర్రసైన్యంలోని 4వ సైన్యం 9వ కాంగ్రెసుకు, కామ్రేడ్ మావో–సే–టుంగు సమర్పించిన తీర్మానమే ఈ వ్యాసం. చైనా ప్రజా సైన్యాన్ని నిర్మించడం చాలా కష్టమయిన మార్గంలో నడిచింది, చైనా ఎర్రసైన్యంలో (జపాన్ వ్యతిరేక పోరాటంలో 8వ రూట్ సైన్యంగానూ, కొత్త 4వ సైన్యంగాను మారింది. ఇపుడు ప్రజావిముక్తి సైన్యంగా పిలువబడుతూ వుంది.) నాంచాంగు తిరుగుబాటులో ఆగస్టు 1,1927లో స్థాపించబడింది. డిసెంబరు 1929 నాటికి ఎర్రసైన్యానికిరెండు సంవత్సరాల వయస్సు నిండింది. ఈ కాలంలో ఎర్ర సైన్యంలోని కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం తప్పుడు అభిప్రాయాలు ఎదుర్కొనడంలో చాలా అనుభవం సంపాదించింది. ఈ అనుభవాన్ని తీర్మానం సమీక్షించింది. ఇది ఎర్ర సైన్యం మార్క్సిస్టు–లెనినిస్టు ప్రాతిపదికపై నిర్మాణం కావటానికి తోడ్పడింది. పాత సైన్యాల ధోరణులను ఎర్ర సైన్యం నుండి తొలగించుటకు తోడ్పడింది. 4వ సైన్యంలోనే కాకుండా, ఇతర ఎర్ర సైన్యం విభాగాల్లో కూడా దీనిని విజయవంతంగా అమలు జరిపారు. ఈ పద్ధతి ద్వారా ఎర్రసైన్యం అన్ని విధాలా నిజమయిన ప్రజాసైన్యంగా రూపొందింది. గత 30 సంవత్సరాల కాలంలో చైనా ప్రజాసైన్యం పార్టీ కార్యక్రమాల్లో, రాజకీయ కార్యక్రమాల్లో బ్రహ్మాండంగా అభివృద్ధి చెందింది. నూతన పద్ధతులను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం మరొక నూతన దశకు చేరుతుంది. కానీ ఈ తీర్మానంలోని పంథా ఈ నాటికి చైనా ప్రజా సైన్యంలో పునాదిగా వుంది.

నిర్మాణంలోని ఈ తప్పుడు అభిప్రాయాలకు మూలం, దీని యొక్క పునాది యూనిట్లలో, రైతులు, పెటీ బూర్జువా స్వభావం కలిగిన వారితో నిండి వుండటమే. పార్టీ నాయకత్వ సంస్థలు తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా నిశ్చయాత్మక పోరాటం తగినంతమేరకు జరుపకపోవటం, సరైన పార్టీ పంథా గురించి సభ్యులకు గట్టి రాజకీయ శిక్షణ ఇవ్వలేకపోవటం కూడా, ఈ తప్పుడు ధోరణులు వుండడానికి దోహదం చేస్తున్నది. కేంద్ర కమిటీ సెప్టెంబరు లేఖ సూచనల ప్రాతిపదికపై నాల్గవ సైన్యంలోని తప్పుడు ధోరణులను, వాటి మూలకారణములను, వాటిని సరిదిద్దే పద్ధతులను, ఈ కాంగ్రెసు సూచిస్తుంది. వీటిని తొలగించుటకు ప్రతి పార్టీ సభ్యుడు పట్టుదలతో కృషి చెయ్యాలని కోరుతూ వుంది.

## శుద్ధ మిలటరీ దృక్పథం

ఎర్రసైన్యంలో, కొంతమంది పార్టీ సభ్యుల్లో శుద్ధ మిలిటరీ దృక్పథం బలంగా పాతుకుని వుంది. అది ఈ కింది విధంగా ప్రతిబింబించుతూ వుంది.

1. వీరి దృష్టిలో మిలిటరి వ్యవహారాలు, రాజకీయాలు, పరస్పర వ్యతిరేకమయినవి. రాజకీయ లక్ష్యాలు సాధించడానికి మిలిటరి చర్యలు ఒక సాధనం మాత్రమేనన్న వాస్తవాన్ని వీరు గుర్తించరు. కొంతమంది ఇలా వాదించుతూ వుంటారు కూడా: "మిలిటరి వ్యవహారల్లో నీవు సిద్ధహస్తుడవయితే; రాజకీయాల్లో కూడా నీవు సిద్ధహస్తుడవయినట్లే; మిలిటరీ వ్యవహారాల్లో నీవు సిద్ధహస్తుడవు కాకపోతే, రాజకీయాల్లో కూడా నీవు సిద్ధహస్తుడవు కానట్లే". దీనితో వీరు ఒకడుగు ముందుకువేసి, రాజకీయాలపైన మిలిటరి వ్యవహరాలకు నాయకత్వం ఇస్తున్నారన్నమాట.

2. దోపిడి వర్గ ప్రభుత్వ సైన్యంలాగే, ఎర్రసైన్యం కర్తవ్యం కూడా కేవలం యుద్ధం చేయడమేనని వారి అభిప్రాయం. చైనా ఎర్ర సైన్యం విప్లవం యొక్క రాజకీయ కర్తవ్యాలను సాధించడానికేర్పడిన సాయుధ సంస్థ అని వారు అర్థం చేసుకోరు. ప్రత్యేకంగా, ప్రస్తుత పరిస్థితుల్లో ఎర్రసైన్యం కేవలం యుద్ధానికి పరిమితమై వుండడానికి వీలులేదు. శత్రువు యొక్క మిలిటరి శక్తిని ధ్వంసం చేయడానికి, ఒకవైపు యుద్ధం కొనసాగిస్తూనే, మరొకవైపు రాజకీయ కర్తవ్యాలను నిర్వహించవలసి వుంది. ప్రజల్లో ప్రచారం, ప్రజలను ఆర్గనైజ్ చేయడం, ప్రజలను సాయుధం చేయడం, విప్లవ రాజకీయాధికారం స్థాపించుటకు ప్రజలకు సహాయం చేయడం, పార్టీ నిర్మాణ సంస్థల నేర్పరచడం – ఇలాంటి ముఖ్యమయిన రాజకీయ కర్తవ్యాలు నిర్వహించవలసి వుంది. ఎర్రసైన్యం కేవలం పోరాటం కొరకు పోరాటం సాగించటం లేదు. ప్రజలలో ప్రచారం, ప్రజలను ఆర్గనైజు

# ప్రాయాలను సరిదిద్దుట

కామ్రేడ్ మావో

చేయడం, ప్రజలను సాయుధం చేయడం, రాజకీయాధికారాన్ని స్థాపించుటకు ప్రజలకు సహాయం చేయటం – ఇలాంటి కర్తవ్యాలు నిర్వహించుటకు పోరాటం చేస్తుంది. ఈ లక్ష్యాలు లేకుండా, పోరాటానికి అర్థం లేదు. ఎర్రసైన్యం యొక్క అస్థిత్వానికి అర్థం లేదు.

3. తత్ఫలితంగా, నిర్మాణంలో, ఎర్రసైన్యంలో రాజకీయ కర్తవ్యాలు నిర్వహించే విభాగాల కంటే మిలిటరీ కర్తవ్యాలు నిర్వహించే విభాగాలకు వీరు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. "సైన్య కేంద్ర కార్యాలయం బయటి విషయాలు నిర్ణయించనివ్వండి" అని వారు వాదించుతూ వుంటారు. ఈ ధోరణి పెరిగితే ప్రజల నుండి దూరం కావడం ప్రభుత్వాన్ని సైన్యం కంట్రోలు చేయడం, కార్మికవర్గ నాయకత్వ పంథాకు దూరం కావడం లాంటి ప్రమాదాలున్నా కొమింటాంగు సైన్యంలాగే, సైనిక ప్రభువుల పంథా చేపట్టే ప్రమాదముంది.

4. అదే సమయంలో ప్రచార కార్యక్రమంలో, ప్రచారక దళాల ప్రాముఖ్యతను వీరు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజాసంస్థల నిర్మాణ విషయంలో సైన్యంలో సైనిక కమిటీల నిర్మాణం, స్థానిక రైతులను; కార్మికులను సంఘాల్లో సమీకరించడం లాంటి పనులు వీరు నిర్లక్ష్యం చేస్తున్నారు. తత్ఫలితంగా ప్రచార కార్యక్రమం, నిర్మాణ కార్యక్రమం వదిలి వేయబడ్డాయి.

5. ఒక యుద్ధంలో గెలిస్తే వీరు గర్వంతో వుప్పొంగిపోతారు. ఒక్క యుద్ధంలో దెబ్బతింటే నిరుత్సాహపడుతారు.

6. స్వార్థపూరితమైన ఆలోచనలకు లొంగుతారు. వీరు 4వ ఎర్ర సైన్యాన్ని గురించి మాత్రమే ఆలోచించుకుంటారు. ప్రజలను సాయుధం చేయటం ఎర్రసైన్యం యొక్క ప్రధాన కర్తవ్యమని వీరు గుర్తించరు. ఇది అతి స్పష్టంగా కనపడే సంకుచిత గ్రూపు మనస్తత్వం.

7. 4వ ఎర్రసైన్యంలోనున్న పరిమితమైన సరిహద్దులను దాటి చూడనందువల్ల, కొంతమంది కామ్రేడ్స్, తాముగాక ఇతర విప్లవ సైన్యం వున్నదని గుర్తించడంలేదు. అందువల్లే వీరు పోరాటాలు తప్పించుకుని, బలాన్ని కాపాడుకోవాలనే ధోరణి వ్యక్తం చేస్తుంటారు. ఇది అవకాశవాదం యొక్క అవశేషం మాత్రమే.

8. కొంతమంది కామ్రేడ్స్ భౌతిక పరిస్థితులు, స్వీయాత్మక పరిస్థితులు దృష్టిలో వుంచుకోకుండా, విప్లవ అసహనాన్ని ప్రదర్శించుతూ వుంటారు. ప్రజల్లోనికి లోతుగా వెళ్ళి, చిన్న చిన్న పనులు చేయడానికి నిరాకరిస్తూ, లేనిపోని భ్రమలు పెట్టుకుని, పెద్ద చర్యలు మాత్రమే చేయాలని కోరతారు. ఇది దుందుడుకు పద్ధతుల అవశేషం.

శుద్ధ మిలటరీ దృక్పథానికి ఈ కిందివి మూలకారణములు:

1. చాలా తక్కువ రాజకీయ స్థాయి: దీనివల్ల సైన్యంలో రాజకీయ నాయకత్వం యొక్క పాత్రను గుర్తించుటలో విఫలులవుతారు. ఎర్రసైన్యం, దోపిడీవర్గ ప్రభుత్వ సైన్యం ఈ రెండు సైన్యాలకు ప్రాథమికమైన భేదాలున్నవని గుర్తించలేరు.

2. జీత, భత్యం కొరకు పనిచేసే మనస్తత్వం: గత యుద్ధాల్లో మన చేతికి చిక్కిన చాలా మంది శత్రు సైనికులు ఎర్ర సైన్యంలో చేరారు. వీరు తమతోపాటు జీతభత్యాల కొరకు పని చేసే మనస్తత్వాన్ని ఎర్ర సైన్యంలోనికి మోసుకొని వచ్చారు. ఆ విధంగా ఎర్ర సైన్యంలో కిందస్థాయిలో కేవలం మిలిటరీ దృక్పథానికి పునాది ఏర్పడింది.

3. పై రెండు కారణాలు, మూడవ కారణానికి దారి తీసింది. మిలిటరి బలంపై అతి విశ్వాసం వుంచి, ప్రజాస్వామ్యం యొక్క శక్తిపై విశ్వాసం పోగొట్టుకుంటారు.

4. మిలిటరి కార్యక్రమాన్ని గురించి పార్టీ తగు శ్రద్ధ తీసుకోకపోవటం, చర్చించకపోవడం వల్ల కూడా, చాలా మంది సభ్యుల్లో శుద్ధ మిలిటరీ దృక్పథం ఏర్పడటానికి ఒక కారణం.

ఈ కింది పద్ధతుల ద్వారా ఈ తప్పును సరిదిద్దవలసి వుంది:

1. రాజకీయ శిక్షణ ద్వారా పార్టీలో రాజకీయ స్థాయి పెంచాలి. తద్వారా శుద్ధ మిలిటరీ దృక్పథానికి సిద్ధాంత పునాది లేకుండా చేయాలి. ఎర్ర సైన్యానికి–తెల్ల సైన్యానికి (దోపిడీవర్గ ప్రభుత్వ సైన్యం–అనువాదకుడు) మధ్య వున్న ప్రాథమిక విభేదాన్ని స్పష్టంగా గుర్తించాలి. అదే సమయంలో, అవకాశవాదం, దుందుడుకువాదం

యొక్క అవశేషాలను తొలగించాలి. నాల్గవ సైన్యంలోని స్వార్థపూరిత ఆలోచనను నిర్మూలించాలి.

2. ఆఫీసర్ల యొక్క, సైనికుల యొక్క ముఖ్యంగా శత్రువు నుండి ఖైదీలుగా పట్టుకున్న సైనికుల యొక్క రాజకీయ శిక్షణను తీవ్రపరచాలి. అదే సమయంలో పోరాటాల్లో అనుభవం పొందిన కార్మికులను, రైతులను ఏరుకొనుటకు స్థానిక ప్రభుత్వాలకు స్వేచ్ఛనివ్వాలి. ఆవిధంగా, శుద్ధ మిలిటరీ దృక్పథాన్ని నిర్మాణరీత్యా బలహీనపర్చాలి. సంపూర్తిగా రద్దు చేయాలి.

3. ఎర్రసైన్యంలో పార్టీ సంస్థలను విమర్శించుటకు, పార్టీ సంస్థలను ప్రోత్సహించాలి. ప్రజా రాజకీయాధికార సంస్థలు ఎర్ర సైన్యాన్ని కూడా విమర్శించుటకు ప్రోత్సహించాలి. తద్వారా ఎర్రసైన్యంలోని పార్టీ సంస్థలను, ఆఫీసర్లను, సైనికులను, ప్రజలచేత ప్రభావితులను చెయ్యాలి.

4. పార్టీ మిలిటరీ కార్యక్రమంపై శ్రద్ధ వహించి తీవ్రంగా చర్చించాలి. పార్టీ కార్యక్రమం సాధారణ సభ్యులచేత అమలు జరుపబడేముందు, పార్టీలో చర్చించబడి, నిర్ణయించబడాలి.

5. ఎర్రసైన్యం యొక్క కర్తవ్యాలను నిర్దేశించుతూ స్పష్టమయిన రూల్సు, రెగ్యులేషన్సు తయారు చేయాలి, మిలిటరీ, రాజకీయ విభాగాల, సంబంధాలను స్పష్టపరచాలి. ఎర్రసైన్యానికి, ప్రజలకు మధ్య వుండవలసిన సంబంధాలను, సైనిక కమిటీల యొక్క అధికారాలను, విధులను, సైనిక కమిటీలకు మిలిటరీ, రాజకీయ విభాగాలతో వుండవలసిన సంబంధాలను స్పష్టపరచాలి.

## అతి ప్రజాస్వామికం

కేంద్ర కమిటీ సూచనను ఎర్ర సైన్యంలోని 4వ సైన్యం అంగీకరించినప్పటి నుండి, అతి ప్రజాస్వామికం యొక్క చిహ్నాలు చాలావరకు తగ్గాయి. ఉదాహరణకు ప్రస్తుతం పార్టీ నిర్ణయాలు దాదాపు పూర్తిగా అమలు జరుపబడుతున్నాయి. ఎర్ర సైన్యం "కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని కింది నుండి పైకి అమలు జరపాలనే. కింది యూనిట్లు అన్ని సమస్యలు చర్చించిన తర్వాతనే పై యూనిట్లు నిర్ణయాలు చెయ్యాలి" అనే తప్పుడు కోర్కెలు ప్రస్తుతం ఎవరూ కోరటంలేదు. అయితే, వాస్తవంలో, అతి ప్రజాస్వామిక ధోరణులు తగ్గటం అనేది ఇప్పటికీ నామమాత్రంగానే వుంది. అది కూడా చాలా తాత్కాలికం. అతి ప్రజాస్వామిక ధోరణులు ఇప్పటికే, పూర్తిగా నిర్మూలించబడ్డాయని దీనర్థం ఎంతమాత్రం కాదు. మరొకమాట చెప్పాలంటే అతి ప్రజాస్వామిక ధోరణులు చాలా మంది పార్టీ సభ్యుల్లో చాలా బలంగా నాటుకొని వున్నాయి. పార్టీ నిర్ణయాలను అమలుపరచడానికి అనేక సందర్భాలలో కానవస్తున్న విముఖత దీనినే రుజువు పరుస్తూ వుంది.

ఈ తప్పుడు ధోరణిని ఈ కింది పద్ధతుల ద్వారా సరిదిద్దాలి:

1. సిద్ధాంత రంగంలో, అతి ప్రజాస్వామికం యొక్క పునాదులు నిర్మూలించాలి. మొట్ట మొదట అతి ప్రజాస్వామికం పార్టీ సంస్థలను బలహీనపరుస్తుందని లేక పూర్తిగా ధ్వంసం చేస్తుందని, పోరాట కర్తవ్యాలను నిర్వహించటంలో పార్టీ తన శక్తిని కోల్పోయేలాగు చేస్తుందని, తద్వారా విప్లవమే విఫలమవుతుందని స్పష్టపరచాలి. రెండవది– క్రమశిక్షణను ధిక్కరించే పెటీ బూర్జువా అహంకారమే, అతి ప్రజాస్వామికానికి పునాది అన్న విషయాన్ని స్పష్టపరచాలి. ఈ స్వభావం పార్టీలో ప్రవేశించినపుడు రాజకీయంగా, నిర్మాణరీత్యా, పార్టీలో అతి ప్రజాస్వామిక ధోరణులు తలయెత్తుటకు దోహదం చేస్తుంది. కార్మికవర్గ పోరాట కర్తవ్యాలకు, ఈ అతి ప్రజాస్వామిక ధోరణులకు ఎలాంటి పొత్తు పొసగదు.

2. నిర్మాణ రంగంలో కేంద్రీకృత నాయకత్వం కింద ప్రజాస్వామికాన్ని ఖచ్చితంగా అమలుపర్చాలి. కింది పద్ధతుల ద్వారా ఈ బాధ్యతలు నిర్వహించాలి.

1) సమస్యలు తలెత్తినపుడు వాటికి సరైన పరిష్కార మార్గాలు చూపించి, సరైన పంథా అమలు జరిపించడానికి పార్టీ నాయకత్వ సంస్థలు బాధ్యత వహించాలి. ఆ విధంగా అవి నాయకత్వ కేంద్రాలుగా పని చేయాలి.

2) ప్రజా జీవితాన్ని గురించి, కింది సంస్థల పరిస్తితిని గురించి, పై కమిటీలు సంపూర్తిగా తెలుసుకుని వుండాలి. పై కమిటీలు సరైన సూచనలివ్వడానికి కావలసిన చక్కటి భౌతిక పునాది అపుడే లభించగలదు.

3) సమస్యలను పరిష్కరించటంలో, ఏ స్థాయిలో కూడా పార్టీ కమిటీలు యధాలాప నిర్ణయాలు చెయ్యకూడదు. ఒక సమస్యపై నిర్ణయం చేయబడిన తర్వాత దానిని ఖచ్చితంగా అమలుపరచాలి.

4) పార్టీ నాయకత్వ సంస్థలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్న వెంటనే సాధారణ పార్టీ సభ్యులకు, కింది సంస్థలకు తెలియజేయాలి. పార్టీ కర్తవ్యాల సమావేశాల ద్వారా, లేక జనరల్ బాడీ సమావేశాల ద్వారాగాని లేక ఒక కాలమ్ సైనిక విభాగాలకు చెందిన ముఖ్య కార్యకర్తల లేక పార్టీ సభ్యుల జనరల్ బాడి మీటింగ్‌లు జరిపి (పరిస్థితులు అనుకూలించినపుడు) పై కమిటీల నిర్ణయాలు తెలియజేయాలి. అటువంటి సమావేశాలకు ఎవరు రిపోర్టు చేయాలో ముందుగానే నిర్ణయించుకుని వుండాలి.

5) సాధారణ పార్టీ సభ్యులు, పార్టీ కింద సంస్థలు, పైకమిటీల సూచనలు వివరంగా చర్చించి వాటిని అమలుజరిపే పద్ధతులు నిర్ణయించుకోవాలి.

## నిర్మాణ క్రమశిక్షణ యెడల నిర్లక్ష్యం

నాల్గవ సైన్యంలో పార్టీ నిర్మాణంలో క్రమశిక్షణారాహిత్యం ఈ కింది విధంగా ప్రతిబింబించుతూ వుంది.

మెజారిటీ నిర్ణయాలకు, మైనారిటీ కట్టుబడి వుండకపోవటం. ఉదాహరణకు మైనారిటీ తన తీర్మానం ఓడిపోయినపుడు, మెజారిటీ నిర్ణయాన్ని మన స్ఫూర్తిగా అమలు జరుపుటకు పూనుకోరు.

ఈ తప్పుడు ధోరణిని ఈ కింది విధముగా సరిదిద్దాలి:

1. మీటింగుల సందర్భంలో ప్రతి ఒక్కరూ తన అభిప్రాయాన్ని పూర్తిగా చెప్పుటకు ప్రోత్సహించాలి. ఏ తగాదాంశాలలోనైనా భిన్నాభిప్రాయాలను రాజీపడకుండా, స్పష్టంగా వివరించాలి. పార్టీ పనికి నష్టం రాకుండా వుంటే, ఒక సమావేశంలో సరైన నిర్ణయానికి రాలేకపోతే, తిరిగి మీటింగులు జరుపుకుని సరైన నిర్ణయాలకు రావాలి.

2. మైనారిటీ, మెజారిటీ నిర్ణయానికి కట్టుబడి వుండడమనేది క్రమశిక్షణలో ముఖ్యాంశం. మైనారిటీ అభిప్రాయం నిరాకరించబడిన తర్వాత, వారు మెజారిటీ నిర్ణయాన్ని బలపర్చాలి. అవసరమైతే, తర్వాత సమావేశంలో దీనిని చర్చకు తీసుకురావచ్చుగాని, ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎలాంటి చర్య తీసుకోగూడదు.

నిర్మాణ క్రమశిక్షణను దృష్టిలో వుంచుకోకుండా విమర్శించే పద్ధతి;

1. ఆంతరంగిక విమర్శ పార్టీ నిర్మాణాన్ని, పార్టీ పోరాట శక్తిని పెంచుకోవడానికి ఉపయోగించాలి. ఎర్ర సైన్యానికి చెందిన పార్టీ సంస్థలలో ఆంతరంగిక విమర్శ ఎల్లప్పుడూ ఈ పద్ధతిన వుండటంలేదు. కొన్ని సందర్భాలలో వ్యక్తులపై దాడి రూపం తీసుకుంటూ వుంది. తత్ఫలితంగా ఇలాంటి విమర్శ పార్టీ నిర్మాణానికి, వ్యక్తులకు నష్టకరంగా తయారవుతుంది. పెటీబూర్జువా వ్యక్తిగత విధానానికి అది చిహ్నం. ఈ తప్పుడు పద్ధతిని సరిదిద్దాలంటే, వర్గ పోరాటంలో విజయం సాధించడానికి పార్టీ పోరాట పటిమను పెంచుకోవడమే, విమర్శ యొక్క ప్రధానోద్దేశ్యమని, వ్యక్తిగత దాడికి విమర్శను ఒక సాధనంగా తీసుకోకూడదని, పార్టీ సభ్యులందరూ గుర్తించేటట్లు చేయాలి.

2. చాలా మంది పార్టీ సభ్యులు తమ విమర్శను పార్టీ లోపలగాక, వెలుపల చేస్తుంటారు. వారు పార్టీ నిర్మాణం యొక్క (పార్టీ మీటింగులు మొదలగునవి) ప్రాముఖ్యతను గ్రహించకపోవడమూ, పార్టీ లోపల చేసే విమర్శకూ, బయటచేసే విమర్శకూ గల భేదాన్ని చూడకపోవటం దీనికి కారణాలు. ఈ తప్పుడు పద్ధతిని సరిదిద్దాలంటే, పార్టీ సభ్యులందరూ, పార్టీ నిర్మాణం యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకునేటట్లు, పార్టీ కమిటీలపైగాని, సభ్యులపైగాని పార్టీ మీటింగులలోనే విమర్శ కొనసాగించాలని పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ ఇవ్వాలి.

## సంపూర్ణమైన సమానత్వం

ఒక దశలో ఎర్ర సైన్యంలో సంపూర్ణమైన సమానత్వం తీవ్రమయిన సమస్యగా తయారైంది. కింది ఉదాహరణలు చూడండి. గాయపడిన సైనికులకు అలవెన్సులు ఇవ్వటంలో తీవ్రంగా గాయపడినవారికి ఎక్కువ అలవెన్సు, తక్కువ గాయపడిన వారికి తక్కువ అలవెన్సు ఇవ్వాలనే పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకించారు. అందరికి సమాన అలవెన్సు ఇవ్వాలని కోరారు. అధికారులు గుర్రాలపై ప్రయాణం చేసినపుడు, వారు బాధ్యతలు నిర్వహించడానికి, అలా చేయవలసి వుందని గుర్తించడం కాకుండా, పై అధికారులకు ఎక్కువ సదుపాయాలు కల్గించుకున్నట్లుగా భావించారు. అందరికి వస్తువులు సమానంగా సప్లయి చేయాలని డిమాండు చేశారు. ప్రత్యేక పరిస్థితుల్లో, కొంత ఎక్కువ సప్లయిలు ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. ఆహార ధాన్యాలు మోసుకుపోవడంలో, వయసుబట్టిగానీ, శారీరక శక్తినిబట్టిగాని తేడా చూడకుండా అందరూ సమానంగా మోయాలని కోరడం జరిగింది. గృహ వసతి అందరికీ సమానంగా వుండాలని కోరారు. కేంద్ర కార్యాలయం పెద్ద గదులను ఆక్రమించుకున్నదని విమర్శించారు. అలసట వచ్చే పనులు అందరికి సమానంగా పంచాలని డిమాండు చేశారు. పక్కవారికంటే కొంచెం ఎక్కువ పని చేయడానికి కూడా ఇష్టపడేవారు కాదు. పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే, ఇద్దరు గాయపడిన సైనికులకు, ఒకరినే మోసుకుపోయే వాహనం వున్నపుడు, ఒకరిని ముందు మోసుకుపోవటానికి రెండవ వారు అంగీకరించకపోవటంతో, ఇద్దరినీ మోసుకుపోకూడదని వాదించేవారు. పై ఉదాహరణలనుబట్టి అధికారులు, సైనికుల్లో సంపూర్ణ సమానత్వం ధోరణులు ఇంకా బలంగా వున్నాయని స్పష్టమగుతూ వుంది.

రాజకీయ వ్యవహారాల్లో అతి ప్రజాస్వామికంలాగనే, సంపూర్ణ సమానత్వ ధోరణి కూడా, చేతి వృత్తుల, చిన్న రైతుల ఆర్థిక విధానం నుండి ఉత్పతన్నమయిందే. తేడా అంతా, ఒకటి రాజకీయాల్లో ప్రతిబింబించితే, మరొకటి వస్తువుల, సౌకర్యాల విషయంలో ప్రతిబింబించుతూవుంది.

దీనిని ఈ కింది విధంగా సరిదిద్దుకోవాలి. పెట్టుబడిదారీ విధానం రద్దుగాకుండా, సంపూర్ణమైన సమానత్వం సాధించుతామని

భావించటం, చిన్న ఉత్పత్తిదారులయిన రైతుల భ్రమలు మాత్రమే. సోషలిస్టు వ్యవస్థలో కూడా సంపూర్ణమయిన సమానత్వం అసాధ్యం ఎందుకంటే సోషలిస్టు వ్యవస్థలో కూడా "శక్తికొద్ది శ్రమ, శ్రమకు తగ్గ ప్రతిఫలం" అనే సూత్రాలపై ఆధారపడి మాత్రమే భౌతిక వస్తువుల పంపిణీ జరుగుతుంది. ఎర్ర సైన్యంలో ఆఫీసర్లకు, సైనికులకు సమాన జీతంలాగే, భౌతిక వస్తువులు దాదాపు సమానంగా పంచాలి. ప్రస్తుత పోరాట పరిస్థితిని బట్టి ఇది తప్పదు. హేతుబద్ధంకాని సంపూర్ణ సమానత్వాన్ని వ్యతిరేకించాలి. మన పోరాటానికి తోడ్పడదు. పైగా పోరాటానికి నష్టం కూడా తెస్తుంది.

## స్వీయమానసికతత్వం

కొంతమంది పార్టీ సభ్యులలో వ్యక్తిగత పని విధానం తీవ్రంగానే వుంది. రాజకీయ పరిస్థితి పరిశీలనకుగానీ, సరైన సూచన లివ్వడానికిగాని ఈ ధోరణి నష్టకరంగా పరిణమించుతూ వుంది. రాజకీయ పరిస్తితినిగూర్చి స్వీయ మానసిక పరిశీలన చేయడం, కార్యక్రమాన్ని స్వీయమానసిక ధోరణిలో నడపడం, అవకాశ వాదానికిగానీ, లేక దుస్సాహసిక విధానానికి తప్పకుండా దారి తీస్తుంది. వ్యక్తిగత విమర్శ, ఆధారరహితమయిన విచ్చలవిడి విమర్శ, అనుమానాలు ఇలాంటి పద్ధతులు పార్టీలో సూత్రరహిత తగాదాలకు దారి తీసి పార్టీ నిర్మాణాన్ని బలహీనపరుస్తాయి.

పార్టీ ఆంతరంగిక విమర్శ సందర్భంలో, మరొక విషయం కూడా చెప్పవలసి వుంది. కొంతమంది కామ్రేడ్స్ విమర్శ చేసే సందర్భంలో ముఖ్యమైన సమస్యలు వదలివేసి, చిన్న విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యతయిస్తూ వుంటారు. విమర్శ యొక్క ప్రధానోద్దేశ్యం, రాజకీయ నిర్మాణ తప్పులు ఎత్తిచూపాలనే విషయాన్ని వీరు మరచిపోతూ వుంటారు. వ్యక్తిగత బలహీనతల గురించి, రాజకీయ నిర్మాణ తప్పులతో వాటికి సంబంధం వుంటే తప్ప, అలాంటి తప్పు చేసినవారి యెడల అతి విమర్శ చేయటంగాని, ఆ కామ్రేడ్ బాధపడేలాగు ప్రవర్తించడం గాని తప్పవుతుంది. అలాంటి విమర్శ ఒకసారి ప్రారంభమయిన తర్వాత పార్టీ సభ్యులు పూర్తిగా చిన్న చిన్న తప్పులపైననే కేంద్రీకరించే ప్రమాదముంది. అపుడు ప్రతి పార్టీ సభ్యుడు భయానికిలోనై, తప్పులు జరుగుతాయనే భయంకొద్దీ, పార్టీ రాజకీయ కర్తవ్యాలు మరచిపోయే ప్రమాదముంది.

దీనిని సరిదిద్దడానికి, పార్టీ సభ్యుల ఆలోచనలలో, పార్టీ జీవితంలో, రాజకీయ శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి చెందేటట్లు, పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ ఇవ్వాలి. దీనిని సాధించడానికి 1) రాజకీయ పరిస్థితిని పరిశీలించటంలో, వర్గ శక్తుల బలా బలాలను అంచనావేసుకోవడంలో, వ్యక్తిగత వూహాగానంపై ఆధారపడకుండా, మార్క్సిస్టు–లెనినిస్టు పద్ధతిని అమలు పరచుటకు పార్టీ సభ్యులకు శిక్షణ ఇవ్వాలి. 2) సాంఘిక, ఆర్థిక పరిస్థితులను పరిశీలించడం, అధ్యయనం చేయడం నేర్పాలి. తద్వారానే, సరైన పోరాట ఎత్తుగడలను పోరాట విధానాన్ని నిర్ణయించగల్గుతాం. వాస్తవ పరిస్థితులను గురించి సరైన పరిశీలన లేకపోతే, ఊహాగానంపై ఆధారపడి బురదగుంటలోకి లేక దుందుడుకు వాదానికి వెళ్లే ప్రమాదముందని, పార్టీ సభ్యులు గుర్తించేలాగు చెయ్యాలి. 3) పార్టీ ఆంతరంగిక విమర్శ విషయంలో, స్వీయాత్మక మానసిక ధోరణి, నిరంకుశత్వం, విమర్శనా అవకాశాన్ని దుర్వినియోగపర్చటం లాంటి తప్పులు దొర్లకుండా చూడాలి. వాస్తవ విషయాలపై స్టేట్‌మెంట్లు ఆధారపడి వుండాలి. విమర్శ రాజకీయాలపై కేంద్రీకరించి వుండాలి.

## వ్యక్తితత్వవాదం

ఎర్రసైన్యలోని, పార్టీ నిర్మాణంలోని వ్యక్తిగత పని విధానం ఈ కింది విధంగా ప్రతిబింబించుతూ వుంది.

1. కక్ష సాధింపు: కొంత మంది కామ్రేడ్సు పార్టీ మీటింగులలో తమను విమర్శించిన పార్టీ సభ్యులపై మీటింగు వెలుపల కక్ష సాధించుటకు పూనుకోవడం, అతనిని దూషించడమో, కొట్టడమో జరుగుతుంది. పార్టీ లోపల కూడా కక్ష సాధించుటకు ప్రయత్నిస్తారు. "ఈ మీటింగులో నన్ను విమర్శించావు– తర్వాత మీటింగులో నీ పని నేను పడతాను" అనే ధోరణితో వ్యవహరిస్తారు. కేవలం వ్యక్తి గత ఆలోచనా ధోరణుల వల్లనే, ఇలాంటి పగ సాధింపు ధోరణి వస్తుంది. మొత్తం పార్టీ యొక్క వర్గం యొక్క ప్రయోజనాలకు ఇది నష్టకరం. వీరి దాడికి గురయ్యేది శత్రువు కాదు, మన పార్టీలోని వ్యక్తులు మాత్రమే. ఈ ధోరణి మన నిర్మాణాన్ని బలహీనపరుస్తుంది. మన పోరాట శక్తిని క్షీణింప చేస్తుంది.

2. చిన్న గ్రూపు మనస్తత్వం: మొత్తం పార్టీ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకోకుండా తమ చిన్న గ్రూపు ప్రయోజనాలు మాత్రమే దృష్టిలో వుంచుకుని, కొందరు కామ్రేడ్స్ వ్యవహరిస్తూ వుంటారు. పైకి చూస్తే, ఇక్కడ వ్యక్తిగత ప్రయోజనాలకు పాటుపడుతున్నట్లుగా మన కగుపడదు. కాని ఇది చాలా సంకుచితమయిన వ్యక్తిగత ఆలోచన. పార్టీలో విచ్ఛిన్నకర ధోరణులు తల ఎత్తుటకు ఇది దారి తీస్తుంది. ఎర్ర సైన్యంలో "చిన్న గ్రూపు" మనస్తత్వం బలంగానే వుండేది. విమర్శ ద్వారా కొంత అభివృద్ధి వచ్చిన మాట వాస్తవమే. కాని దాని అవశేషాలు ఇంకా వున్నాయి. దానిని పూర్తిగా నిర్మూలించుటకు ఇంకా కృషి చేయవలసి వుంది.

3. గుమస్తా మనస్తతత్వం: కొంత మంది కామ్రేడ్సు, తాము సభ్యులుగా వున్న ఎర్రసైన్యం, కమ్యూనిస్టు పార్టీ, విప్లవ కర్తవ్యాలు

సాధించే సాధనాలని అర్థం చేసుకోరు. తాము కూడా విప్లవాన్ని సాధించే నిర్మాతలమని గుర్తించరు. విప్లవం యెడల తమకు బాధ్యతవుందని గుర్తించకుండా, కేవలం తమ పై ఆఫీసర్లకు మాత్రమే బాధ్యులమని భావించుతు వుంటారు. విప్లవం యెడల ఇలాంటి "గుమస్తా" "స్తబ్ధ" మనస్తత్వం వ్యక్తిగత ఆలోచనా విధానానికి చిహ్నం మాత్రమే. విప్లవం కొరకు ఎలాంటి షరతులు లేకుండా, సంపూర్తిగా పనిచేసే కార్యకర్తలు లేకపోవడానికి ఇదే కారణం. దీనిని నిర్మూలించకుండా, కార్యకర్తల సంఖ్య పెరగదు. తత్ఫలితంగా విప్లవం యొక్క బరువు బాధ్యతలంతా కొద్ది మంది కార్యకర్తల భుజస్కందాలపై మాత్రమే వుంటుంది. ఇది పోరాటానికి చాలా నష్టం.

4. సుఖాన్వేషణ: ఎఱ్ఱ సైన్యంలో సుఖాన్వేషణకు పాటుబడేవారు. తగిన సంఖ్యలో వున్నారు. వ్యక్తితత్వ ఆలోచనకు ఇది చిహ్నం మాత్రమే. తమ యూనిట్ పెద్ద పట్టణాలకు ఎపుడు ప్రయాణం చేస్తుందని ఎదురుచూస్తూంటారు. పని చేయడానికి కాకుండా సౌఖ్యం అనుభవించడానికి, అక్కడకు పోవాలని వాంచిస్తూ వుంటారు. జీవితం కష్టంగా వున్న విముక్తి ప్రాంతంలో పని చేయటం వీరికి గిట్టదు.

5. స్తబ్ధత: తమ కోర్కెలకు వ్యతిరేకంగా ఏదయినా జరిగిందంటే, కొంత మంది కామ్రేడ్స్ వెంటనే పనిలో చురుగ్గా పాల్గొనరు. స్తబ్ధుగా వుంటారు. ప్రధానంగా సరైన రాజకీయ శిక్షణ లేకపోవడమే అందుకు కారణం. కొన్ని సందర్భాలలో పార్టీ నాయకత్వం పని చేస్తున్న తీరు, పని పంపకం తీరు, క్రమశిక్షణను అమలుజరిపే పద్ధతుల వల్ల కూడా ఇది సంభవించుతూ వుంటుంది.

6. సైన్యం విడిచిపోవాలనే కోరిక: ఎఱ్ఱసైన్యం వదిలి, స్థానికంగా పని చేయాలనే వారి సంఖ్య పెరుగుతూ వుంది. వ్యక్తుల బలహీనతవల్లే ఇది రావటం లేదు.

అ) ఎఱ్ఱసైన్యం జీవితంలో కష్టాలు, ఆ) దీర్ఘకాలం పోరాటం తర్వాత అలసట 3) నాయకత్వం పనితీరు, పని పంపక విధానం, క్రమశిక్షణ అమలుజరిపే విధానం, వీటివల్ల కూడా ఈ పరిస్థితి ఏర్పడుతూ వుంది.

వ్యక్తిగత ఆలోచనా విధానాన్ని సిద్ధాంతరీత్యా సరి చేయుటకు రాజకీయ శిక్షణ తీవ్రపరచడమే ప్రధానమైన పద్ధతి. పని తీరు, పని పంపకం, క్రమశిక్షణ అమలుజరిపే తీరును అభివృద్ధి చెయ్యాలి. ఎఱ్ఱసైన్యం యొక్క భౌతిక జీవన పరిస్థితులను అభివృద్ధిపరచడానికీ, తగినంత విశ్రాంతి, అవకాశాలు సృష్టించుకోవాలి. వ్యక్తిగత ఆలోచన యొక్క సాంఘిక పునాది పార్టీలోని పెటీబూర్జువా ధోరణి అన్న విషయాన్ని బోధించాలి.

## దేశదిమ్మరి, తిరుగుబోతు దళాల సిద్ధాంతం

విప్లవ కేంద్రాన్ని నిర్మించుకోకుండా, ఎప్పుడూ ఒక చోట నుండి మరొక చోటికి పరిగెత్తే తిరుగుబోతు దేశ దిమ్మరి దళాల రాజకీయ సిద్ధాంతం మన ఎఱ్ఱ సైన్యంలో తలెత్తింది. ఎఱ్ఱ సైన్యంలో దేశ దిమ్మరి అలవాటుగల వారి సంఖ్య పెద్దగానే వుంది. చైనాలో ఇలాంటి వారు ముఖ్యంగా దక్షిణ చైనాలో ఎక్కువగానే వున్నారు. ఈ సిద్ధాంతం ఈ కింది విధంగా ప్రతిబింబించుతూ వుంటుంది.

1. కొందరు ఒక చోటి నుండి మరొక చోటికి పరిగెత్తే తిరుగుబోతు గెరిల్లా చర్యల ద్వారా మన రాజకీయ పలుకుబడిని విస్తృత పరచుకోవాలని సూచిస్తారు. విప్లవ కేంద్రాన్ని స్థాపించటం, ప్రజా రాజకీయాధికారాన్ని స్థాపించుకోవటం లాంటి కష్టమైన పనులు వీరికి గిట్టవు.

2. ఎఱ్ఱసైన్యాన్ని విస్తృతం చేసుకోవటంలో "మనుష్యులను, గుర్రాలను'' కొనాలనీ, "పారిపోయినవారిని, తిరుగుబాటు దారులను" చేర్చుకోవాలనే పద్ధతిని అనుసరిస్తూ వుంటారు. స్థానిక రెడ్‌గార్డ్సు దళాలను, స్థానిక సైన్యాలను పెంచుకొని, వాటి ద్వారా ఎఱ్ఱ సైన్యాన్ని పెంచుకోవాలనే పంథా వీరికంతగా గిట్టదు.

3. ప్రజలతో కలిసి క్లిష్టమయిన పోరాటాల్లో పాల్గొనటం కొంత మందికి గిట్టదు. పెద్ద పట్టణాలకు వెళ్ళి, తృప్తిగా తిని, తాగాలని కోరుకుంటారు. తిరుగుబోతుదార్ల సిద్ధాంతం తన సక్రమ కర్తవ్య నిర్వహణలో ఎఱ్ఱ సైన్యానికి అడ్డుపడుతూ వుంటుంది. ఎఱ్ఱ సైన్యం యొక్క పార్టీ నిర్మాణంలో ఈ సిద్ధాంతానికి వ్యతిరేకంగా తీవ్రమయిన సిద్ధాంత పోరాటాన్ని జరుపవలసి వుంటుంది. హుయాంగ్-చావ్ లేక లీ చు-యాంగ్ ల నాయకత్వం కింద వుండిన దేశదిమ్మరి తిరుగుబోతుదార్ల పద్ధతులు ఈనాటి పరిస్థితుల కేమాత్రం సరిపడవని స్పష్టంగా గ్రహించాలి.

ఈ తప్పుడు ధోరణిని ఈ కింది పద్ధతుల ద్వారా సరిదిద్దాలి

1. రాజకీయ శిక్షణ తీవ్రపరచాలి. తప్పుడు ఆలోచనలను విమర్శించాలి. ఎపుడూ తిరుగాడుతుండాలనే దేశదిమ్మరి తిరుగుబోతుదార్ల సిద్ధాంతాన్ని నిర్మూలించాలి.

2. నిష్ఫలమైన దేశదిమ్మరి ఆలోచనా విధానాన్ని ప్రతిఘటించడానికి ఎఱ్ఱసైన్యంలోని ప్రాథమిక శాఖల్లోనూ, కొత్తగా చేర్చుకున్న ఖైదీలలోనూ, రాజకీయ శిక్షణ తీవ్రపరచాలి.

3. పోరాటంలో అనుభవం కల్గిన రైతులను, కార్మికులను ఎఱ్ఱ సైన్యం లోనికి చేర్చుకుని ఎఱ్ఱ సైన్యం యొక్క స్వభావాన్ని మార్చాలి.

4. కార్మిక, రైతు, మిలిటెంట్ల నుండి ఎర్రసైన్యం కొత్త యూనిట్లు ఆర్గనైజు చేయాలి.

## దుందుడుకుతత్వం అవశేషాలు

సైన్యంలోని పార్టీ నిర్మాణం దుందుడుకువాదంకు వ్యతిరేకంగా పోరాడింది. కాని ఈ పోరాటం ఇంకా చాలలేదు. తత్ఫలితంగా ఎర్ర సైన్యంలో దీని అవశేషాలు ఇంకా మిగిలి వున్నాయి. ఇది ఈ కింది విధంగా ప్రతిబింబించుతూ వుంది.

1. భౌతిక పరిస్థితులను, మన సొంత నిర్మాణ శక్తిని, శత్రు బలాన్ని దృష్టిలో వుంచుకోకుండా, గుడ్డిగా పోరాటం జరపాలని కోరుట 2. పట్టణాలలో పార్టీ పంథాను సంపూర్తిగా, నిశ్చయాత్మకంగా అమలుజరపక పోవటం 3. మిలిటరీ క్రమశిక్షణను సవ్యంగా ఆచరించకపోవటం, ముఖ్యంగా ఓటమి సంభవించిన సందర్భంలో 4. కొన్ని యూనిట్లు గృహదహన కార్యక్రమంలో పాల్గొనటం 5. ఎర్ర సైన్యం నుండి పారిపోయే వారిని కాల్చి వేసే విధానం, కొరడాలతో కొట్టి శిక్షించే విధానం దుందుడుకువాదం నుండి వచ్చేవే. దుందుడుకువాదానికి సాంఘిక పునాది అలగా శ్రామిక సిద్ధాంతం, పెటీబూర్జువా సిద్ధాంతం యొక్క కలయికయే.

దీనిని ఈ కింది పద్ధతుల ద్వారా తొలగించాలి:

1. దుందుడుకువాదాన్ని సిద్ధాంతం ద్వారా నిర్మూలించాలి.

2. సక్రమ రూల్సు, రెగ్యులేషన్స్ విధానాల ద్వారా దుందుడుకుతత్వ ప్రవర్తనను సరిదిద్దాలి. ★

---

*(...5వ పేజీ తరువాయి)*

ఈ ఆంబుష్‌లో విజయం సాధించాలనే పట్టుదలతో పి.ఎల్.జి.ఎ. యోధులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోలీసులపై విరుచుకపడ్డారు. పి.ఎల్.జి.ఎ. అలలు అలలుగా అలుపెరగక సాగించిన ఈ దాడిలో 62వ బెటాలియన్‌కు చెందిన 83 మంది పోలీసులు చుట్టివేయబడి దాడిలో చిక్కుకున్నారు. ఇందులో 75 మంది పారా మిలిటరీ బలగాలకు చెందిన పోలీసులూ, ఒక ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసు చనిపోయారు. ఆరుగురు గాయపడినారు. వీరికి సపోర్టుగా వచ్చిన మైన్‌ప్రూఫ్ వాహనం తునాతునకలైంది. మూడు గంటలు సాగిన ఈ పోరాటం ఉదయం 5.50 నిమిషాల నుండి 8.50 నిమిషాలకు ముగిసింది. ఈ దాడిలో 79 ఆయుధాలు (ఇన్‌సాస్-42, ఏకే 47-21, ఎల్.ఎం.జి.-6, ఎస్.ఎల్.ఆర్.-7 టుఇంచ్ మోర్టార్-2, స్టెన్ కార్బన్-1) వాకీటాకీ-12, గ్రేనేడ్స్-39, ఏకే మేగజైన్స్-67, ఇన్‌సాస్ మేగజైన్స్-15, ఎస్.ఎల్.ఆర్. మేగజైన్స్-18, ఇతర ఎక్విప్‌మెంట్స్ చాలానే దొరికాయి.

ఈ దాడిలో ఎనిమిది మంది మన ప్రియమైన కామ్రేడ్స్‌ను కోల్పోయాం. కామ్రేడ్స్ రుక్మిణి (పి.పి.సి.సభ్యురాలు), వాగాల్ (పి.పి.సి.), విజ్జాల్ (సెక్షన్ డిప్యూటీ), ఇంగాల్ (సెక్షన్ డిప్యూటీ), పార్టీ సభ్యులు రామాల్, రతన్, రాజు, మంగులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా అత్యంత ధైర్యంతో సాహసోపేతంగా పోరాడి అమరులైనారు. వీరి అమరత్వాన్ని ఘనంగా కీర్తించాలి. వీరి అమరత్వం మరెందరో పి.ఎల్.జి.ఎ. యోధులకు జన్మనివ్వడమే గాక, గొప్ప విజయాలకు స్ఫూర్తినిస్తుంది. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ తరపున కమిటీ ప్రవక్త గుడ్సా ఉసెండి గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా, కేంద్ర కమిటీ నాయకుడు కామ్రేడ్ సుధాకర్ రెడ్డి, సీనియర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ శాఖమూరి అప్పారావుల బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఈ చర్య చేశామని ప్రకటించాడు.

ఈ ఆంబుష్ చివరకు పాలక వర్గాల్లో వైరుధ్యాలను సృష్టించింది. ప్రతిపక్ష పార్టీల్లో మతతత్వ పార్టీ బి.జె.పి., వామపక్షమైన సి.పి.ఎం.ను ఒక్కటి చేసింది. ఇవి చిదంబరం జబ్బచరిచి ధైర్యం చెప్పాయి. పార్లమెంటులో ఈ దాడి హెూరు మార్మోగింది. పందుల దొడ్లో దోపిడి దారులంతా ఒక్కటైనారు. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులను, మావోయిస్టులను, విప్లవకారులను, ప్రజాస్వామికవాదులను, శ్రామిక ప్రజలను ఉత్సాహపరిచింది.

ముక్‌రాం ఆంబుష్‌కు హేట్స్‌అప్! హేట్స్‌అప్!!
గ్రీన్‌హంట్‌కు డౌన్ డౌన్ చెబుదాం!

### పొరపాటు సరిదిద్దమని లేఖ

ప్రియమైన క్రాంతి సంపాదకవర్గానికి రెడ్‌సెల్యూట్స్,

2010 మార్చిలో వచ్చిన క్రాంతిలో అమరవీరుల చరిత్రలలో ఖమ్మంలో అమరుడు కామ్రేడ్ రాంబాబు జీవిత చరిత్ర వచ్చింది. ఈ కామ్రేడ్ ఇంటిపేరు దుర్గి అని రాసాము. మేము రాసిన రిపోర్టులో మా తరపున జరిగిన పొరపాటు. ఇది వాస్తవానికి కామ్రేడ్ రాంబాబు ఇంటి పేరు పొడియం. ఈ అమరవీరుని జీవిత చరిత్ర రిపోర్టులో దుర్గి అని తొలగించి పొడియం రామాల్ అని మార్పు చేయగలరని కోరుతున్నాం.

విప్లవాభివందనాలతో
కార్యదర్శి
ఖమ్మం జిల్లా కమిటీ

# జూలై 27 ఉప ఎన్నికలను బహిష్కరిద్దాం! ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని ఐక్య కార్యాచరణ ద్వారానే ముందుకు తీసుకువెడదాం!!

సి.పి.ఐ. (మావోయిస్టు) 1969 నుండి ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి మద్దతును ఇస్తూ వుంది. 1997 జూన్‌లో 'ప్రత్యేక తెలంగాణా ఉద్యమం-తెలంగాణా అభివృద్ధి' అనే డాక్యుమెంటును విడుదల చేసింది. ఉద్యమంపట్ల వున్న స్పష్టతతో రాష్ట్రంలో కాంగ్రెస్, టి.డి.పి. ప్రభుత్వాల దమనకాండను ఎదుర్కొంటూ ఉద్యమాన్ని నిలబెట్టింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలపై ప్రజలను సమీకరించి అనేక పోరాటాలు చేపట్టింది.

తెలంగాణలో విప్లవోద్యమం బలహీనపడినప్పటికీ ప్రజా సంఘాలు, సంస్థలు, వ్యక్తులను కలుపుకుని విశాల ఐక్య కార్యాచరణకు పూనుకున్నది. 'ఉద్యమం ద్వారానే తెలంగాణ సాధించగలం' అనే నినాదాన్ని ముందుకు తీసుకువెళ్లింది. 2008 సెప్టెంబర్‌లో "ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమ నిర్మాణం-మన కార్యక్రమం" అనే ఒక సర్క్యులర్ ద్వారా అవగాహనను అన్ని శ్రేణులకు అందించింది. తెలంగాణా ప్రజల మనోభావాలనూ, వారి ఆకాంక్షలను పాలకవర్గాలు ఎలా కాలరాచివేస్తున్నాయో ఎప్పటికప్పుడు బహిర్గతపరుస్తూ పోరాట మార్గాన్ని పదునెక్కించింది. దశాబ్దాల ఉద్యమ చరిత్రలో పార్టీ చేపట్టిన రాజీలేని పోరాట వైఖరి ప్రజల్లో దృఢమైన విశ్వాసాన్ని కలిగించింది. ఆ రాజకీయ విధానాలు, పోరాట రూపాలు సరైనవేనని ప్రజలు గుర్తిస్తున్నారు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బూర్జువా అవకాశవాద రాజకీయ పార్టీల చేతుల నుండి మారాలి. ఈ ఉద్యమాన్ని బలమైన కేంద్రీకృత కార్మికవర్గ నాయకత్వం కింద నడపాలి. పార్టీ ఎన్నో ఒడిదుడుకుల మధ్యనే పని చేస్తూ, దోపిడీ పాలకవర్గాల కుట్రలను, అవకాశవాద రాజకీయాలను బహిర్గతపరచి తెలంగాణాలోని నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యాన్ని పెంచింది. ముఖ్యంగా విద్యార్థి, యువజన, మేధావి వర్గాలతో పాటు వివిధ సెక్షన్ల పీడిత ప్రజల్ని విడిపోకుండా సంఘటితంగా నిలబెట్టడానికి, సమైక్యంగా పోరాడడానికి సిద్ధపరిచింది. ఇటువంటి క్లిష్టమైన సందర్భాల్లో, అననుకూల సమయాల్లో ప్రజల్లో విశ్వాసాన్నీ కల్పించి, పోరాటాన్ని అంటిపెట్టుకుని ఉండే తత్వాన్ని పెంచడం ఒక విజయంగానే అర్థం చేసుకోవాలి. మరింత దృఢంగా ముందుకు సాగాలి.

2009 నవంబర్ నుండి ప్రత్యేక తెలంగాణా ఉద్యమం వేగాన్ని అందుకుంది. ఈ ఐక్య ప్రజాందోళన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కుదిపి వేసింది. ముఖ్యంగా ఆంధ్ర, రాయలసీమలకు చెందిన భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారులను ఆందోళనకు గురి చేసింది. ఇది దేశవ్యాపితంగా ప్రభావాన్ని వేసి ఇతర రాష్ట్రాల్లో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలకు ఊపునిచ్చింది.

పార్లమెంటరీ రాజకీయ పార్టీల కతీతంగా ప్రాంతాలవారీ సమీకరణలు, రాజీనామాలు నడవడంతో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం తీవ్ర స్థాయికి చేరి ప్రభుత్వం స్థంభించింది. కనీసం ఇరు పక్షాల్లో ఏ ఒక్క పక్షానికి చెందిన ఎం.ఎల్.ఎ.ల రాజీనామాలను ఆమోదించినా ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఎం.పి.లు కూడా రాజీనామాలకు సిద్ధపడడంతో ఇది కేంద్ర ప్రభుత్వపు (యు.పి.ఎ. ప్రభత్వం) ఉనికికి కూడా ప్రమాదాన్ని తెచ్చింది. బూర్జువా పార్టీల మధ్య వైరుధ్యాలు రోజు రోజుకు పెరిగి హైకమాండ్ మాట కూడా చెల్లని పరిస్థితి వచ్చింది. మధ్యలో కె.సి.ఆర్. ఆమరణ నిరాహారదీక్ష, ఉస్మానియా విద్యార్థుల చురుకైన పాత్ర, జనవరి 3న విద్యార్థి ఘర్జన ఇలా ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయి. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి కుక్కచావు చచ్చినాక జరిగిన పరిణామాలు, అధికార కుమ్ములాటలు తెలంగాణా ఉద్యమానికి ఎంతో తోడ్పడ్డాయి. (మధ్యలో వై.ఎస్. చావుకు రిలయన్స్ అధిపతులు కారణం అని వచ్చిన పచ్చినిజం వార్త సృష్టించిన బీభత్సాన్ని హైడ్రామాతో కేంద్రం కంట్రోల్ చేసిన వైనం అందరికీ తెలిసినదే). ముఖ్యమంత్రి పదవిపై ఆశ చావని వై.ఎస్.జగన్ వరంగల్ జిల్లాలో చేసిన పర్యటనను మే నెలలో తెలంగాణ పోరాటకారులు ముఖ్యంగా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న స్థానిక మిలిటెంట్ పోరాటకారులు అడ్డుకోవడంతో పోలీసులు కాల్పులు జరిపారు. దీనికి నిరసనగా తెలంగాణాలో బంద్ సంపూర్ణంగా జరిగింది. మొత్తం ఉద్యమంలో ఈతరహా నిరసనలు, ఆందోళనలు స్థానిక స్థాయిలో వందలు, వేలు జరుగుతున్నాయి. బూర్జువా రాజకీయ పార్టీలు ఈ శక్తిని సంఘటితం చేసి నడపడానికి భయపడుతున్నాయి. వ్యతిరేకిస్తూ తమ స్వార్థ రాజకీయాలతో వ్యవహరిస్తున్నారు. 2009 నవంబర్ నుండి 2010 మే వరకు జరిగిన పరిణామాలను పరిశీలిస్తే కొన్ని విషయాలు

స్పష్టమవుతున్నాయి. వాటిని ఒక్కొక్కటి పరిశీలిద్దాం.

ప్రత్యేక తెలంగాణా సమస్య ఒక ప్రాంతీయ సమస్య. పార్లమెంటరీ చట్ట పరిధిలో రాజ్యాంగానికి లోబడి పరిష్కరించే సమస్యగానే ఉద్యమం కొనసాగడంతో పార్లమెంటరీ రాజకీయ పార్టీలు ప్రస్తుతం ఉద్యమాన్ని తమ ఆధిపత్య రాజకీయాకనుగుణంగా మలుచుకుంటూ తమ స్వార్ధ రాజకీయ ప్రయోజనాలకు బలి చేస్తున్నాయి. తెలంగాణ ఉద్యమ చరిత్రలోనే ఇటువంటి చేదు నిజాన్ని 1969లో కూడా అనుభవించాం.

నేటి తెలంగాణా ఉద్యమం ప్రధానంగా పార్లమెంటరీ పార్టీల/పాలకవర్గ ముఠాల/స్వార్థపర శక్తుల కబంధ హస్తాల్లో చిక్కుకుని వారి కనుసన్నలలో నడుస్తున్నది. అన్ని దశల్లో వారి మధ్యనున్న వైరుధ్యాల తీవ్రతను బట్టి ఉద్యమం ఒడిదుడుకులకు గురవుతున్నది. వీరిలో ఏ ఒక్కరికి చిత్తశుద్ధి, నిజాయితీలేదు. అధికార కుమ్ములాటల్లో భాగంగా ఓట్ల బ్యాంకు రాజకీయాలు నడిపిస్తున్నారు. ఇప్పటికే వారి నిజాయితీలేని తనంతో ప్రజల్లో బహిర్గతమయ్యారు. పార్లమెంటు, అసెంబ్లీలుగాని, అందులో భాగంగా జరిగే లాబీయింగ్ పద్ధతులు గాని తెలంగాణాకు న్యాయం చేయవని స్పష్టమయింది. బూర్జువా పార్టీలతో విసిగిపోయిన ప్రజలు ముఖ్యంగా విద్యార్థి, యువజన, మేధావి వర్గాలు పెద్ద ఎత్తున నవంబర్ 2009 నాటికే కదిలి వుద్యమానికి వేడినీ, వేగాన్నిచ్చారు. ఈ కదలిక ప్రజా ప్రభంజనం సృష్టించడంతో రాజకీయ పార్టీలు (టి.ఆర్.ఎస్.తో సహా) ఒంటరై పోతామనే భయంతో ఉద్యమంలో తమ పాత్రనూ, ప్రజల్లో తమ స్థానాన్ని నిలబెట్టుకోవాలనుకున్నారు. అందులో భాగంగానే కె.సి.ఆర్. ఆమరణ నిరాహారదీక్షను, ఊగిసలాటను, ఉస్మానియా విద్యార్థులు చేపట్టిన కె.సి.ఆర్. శవయాత్రను, ఇంకా తర్వాతి పరిణామాలను చూడాల్సి వుంటుంది. నవంబర్ 30న కె.సి.ఆర్. నిరాహారదీక్ష విరమణ ప్రకటనకు, ఉద్యమ ద్రోహానికి నిరసనగా ఉస్మానియా విద్యార్థులు ప్రతి స్పందించిన తీరు గొప్పది. అది ఉద్యమాన్ని తిరిగి నిలబెట్టింది. కె.సి.ఆర్.లాంటి నాయకుల్ని హెచ్చరించి, నిలబెట్టింది కూడా. కె.సి.ఆర్. కేంద్రంతో ఏ ఒప్పందం చేసుకున్నాడో తెలీదుగాని చిదంబరం మాత్రం 'కె.సి.ఆర్. ప్రాణాన్ని రక్షించడానికే డిసెంబర్ 9న ఆ ప్రకటన చేసా'నన్నాడు. అదే చిదంబరం పరిస్థితి సద్దుమణిగిన తర్వాత డిసెంబర్ 23న మరో ప్రకటన చేసి తమ నిజ స్వరూపాన్ని బయటపెట్టుకున్నాడు.

డిసెంబర్ 9న కేంద్ర హెూంమంత్రి చిదంబరం చేసిన ప్రకటన నుండి శ్రీకృష్ణ కమిటీ రంగం మీదికి వచ్చిన రోజు వరకు జరిగిన పరిణామాలను లోతుగా పరిశీలిస్తే దోపిడీ పాలకవర్గాల నాటకీయత, మోసకారితనం స్పష్టమవుతాయి. రాజకీయ పార్టీల జెండాలన్నీ ఒకే తానులో గుడ్డలు. వారందరి ప్రయోజనాలు ఒక్కటే. అధికార కుమ్ములాటల్ని తాత్కాలికంగా పక్కనబెట్టి ప్రజల్ని ముఖ్యంగా తెలంగాణా ప్రజల పోరాటాల్ని దెబ్బతీయడానికి కాంగ్రెస్, టి.డి.పి., ప్రజారాజ్యం పార్టీలు ఐక్యమయిపోయి కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజల్లో భయాలు, సందేహాలు రేకెత్తించారు. నిరాధారమైన ఆరోపణలతో ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి పోటీగా ఒక కృత్రిమ ఉద్యమాన్ని సృష్టించారు. కోస్తాంధ్ర, రాయలసీమలలో పోటీ ఉద్యమాన్ని చేపట్టింది వారే. దానిని సాకుగా చూపి ఒక సంక్లిష్టతను సృష్టించి "విస్తృత సంప్రదింపులు" చేసి డిసెంబర్ 23న మరో ప్రకటన చేసారు. తెలంగాణా ప్రజల ఆకాంక్షలపై నీరుజల్లడమే కాకుండా చివరికి శ్రీకృష్ణ కమిటీని నియమించి దీర్ఘకాల కాలయాపనకు సాధికారతను కల్పించారు. డిసెంబర్ 2010 వరకు సమయాన్ని తీసుకుని అప్పటికీ చల్లారకపోతే అణచివేత విధానాలను అనుసరించాలని పథక రచన చేసారు. డిసెంబర్ 9 నాడు అర్ధరాత్రి చిదంబరం విద్యార్థులపై కేసులు ఉపసంహరిస్తామని చెప్పాడు. ఇప్పటికీ అలా జరగలేదు. అలా జరగదు కూడా. తెలంగాణా సమస్యను రాజకీయ సమస్యగా కాకుండా శాంతి భద్రతల సమస్యగా చూడడమే వారికి కావలసినది. జనవరి 5న ఢిల్లీకి వెళ్లిన టి.ఆర్.ఎస్.తో కలిపి ఎనిమిది రాజకీయ పార్టీలు రాష్ట్రంలో చేసిన ఉమ్మడి నిర్ణయానికి భిన్నంగా 'శాంతి నెలకొనడం ముఖ్యం' అనే పేరుతో నిస్సిగ్గుగా సంతకాలు పెట్టారు. చర్చల ఎజెండా, చర్చల సారాంశం ఏమిటనేది ఇంతవరకు ప్రజలకు చెప్పలేదు. హింస చేసేవాళ్లే శాంతి పాటించాలంటున్నారు. తమ చేతుల నుండి చేజారిన ఉద్యమాన్ని ప్రజల నుండి తిరిగి చేజిక్కించుకోవడానికే ఈ నాటకం ఆడారు. తెలంగాణా ఉద్యమానికి విద్రోహం చేసారు. విద్రోహ చరిత్ర మరోసారి పునరావృతం అయింది.

ఒకవేళ ఆంధ్ర, రాయలసీమ పాలకవర్గాల నుండి వ్యతిరేకత రాకపోతే ఆ ప్రకటన (డిసెంబర్ 9) అమలయ్యేదా? కె.సి.ఆర్. ముఖ్యమంత్రిగా నూతన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడేదా? కె.సి.ఆర్. కాంగ్రెస్‌లో చేరిపోయే వాడా? ఇవన్నీ 90 శాతం ప్రజలకు కలిగిన సందేహాలు, ఉద్యమం మిలిటెంట్‌గా ముందుకు వెళ్లకూడదు. తమ చేతుల నుండి పక్కకు పోకూడదు. అసలు సమస్య పరిష్కారం కాకూడదు. ఇదీ బూర్జువా పార్టీల వైఖరి. ఒకవేళ ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఇస్తే కూడా తమ దోపిడీకి అనుగుణంగా పకడ్బందీగా ఆంక్షలు, అవరోధాలు కల్పిస్తూ తమవాళ్ల చేతుల్లోనే పెడతారు తప్ప పీడిత ప్రజలకు ఆ ఫలాలను అందనివ్వరు. ఇది వారి నైజం. ఈ సందర్భంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసిన నిర్బంధాన్ని, భవిష్యత్‌లో వారి విధానాలను అర్థం చేసుకోవాలి.

1969లో ఉద్యమాన్ని అణచివేయడానికి నెలల తరబడి 144వ సెక్షన్ అమలు చేయడంతోపాటు అనేకసార్లు కర్ఫ్యూ ప్రకటించారు,

అనేక కారణాలు చూపి ఎన్నోచోట్ల నిషేదాజ్ఞలు విధించడంతో పాటు లాఠీఛార్జీ, అరెస్టులు జరిపి వేలాది మందిని గాయపరిచి, తప్పుడు కేసుల్లో జైళ్లలో పెట్టారు. 370 మంది యువకుల్ని తుపాకులతో కాల్చి హత్య గావించి ఉద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచెత్తారు. నేడు కూడా ఇదే విధానం అనుసరించి ఉద్యమాన్ని అణచడానికి ప్రయత్నం చేస్తున్నారు. వాక్‌సభా స్వతంత్రాన్ని లేకుండా నిషేధాజ్ఞలు విధిస్తున్నారు. కర్ఫ్యూ ప్రకటిస్తున్నారు. టియర్‌గ్యాస్, వాటర్ క్యాన్‌లు వుపయోగించడం, విద్యార్థినులను కూడా మినహాయించకుండా లాఠీఛార్జీ చేయడం, వేలాది మందిపై పదుల సంఖ్యలో కేసులు పెట్టి నెలల తరబడి జైళ్లల్లో బంధించడం, కాల్పులు జరపడం అన్నీ అదే విధంగా కొనసాగుతున్నాయి. స్కూళ్లు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలు మూసివేయడం, పోలీసు క్యాంపులు పెట్టడం, తనిఖీలు చేయడం, మావోయిస్టు ముద్ర వేసి వేధించడం, భయపెట్టడం, దుష్ప్రచారం చేయడం చేస్తున్నారు. గవర్నర్ నరసింహన్‌ను (ఐ.పి.ఎస్.) నియమించడాన్ని, యూనివర్సిటీ క్యాంపస్‌లలో గ్రేహౌండ్స్‌తో సహా అనేక రకాల ప్రత్యేక బలగాలను మొహరించడాన్ని, హైకోర్టు ఉత్తర్వులను కూడా లెక్క చేయకపోవడాన్ని లోతుగా పరిశీలిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి పథకంతో ఉద్యమ అణచివేతకు అనుసరిస్తున్న విధానాలు స్పష్టంగా అర్థమవుతాయి.

ఇక శ్రీకృష్ణ కమీషన్ నియామకం, డిసెంబర్ 2010 వరకు సమయం తీసుకోవడం కూడా దీర్ఘకాల వ్యూహంలో భాగంగానే అర్థం చేసుకోవాలి. సమస్యను సుదీర్ఘంగా సాగదీయడం, కమిటీలు, కమీషన్‌ల పేరుతో కాలయాపన చేయడం, ఘర్షణలను రెచ్చగొట్టి పెంచడం, రాజకీయంగా లబ్ది పొందడం, సమస్యను మాత్రం కోల్డ్ స్టోరేజ్‌కు నెట్టడం ఇవన్నీ కాంగ్రెస్ తరహా ఎత్తుగడలే. ఈ విషయాలు అనుభవపూర్వకంగా అర్థం చేసుకుని మరింత జాగరూకత ప్రదర్శించాల్సి వుంది.

ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో విద్యార్థుల పాత్ర గణనీయమైనది. అది యావత్తు తెలంగాణా ప్రజల్ని ఐక్యపరచడంతో విస్తృత మద్దతు లభించింది. పార్టీలకతీతంగా బూర్జువా పార్టీలు కూడా తమ వైఖరిని ప్రకటించాల్సి వచ్చింది. నూతన నాయకత్వం ముందుకు వచ్చింది. ఉద్యోగులు, లాయర్లు, రచయితలు, కళాకారులు, యువకులు, మహిళలు, రైతాంగంతో పాటు దళిత, ఆదివాసీ, మైనారిటీ సెక్షన్లు, కుల వృత్తులవారు ప్రతిఒక్కరు ముందుకు రావడం మంచి పరిణామం. నవంబర్ 28 ర్యాలీ, తర్వాత కె.సి.ఆర్. అరెస్టుకు నిరసనగా నాలుగు వేల మందితో ర్యాలీ, డిసెంబర్ 10న ఛలో అసెంబ్లీ పిలుపు... ఈ అన్నింటినీ విద్యార్థులు రక్తం చిందిస్తూనే విజయవంతం చేశారు. అన్ని యూనివర్సిటీలకు, జిల్లా సెంటర్లకు ఉద్యమం విస్తరించింది. ఎక్కడికక్కడ జె.ఎ.సి.లు ఏర్పడ్డాయి.

డిసెంబర్ 23న సమైక్యాంధ్ర ఉద్యమాన్ని సాకుగా చూపి కేంద్రం "ఇప్పుడే తెలంగాణా ప్రక్రియ సాధ్యంకాదని, ఏకాభిప్రాయం కావాలని" ప్రకటన చేసింది. వెంటనే అర్ధరాత్రి పూట ఉస్మానియా విద్యార్థులు నిరసన ర్యాలీ చేసి రోడ్లపై బైటాయించారు. 24 నుండి దీక్షలు కూడా ప్రారంభించారు. 28 రాత్రి పోలీసులు ఆర్ట్స్ కాలేజీ దగ్గర టెంటులు పీకి వేస్తే విద్యార్థినులు అడ్డుకొని నిరసన తెలిపారు. మెస్ మూసివేసినా దీక్షలు కొనసాగాయి. విద్యార్థులంతా నూతన సంవత్సర వేడుకల్ని బహిష్కరించి రాత్రంతా తెలంగాణా ఆట పాటలతో ధూంధాం ఆడడం చేస్తే, విద్యార్థినులు తెలంగాణా పండుగలు బోనాలు, బతుకమ్మ ప్రదర్శించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జనవరి 3న జరిగిన లక్షలాది విద్యార్థుల ఘర్జనతో ఉద్యమం మరింత సంఘటితపడి తెలంగాణా ప్రజల్లో ఒక విశ్వాసాన్ని నింపింది. జనవరి 18 నుండి 20 రోజులపాటు 12 యూనివర్సిటీల విద్యార్థులు ఉత్తర, దక్షిణ తెలంగాణాల్లో చేసిన 600 కి.మీ. పాదయాత్ర ప్రజల్లో చైతన్యాన్ని కల్పించింది. మేధావి వర్గంలో మంచి ప్రతిస్పందనను తెచ్చింది. అనేక ప్రాంతాల నుండి విస్తృతమయిన సంఘీభావం సమకూరింది. తర్వాత ఏప్రిల్ నెలలో వారం రోజులపాటు ఏడు విద్యార్థి బృందాలు చేసిన పాదయాత్రలు విజయవంతమయ్యాయి. ప్రజలు విద్యార్థుల కృషినీ, వారు ఇస్తున్న ఉద్యమ స్ఫూర్తిని హృదయపూర్వకంగా స్వీకరించి ఆదరించారు.

కేంద్రం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా 215 మంది తెలంగాణా ఉత్తమ పుత్రులు ప్రాణత్యాగం చేశారు. వారి ఆకాంక్ష గొప్పది. ఆత్మహత్యలు సమస్యను తాత్కాలికంగా వేడిక్కిస్తాయి తప్ప పరిష్కారమార్గం కాదు. పోరాడడం ద్వారానే తెలంగాణ సాధించగలమన్న దృఢ విశ్వాసాన్ని పెంపొందించాలి. పట్టుదలతో కూడిన కృషి అవసరం. తాత్కాలిక ఉద్రేకాలకు లోనుకాకూడదు. 215 మంది అమరులయిన ప్రతీ సందర్భంలోనూ "ఉద్యమకారులు పోరుపథాన ముందు నిలిచి సారధ్యం అందిస్తే ఉద్యమానికి ప్రయోజనం చేకూరుతుంద"ని ప్రజలు మాట్లాడారు. శ్రీకాంత్‌చారి, వేణుగోపాల్ సిరిపురం యాదయ్య తదితరుల అంకిత భావంతో కూడిన నిస్వార్థ త్యాగాన్ని ఎత్తిపట్టి జోహార్లు చెప్పారు.

శ్రీకృష్ణ కమిటీని వ్యతిరేకించడంలో ఒక స్పష్టమైన విధానాన్ని అనుసరించలేకపోవడంతో "తిరస్కరించడం"గా చెబుతూ అదే కమిటీకి పత్రాలు సమర్పించారు. బూర్జువా రాజకీయ పార్టీలు కమిటీ ఏర్పాటును సమర్ధిస్తూనే ప్రత్యేక తెలంగాణా విషయంలో భిన్నాభిప్రాయాలు (ఒకే పార్టీలో రెండు, మూడు రకాలుగా) చెప్పారు.

కొద్దిమంది తిరస్కరిస్తున్నాం అని చెపుతూనే తెలంగాణాపై మాట్లాడడం, పత్రాలు ఇవ్వడం చేసారు. సి.పి.ఐ.(మావోయిస్టు) స్పష్టంగా బహిష్కరించాలని పిలుపునిచ్చింది. మిగిలిన పార్టీలు, సంస్థలు, వ్యక్తులు ఈ విషయంలో అస్పష్టత, గందరగోళం కలిగి వుండడంతో శ్రీకృష్ణ కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించడంలో ఉన్న కుట్ర నెరవేరింది. దానికి సాధికారత వచ్చేసింది. అది దాని ప్రయోజనాన్ని పొందింది కూడా. ఈ విషయంలో ఉద్యమ నాయకత్వం దీర్ఘకాల దృష్టిని కోల్పోయినట్లయింది. నిజానికి ప్రజల్లో ప్రత్యేక తెలంగాణాను సాధించాలనే విషయంలో స్పష్టత ఉండడంతో ఎక్కడికక్కడ స్థానిక స్థాయిలో ఉద్యమిస్తూనే వున్నారు. స్థానికంగా మిలిటెంట్ నాయకత్వాన్ని కూడా అభివృద్ధి చేసుకుంటున్నారు. శ్రీకృష్ణ కమిటీని కూడా వ్యతిరేకిస్తూ ఊరేగింపులు తీసారు. ప్రజల నుండి శ్రీకృష్ణ కమిటీ దగ్గరకుపోయి పిటీషన్లు ఇచ్చినది చాలా స్వల్పం. తెలంగాణా ప్రజలు శ్రీకృష్ణ కమిటీకి పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారు. శ్రీకృష్ణ కమిటీని బహిష్కరిస్తూ బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించగలిగితే ఉద్యమానికున్న మిలిటెన్సీ కంటిన్యూ అయి వుండేది. పాలకవర్గాల కుట్రల ఫలితంగా ఉద్యమంలో చీలికలు రావడంతో ఆ రకమైన మిలిటెంట్ ఉద్యమం రాకుండానే చేజారిపోయింది. ఆ కుట్రల్లో భాగంగానే నేటికీ చీలికలూ, అపోహలు కొనసాగుతున్నాయి. టి.ఆర్.ఎస్. అధినేత స్వయంగా ఉద్యమ చీలికకు ప్రయత్నిస్తున్నాడు. జూలై 27న ఉపఎన్నికల్లో విద్యార్థి ఉద్యమ స్ఫూర్తిని వినియోగించుకునేందుకు విద్యార్థుల్లోనే చీలికలు తెస్తున్నాడు. మరల మరల ఎన్నికల్లోకి దిగి, ఎన్నికల భ్రమలను, పార్లమెంటరీ పరిష్కారాలను ప్రధాన రాజకీయంగా మార్చి వేస్తున్నాడు. తెలంగాణా సమస్య పరిష్కారానికి ఈ ఉప ఎన్నికల్లో టి.ఆర్.ఎస్. గెలుపుకు ఏమీ సంబంధమే లేదని చెప్పాలి. ఎన్నికలను పూర్తిగా బహిష్కరించడం ద్వారా ప్రత్యేక తెలంగాణా నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలి. రాజకీయ నాయకుల చట్రం నుండి బయటపడిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉప ఎన్నికల కోసం మళ్లీ అదే చట్రంలో ఇరుక్కొనే ప్రమాదం వుంది. ముఖ్యంగా తెలంగాణా రాష్ట్ర లక్ష్య సాధనలో సాహసోపేతంగా పోరాడి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన విద్యార్థులు మరింత జాగరూకతతో వుండాలి. తెలంగాణా సాధించే వరకు ఎన్నికలు జరగకుండా నిలువరించగల సత్తా తెలంగాణా ప్రజలకు వుంది. అటువైపు ఉద్యమ నాయకత్వం నడిపితే ఈ ఉద్యమానికి మిలిటెన్సీ వస్తుంది. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు సంబంధించిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని బలంగా మిలిటెంట్ ఉద్యమాన్ని నిర్మిద్దాం. దానికి అసెంబ్లీకో, పార్లమెంటుకో ఎన్నిక కానక్కరలేదు.

ఆంధ్ర, రాయలసీమ ప్రజల్లోని భయాలు పోగొట్టాలి. వారి అపోహలను పోగొట్టాలి. హైదరాబాద్ సమస్య, జల వివాదాల సమస్య పరిష్కారం కానివి కాదు. వాటిని విశాల దృక్పథంతో పరిష్కరించుకోవచ్చు. హైదరాబాద్ తెలంగాణాలో అంతర్భాగమని అందరికీ తెలుసు. జీవించడానికి వచ్చిన ఏ ప్రాంత ప్రజలనూ హైదరాబాద్ నుండి పంపవలసిన అవసరం లేదు. వారి రక్షణ బాధ్యతను కూడా తెలంగాణా ఉద్యమం ఒక కర్తవ్యంగా తీసుకుంటుంది. అణగారిన అన్ని సెక్షన్ల ప్రజలకు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంలో అనేక సమస్యలు పరిష్కారం అవుతాయి. మెరుగైన అవకాశాలు వస్తాయి. స్వేచ్ఛ, స్వతంత్రాలు లభిస్తాయి. జల వివాదాలను ఒక క్రమంలో కేంద్ర జల సంఘం ద్వారా పరిష్కరించుకోవచ్చు. అన్ని సమస్యలకు పరిష్కార మార్గాలున్నాయి. ప్రత్యేక తెలంగాణా పరిష్కారానికున్న అడ్డంకులను మిలిటెంట్ ఉద్యమం ద్వారానే పరిష్కరించుకోవాలని చరిత్ర చెబుతుంది. అందుకు విశాల ప్రజల మద్దతు, ఐక్య కార్యాచరణ విధానం ఎంతో అవసరం. పునాది వర్గాల నుండి నాయకత్వం అభివృద్ధి కావాలి. ఉద్యమానికి సారధ్యం వహించి దాని విజయానికి పట్టుదలతో కృషి చేయాల్సి వుంది.

ఉద్యమాన్ని పాలకవర్గ పార్టీలు/ముఠాలు హైజాక్ చేయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విశాల ప్రజారాశుల ఉమ్మడి నాయకత్వాన్ని ఏర్పరచి కొనసాగించాలి. ప్రజల, క్రియాశీల శక్తుల సమిష్టి భాగస్వామ్యం పెరగాలి. ఇది విశాలమైన, ప్రాంతీయ స్వభావంగల ఉద్యమం. అన్ని రకాల తేడాలనూ, విభేదాలను పక్కనబెట్టి ప్రజాస్వామికంగా ఐక్యమవుతూ గొప్ప శక్తియుక్తులతో ఉద్యమాన్ని నడపాలి. పాలకవర్గాలు ఈ ఉద్యమం లోపల చేరి చీలికలు తేవడానికి చేసే కుట్రలను, తీవ్ర ప్రతిబంధకాలను ఓడించాలి. ఈ ఉద్యమంలో అనేకానేక శక్తులు, భిన్న భిన్న కారణాలతో కలవడం జరుగుతుంది. అందులో బలం వుంది. అలాగే బలహీనతా వుంది. కాబట్టి నాయకత్వం, ప్రజలు నిత్యం జాగరూకతను ప్రదర్శించాలి. ఉద్యమాన్ని కాపాడుకోవాలి. మీడియా పాత్రనూ, దాని పక్షపాత వైఖరిని దృష్టిలో వుంచుకుని ప్రత్యామ్నాయ ప్రచార, ఆందోళనా పద్ధతులను చేపట్టాలి. ప్రత్యేక తెలంగాణా ఉద్యమం సంఘటిత శక్తిగా, బలమైన ఉద్యమంగా వ్యక్తమయిన సందర్భాల్లో ఉద్యమ ప్రవాహ వేగమే అన్ని కుట్రలనూ, దుష్ప్రచారాలను ఓడించగలదు. తాత్కాలిక ఒడిదుడుకులు, స్థబ్దత ఉద్యమంలో నెలకొన్నప్పుడు దాడి తీవ్రత, చీలికలు, దుష్ప్రచారం, ప్రలోభాలు పెరిగి ఉద్యమాన్ని మరింతగా బలహీనపరుస్తాయి. ఈ విషయాల్లో దూరదృష్టి, నిశిత పరిశీలన, విశాల దృక్పథం, సమర్ధతలతో కూడిన సమన్వయం అవసరం.

ఈ ఉప ఎన్నికలను బహిష్కరించడం, ఉద్యమాన్ని సంఘటితంగా మిలిటెంట్‌గా ముందుకు తీసుకెళ్లడం ప్రజలందరి బాధ్యత. ★

# క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం అధ్యక్షురాలు, పార్టీ మహిళా సబ్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ నర్మదతో ఇంటర్వ్యూ

**క్రాంతి:** కె.ఎ.ఎం.ఎస్. ఏర్పాటు చేయాలనే ఆలోచన ఎప్పటిది? ఎప్పటి నుండి అమల్లోకి వచ్చింది?

**నర్మద:** ఎనభై దశకం విప్లవ పార్టీ నాయకత్వంలో ఆదివాసీ ప్రజలు ప్రపంచాన్ని అర్థం చేసుకుని పోరాడాలనే ఆలోచనకు వచ్చిన కాలం. తునికాకు పోరాటం 1981లో ప్రారంభమయింది. తునికాకు కూలీరేట్లు పెంపుదల కోసం అహిరి-సిరొంచ ఏరియాలలో పెద్ద ఎత్తున పోరాట కమిటీల నిర్మాణం జరిగింది. ఇది విప్లవ ప్రజా సంఘాల నిర్మాణానికి ప్రారంభ రూపం. ఈ పోరాట కమిటీల నిర్మాణం కోసం ఊళ్ళల్లో నిర్వహించే గ్రామ సభలకు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చేవారు. మహిళల కదలికను చూశాక స్త్రీ-పురుషులను కలిపి పోరాట కమిటీల నిర్మాణం జరిగింది. రైతుకూలీ సంఘాలలో మహిళల భాగస్వామ్యం, వారి క్రియాశీలతను చూసి 'మహిళలకు' ప్రత్యేక సంఘం పెట్టాలనే ఆలోచన రూపం తీసుకుంది.



రైతుకూలీ సంఘాలలో చురుకుగా కదులుతున్న మహిళలు గడ్చిరోలి జిల్లాలోని రసపెల్లి గ్రామంలో తెగ పెద్దల ఆగ్రహాన్ని చవిచూశారు. పాటల సరదాకు మీటింగ్‌లకు వెళ్తున్నారనుకున్న మహిళలు విప్లవ రాజకీయాలలో చురుగ్గా కదలడం గ్రామ పెద్దలకు మింగుడు పడలేదు, వాళ్ళను నియంత్రించని పక్షంలో పరిస్థితి చేయి దాటి పోతుందని అనుకున్నారు. మహిళలపై అదుపు మొదలయింది. కాని చైతన్యమవుతున్న మహిళలు దానిని ఎదిరించారు. ప్రజాపంచాయితి నిర్వహించి, విప్లవకారుల సమక్షంలో వారు పెద్దలతో తప్పు ఒప్పించారు. తొలిసారి ఇలా ముందుకొచ్చిన చురుకైన యువతులతో రసపెల్లిలో మొట్ట మొదటి మహిళా సంఘం 1986వ సంవత్సరంలో ఏర్పడింది. ఆ సంఘం నిర్మాణంలో ముఖ్యపాత్ర వహించిన బయ్యా వేలాది వృత్తి విప్లవకారిణిగా మారి, 1995 బాలాఘాట్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరురాలయింది. మరో కామ్రేడ్ రామక్క (శారద) ఇప్పటికీ ప్రజాసేవలో నిమగ్నమై పార్టీలో నిబద్ధతతో కొనసాగుతున్నది. (ఇది ప్రచురిస్తున్న సమయానికి కామ్రేడ్ రామక్క మనకు లేదు. ఆమె 2010, జూన్ 29న అనారోగ్యంతో అమరురాలైంది. తరువాతి సంచికలో ఆమె జీవిత చరిత్రను ప్రచురిస్తాం. -సం.)

**క్రాంతి:** ఎటువంటి సామాజిక నేపథ్యం కె.ఎ.ఎం.ఎస్. ఏర్పాటుకు దారి తీసింది?

**నర్మద:** ఆదివాసీ మహిళ లైంగిక అణిచివేతనూ, దోపిడిని ఎదుర్కొనేది. తెగ సాంప్రదాయాలతో, రీతి రివాజులు పేర జరిగే పితృస్వామిక అణిచివేత ఒకటి అయితే, రెండవది ప్రభుత్వ యంత్రాంగం, వ్యాపారులు, పేపరు మిల్లు ఉద్యోగస్తులు మహిళలను వేధించడం, మోసపుచ్చటం జరిగేది.

బస్తర్‌లో అటవీశాఖలో కూలి పనుల కోసం వచ్చిన వారిలో యువతులు, వివాహిత మహిళలు కూడా ఉండేవారు. వీరు అడవిలో గుడిసెలు వేసుకుని వుండేవారు. అక్కడ పనిచేయించే ఫారెస్టు గార్డులు రాత్రిపూట లైటు వేసుకుంటూ కూలీల గుడిసెల్లోకి వచ్చి తమకు నచ్చిన మహిళపై అత్యాచారం చేసి వెళ్ళిపోయేవారు. ఫారెస్టు ఉద్యోగులదంతా ఇదే తంతు వుండేది. "తోడేళ్ళ గుంపు ఈ రాత్రి ఎవరిమీద పడుతుందో! ఇవాళ ఎవరి వంతు వస్తుందో! ఈ రాత్రి ఏం కాకుండా గడిచిపోవాలి" అనుకుంటూ మహిళలు భయం భయంగా కలతనిద్ర పోయేవారు. ఈ లైంగిక పీడనను మహిళలు వ్యతిరేకించారు. పురుషులు కూడా వ్యతిరేకించారు. ఇలా వ్యతిరేకించిన పురుషులను గార్డులంతా కలిసికట్టుగా చంపేసిన ఘటనలు ఉన్నాయి. ఈ లైంగిక అణిచివేతకు వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజలలో ముఖ్యంగా మహిళల్లో కోపం, ద్వేషం నిండి వున్నాయి. ప్రతిఘటన నిప్పురాజుకుని తమ ఒంటిమీద చేయి వేసిన వారిని తిరగబడి కొట్టారు. లైంగిక దోపిడికి కారణాలను విశ్లేషించి ఎదిరించాలని చెప్పే ఒక రాజకీయ గురువుగా పార్టీ మహిళల హృదయాలను గెల్చుకుంది. దండకారణ్యంలో మహిళాసంఘాల

నిర్మాణానికి ఈ లైంగిక పీడనను వ్యతిరేకించటం ఒక ప్రేరక అంశంగా మహిళల్లో పని చేసింది.

బస్తర్‌లోని కుంట, భైరంగఢ్, గంగలూర్ ప్రాంతాల్లో జయపాల్ ఠాకూర్, కల్మదేవాల్, కోయ కోసాల్, కన్న వడ్డే – వీరంతా భూస్వాములు. వీరి లైంగిక పీడన మితిమీరి పోయింది. జయపాల్ ఠాకూర్ గురించి చెప్పాలంటే వీనికి 15 మంది ఉంపుడుకత్తెలు. ఇతడి కన్ను పడిన మహిళ లొంగకపోయినా, ఎదిరించినా ట్రాక్టర్లతో తొక్కించి చంపించేవాడు. ఎదురుపడిన మహిళలను తెచ్చి తన గఢీలలో వారాల తరబడి బంధించి వారిపై అత్యాచారాలు చేసేవాడు. వీడి అమానుష పీడనను అనుభవించిన మహిళలు భూ–ఆక్రమణ పోరాటాలలో పెద్ద ఎత్తున సంఘటితపడి అతని భూములనూ, ఆస్తులను జప్తు చేసుకున్నారు.

ఆదివాసీ మహిళ ఇతర సామాజిక పీడనలతో పాటు తెగ పితృస్వామ్యపు దాష్టీకాన్ని అనుభవించింది. ఆరుగాలం కష్టంచేసి ఇంటికి వచ్చి గాదెలో నిండిన ధాన్యాన్ని ముట్టుకోకూడదు. ఇష్టంలేని మనువుకు మనస్సు చంపుకుని తలవంచింది. మనువాడిన మగనితో మనసు పొసగక మనసైనవాడి కోసం అన్వేషణలో 'తిరుగుబోతు' (కెర్ది)గా ముద్ర వేయించుకుని అవమానాలకూ, అత్యాచారాలకు గురయింది. కనిపెంచిన పిల్లలమీద హక్కును కోల్పోయి మమతను చంపుకోలేక తల్లడిల్లింది. పెళ్ళికాగానే అత్తగారింట రవికను తీసేసి అర్ధనగ్నం చేస్తే అవమానాన్ని దిగమింగలేని మహిళల మనస్సుల్లో ఆక్రోశం లావాలా పొంగింది. మనసు లేని మనువు వద్దనీ, బలవంతంగా కట్టబెట్టిన బంధాన్ని తెంచుకుందామనీ, తెగబడిన కాళ్ళను తెగ పితృస్వామ్యం బేడీలతో బంధించి (తాళ్ళతో కాళ్ళు చేతులు కట్టేసి) గొడ్డులా ఈడ్చుకెళ్ళింది. ఇష్టంలేని కాపురం వద్దని పారిపోయిన మహిళపై అత్యాచారం చేసే తెగ అధికారం ఆ వంశపు పురుషులకు ఇచ్చింది. ఈ పితృస్వామిక పీడన కూడా మహిళా సంఘాల నిర్మాణానికి ప్రేరక అంశంగా పని చేసింది.

**క్రాంతి:** కె.ఎ.ఎం.ఎస్. ఏర్పడే నాటికి ఇక్కడి విప్లవోద్యమంలో మహిళల పాత్ర ఎలా ఉండింది.?

**నర్మద:** 80లో దండకారణ్యంలోని గడ్‌చిరోలికి ప్రవేశించిన దళాలతో వచ్చిన మొదటి ఆదివాసేతర మహిళా కామ్రేడ్ మట్టా రత్తక్క (నిర్మలక్క). చంటిపాపను వదలి అడవి ఉద్యమానికి అంకితమైంది. తన 20 ఏళ్ళ విప్లవ జీవితంలో విప్లవానికి ఎనలేని సేవల్ని చేసి అనన్యమైన ఆదర్శాన్ని నెలకొల్పుతూ 1998 ఆగస్టులో అడవితల్లి ఒడిలో ఒరిగిపోయింది. ప్రారంభంలో సుశీల, పద్మ లాంటి వాళ్లు ఉత్సాహంతో వచ్చినా నిలదొక్కుకోలేక వెనక్కి వెళ్ళిపోయారు. మడావి బాయిగా టిప్రాగఢ్ ప్రజల హృదయాలను గెలుచుకున్న శాంతక్క, 1986లో దండక వనంలోకి దళ సభ్యురాలుగా చేరి కె.ఎ.ఎం.ఎస్. జోనల్ కమిటీ నాయకురాలిగా ఎదిగింది. అదే కాలంలో అడవిలోకి అడుగుపెట్టి ఉద్యమంలో కొనసాగుతున్న కామ్రేడ్ మైనా... ఇలా వేళ్ళ మీద లెక్కించగల మహిళలు, 1983 మధ్యలోనే దళంలోకి భర్తీ అయిన ఆదివాసీ మహిళ కామ్రేడ్ రాధక్క.. కాటెంగబాయిగా ప్రజల హృదయాలను గెలుచుకున్న ఎల్లంకి అరుణ... వీరంతా దండకారణ్యంలో విప్లవ మహిళా ఉద్యమానికి పునాదిరాళ్ళు.

**క్రాంతి:** ప్రత్యేకమహిళా సంఘాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనకు ఆనాడు పార్టీ, క్యాడర్ ఎలా స్పందించింది? అవసరం లేదనే చర్చ ఏమన్నా ఉండిందా?

**నర్మద:** రైతుకూలీ సంఘాలలో మహిళల భాగస్వామ్యం, వారి క్రియాశీలతను చూసి, 'మహిళలకు ప్రత్యేక సంఘం' పెట్టాలనే ఆలోచన రూపం తీసుకుంది. ప్రత్యేక మహిళా సంఘాల నిర్మాణం గురించి ప్రస్తావన ముందుకురాగా, 'మహిళలకు ఉన్నది అదే భూమి సమస్య, అదే కూలి సమస్య అందుకని ప్రత్యేక సంఘం అవసరం లేదు' అనే వాదన దండకారణ్యంలో మాత్రం ఎదురుకాలేదు. 1986లో దండకారణ్యంలో ప్రత్యేక మహిళా సంఘాల నిర్మాణం చేయాలని పార్టీ తీర్మానించింది. ఇలా అప్పటి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు)(పీపుల్స్‌వార్) చరిత్రలో మొట్ట మొదటిసారి మహిళా సంఘాల నిర్మాణం గురించి చర్చించి, ఆచరణ రూపం ఇచ్చిన ఘనత దండకారణ్య విప్లవోద్యమానికి దక్కుతుంది.

**క్రాంతి:** సంఘాన్ని మహిళల్లోకి తీసుకుపోవడంలో ఆనాడు ఎదుర్కొన్న సమస్యలనూ, పొందిన అనుభవాలను చెపుతారా?

**నర్మద:** ఆదివాసీ సమాజంలో మహిళలు గడపదాటకూడదనే నిషేధం లేదు. మహిళా సంఘాల నిర్మాణం ప్రారంభం అయిన తర్వాత మహిళల్లో కదలిక పెద్దఎత్తున వచ్చింది. ఇక్కడి మహిళా సంఘాల నిర్మాణంతో రైతుకూలీ సంఘం సహకారం, మద్దతు విశేషంగా ఉన్నాయి. 1986లో రసపెల్లి తదితర గ్రామాలలో మొదలయిన సంఘం 1991 నాటికి ఒక జిల్లా వ్యాప్త సంఘంగా అభివృద్ధి చెందటం చూస్తే సమాజం మహిళా సంఘాలను ఎలా ఆదరించి వుంటుందనేది మనం అంచనా వేసుకోవచ్చు. అయితే సంఘాన్ని మహిళల్లోకి తీసుకుపోవటంలో ఆనాడు ప్రధానంగా ఎదుర్కొన్న సమస్య 'రాజ్యం'. మహిళల్లో పెరుగుతున్న పోరాట చైతన్యాన్ని సహించలేని రాజ్యం వారిపై హింసను ప్రయోగించింది. అరెస్టులు, జైళ్ళు, మాయం చేయటాలు, అత్యాచారాలు, బూటకపు ఎదురుకాల్పులు, టాడా లాంటి నల్ల చట్టాలను ప్రయోగించి క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘంను దెబ్బతీసే ప్రయత్నం చేసింది.

**క్రాంతి:** ప్రారంభంలో ఎటువంటి సమస్యల మీద పోరాడారు?

ఆ పోరాటానికి సమాజం ఎలా స్పందించింది?

**నర్మద:** మహిళలు దండకారణ్యంలో ముఖ్యంగా రెండు రంగాలలో పోరాడుతున్నారు. ఒకటి సామాజిక దోపిడీకి వ్యతిరేకంగా; రెండవది ప్రభుత్వ ప్రయివేటు యాజమాన్యాలతో వివిధ సమస్యలపై పోరాడారు. మహిళలపై అమలవుతున్న సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా పితృస్వామ్యంపై పోరాడుతున్నారు. న్యాయమైన కూలీ రేట్ల కోసం, కరువు నివారణ ఏర్పాట్ల కోసం, గ్రామాలలో మౌలిక అవసరాలను తీర్చడం కోసం, అటవీ ఉత్పత్తులకు న్యాయమైన ధరల కోసం, పోలీసుల దమనకాండకు వ్యతిరేకంగానే కాకుండా దేశ దేశాలలో జరుగుతున్న ప్రజా పోరాటాలకు సంఘీభావం ప్రకటించడానికి కూడా పోరాటాలు కె.ఎ.ఎం.ఎస్. తీసుకున్నది.

మొదటి తరహా పోరాటాలలో భాగంగా సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టింది. పచ్చబొట్లు వేయించటం, ఇష్టంలేని బలవంతపు పెళ్ళిళ్ళు, పెళ్ళి అయిన మహిళలు రవికెలు వేసుకోకూడదనటం, ఆదివాసీ సాంప్రదాయ వేటలో పాలుపంచుకునే మహిళను, నాగలిపట్టి దుక్కులు దున్నే మహిళను, ఉత్పత్తి కార్యకలాపాల్లో పురుషులతో పాటు శ్రమించే మహిళను వివక్షతో చూడటం మొదలైన వాటికి వ్యతిరేకంగా కె.ఎ.ఎం.ఎస్. పోరాటం చేసింది. మహిళలకు ఆస్తిలో హక్కులేకుండా, పిల్లల్ని కనటం తప్ప వేరే బాధ్యత ఏమీ లేదని చెప్పే పితృస్వామ్య సమాజం మహిళలను అణగదొక్కడానికి అమలు చేస్తున్న విధానాలన్నింటికీ వ్యతిరేకంగా కె.ఎ.ఎం.ఎస్. పోరాటాలు చేపట్టింది.

రెండవ తరహా పోరాటాలకు పురుషులు సానుకూలంగానే స్పందించారు. ఆ పోరాటాల సందర్భంగా అరుదుగానైనా మహిళల నాయకత్వ పాత్రను ఆమోదించారు. బస్తర్ జిల్లా కిష్టారం ఏరియాలోని గ్రామాలను తగులబెట్టటానికి అటవీ శాఖ అధికారులు వచ్చినప్పుడు గ్రామాల మహిళలు వారిని ఎదిరించారు. అడవి నరికి భూములు సాగుచేసుకున్నారు. డీకే వ్యాప్తంగా ఈ భూములకు పట్టాలకోసం వందల సంఖ్యలో మహిళలు కదిలారు. డీకే వ్యాప్తంగా అటవీ పోరాటంలో పూసుబాక గ్రామానికి చెందిన 15 మంది మహిళలు జైలుకు కూడా వెళ్లారు. గడ్చిరోలి జిల్లాలో ఫారెస్టు అధికారులు పంట భూముల్లోని పంటను నాశనం చేయడానికి ఏనుగులను తెచ్చి దానిని తొక్కించేవారు. చలవాడలో తొర్రెం బుచ్చక్క, రడంపల్లి ఆత్రంబాయి, మరిపల్లి రత్నక్క, బంగారంపేట రాజక్క ఇలా ఒక్కొక్క ఊల్లో ఒక్కొక్క మహిళ ముందునిలిచి భూమికోసం పోరు నడిపి నూతన చరిత్రను సృష్టించారు. ఈ పోరాటాలకు ఇక్కడి ఆదివాసీ సమాజం సానుకూలంగా ప్రతిస్పందించింది.

**క్రాంతి:** కె.ఎ.ఎం.ఎస్. ఇక్కడి సమాజంలో మహిళల పాత్రలో ఎటువంటి మార్పులను తీసుకువచ్చింది?

**నర్మద:** "ప్రతి వంటకత్తె ఒక రాజకీయ వేత్త కావాలి" అనే లెనిన్ మహోపాధ్యాయుని బోధనను కె.ఎ.ఎం.ఎస్. అక్షరాలా నిజం చేస్తోంది. నాగలి పట్టి పొలందున్నే ఆదివాసీ మహిళ చేతులకు పిడికిలి బిగించి నినదించటం నేర్పింది. తమపై మోపిన అభియోగాలపై నేర విచారణ కోసం గోటుల్ పంచన బిక్కు బిక్కుమంటూ ఒదిగి కూర్చున్న మహిళలు తలలు పైకెత్తి గోటుళ్ళలో ప్రజా పంచాయతీలు నిర్వహిస్తున్నారు. తెగ అధికారం గీచిన 'లక్ష్మణ రేఖల్ని' తుడిపేసి పురుషులతో భుజం భుజం కలిపి ఊరేగింపులలో పాల్గొంటున్నారు. వేదికలెక్కి ఉపన్యాసాలిస్తున్నారు.

గ్రామ పార్టీ కమిటీల నుండి మొదలుకుని ప్రజా మిలీషియా, జనతన సర్కార్లలో రక్షణశాఖ బాధ్యురాళ్ళుగా, మిలీషియా కమాండర్లుగా, వ్యవసాయాభివృద్ధి, న్యాయశాఖ బాధ్యురాళ్ళుగా బాధ్యతలు చేపడుతున్నారు. జనతన సర్కార్లలో ఉంటూ భూమి లేని, పేద రైతులకు భూస్వాముల భూముల పంపకాలు చేస్తున్నారు. స్త్రీ–పురుషులిద్దరి పేరుమీద పట్టాలు పంపిణీ చేస్తున్నారు. ఇవాళ సమాజం మహిళల నాయకత్వ పాత్రను ఆమోదిస్తున్నదంటే, దానికి పార్టీ ప్రధాన కారణం అయినప్పటికీ కె.ఎ.ఎం.ఎస్. పాత్ర కూడా గణనీయంగానే ఉన్నది.

ఇంటి చాకిరీ, పిల్లల పెంపకం, అటవీ ఉత్పత్తుల సేకరణ, పొలం పనులతో తలమునకలయ్యే ఆదివాసీ మహిళ నేడు ఎజెండాలు రాసి సమావేశాలు నిర్వహిస్తున్నది, తప్పులను విమర్శ–స్వయం విమర్శల ద్వారా సరిదిద్దుకుంటూ కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని అమలు చేసుకుంటున్నది. మొత్తం ఈ ప్రక్రియలో కె.ఎ.ఎం.ఎస్. తనను తాను, ఆదివాసీ మహిళలను పురుషులతో పాటు ఉద్యమానికి నాయకత్వం పాత్రను పోషించేలా మలచుకుంటున్నది.

**క్రాంతి:** మహిళల సామాజిక పాత్రను కుదింపజేస్తున్న అంశాల్లో ఇంటిపని ముఖ్యమైనది. దాన్ని ఇక్కడి మహిళా ఉద్యమం ఎంతవరకు పరిష్కరించింది?

**నర్మద:** ఇంటిపని సామాజికీకరణ గురించి కదా మీరు అడుగుతున్నది. కె.ఎ.ఎం.ఎస్. ఒక తీర్మానంగానో, ఒక క్యాంపెయిన్‌లాగానో కార్యక్రమం తీసుకుంటే పరిష్కారం అయ్యే సమస్యకాదు. విప్లవోద్యమ ఆచరణ, పురోగతితో ముడిపడిన సమస్యగా దీన్ని చూడాలని నాకనిపిస్తున్నది. మహిళా సంఘం కొన్ని సందర్భాలలో మహిళలకు ఇంటిపని నుండి ఒక రోజు సెలవు ఇవ్వాలనీ, పురుషులు కూడా వడ్లు దంచాలని తీర్మానాలు చేసింది. అవి ఏవీ సీరియస్‌గా అమలు కాలేదు. వడ్లు దంచటం

అనేది స్త్రీలు చేసినా, పురుషులు చేసినా అది ఈ రోజుల్లో పొద్దస్తమానం శ్రమనూ, కాలాన్ని హరించివేసే ప్రక్రియ. ఇక్కడ రూపొందుతున్న రాజ్యాధికార సంస్థలైన జనతన సర్కార్లు ఈ శ్రమను తేలిక చేయటంలో భాగంగా చిన్న చిన్న హాలర్లు (వడ్ల గిర్నీలు) నడుపుతున్నాయి. ఇవి రాశిలో తక్కువే వున్నాయి.

జనతన సర్కార్లు బలపడే క్రమంలో వీటిని విస్తృతం చేయటం ద్వారా ఆదివాసీ మహిళల శ్రమ భారం తగ్గించగలం. విప్లవ పార్టీ దైనందిన కార్యకలాపాలలో స్త్రీలు–పురుషులు వంతులవారీగా వంట డ్యూటిలలో పాల్గొంటారు. ఈ ఆచరణలో భాగమైన ప్రజాసంఘాల మహాసభలు, రాజకీయ శిక్షణా తరగతుల సందర్భంగా స్త్రీలు–పురుషులు కలిసి వంట చేయటం, కొన్ని సందర్భాలలో మొత్తం పురుషులే వంట చేయటం కనిపిస్తుంది. ప్రారంభ కాలంలో పురుషులకు వంట డ్యూటి చేస్తున్నప్పుడు 'మేం ఇంటి దగ్గర ఎన్నడూ వంట చేయలేదు, అంట్లు తోమలేదు, కూరగాయలు కొయ్యలేదు అనే మాటలు అరుదుగానైనా వినిపిస్తుండేవి. కాలక్రమంలో ఇలాంటి కామెంట్లు తగ్గిపోయాయి. భూంకాల్ స్కూళ్ళలో కూడా ఆడపనులు, మగపనులు అని కాకుండా అందరూ అన్ని పనులు చేయటం అలవాటు చేస్తున్నారు. స్త్రీలు శ్రమను అధికంగా వెచ్చించే మరొక పని దొప్పలు విస్తళ్ళు కుట్టటం. అడవికి పోయి ఆకులను సేకరించుకు రావటం, ఈనెలు తీయటం, దొప్పలు కుట్టటం కోసం స్త్రీలు చాలా శ్రమను వెచ్చించేవారు. అయితే స్టీలు కంచాలు, కూర గిన్నెలు, గ్లాసుల వాడకం పెరిగేకొద్దీ ఈ శ్రమలో కొంత వెసులుబాటు కలిగింది. ఇది వాళ్ల జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పుల ద్వారానే సాధ్యమైంది.

ఆదిమ సమాజం నుండీ పాతుకుపోయిన 'ఇంటిపని స్త్రీలది బయటి పని పురుషులది' అనే సామాజిక శ్రమవిభజనను మార్చడం దీర్ఘకాల ప్రక్రియ కదా. ఈ ప్రక్రియ ఈ రోజు విప్లవ ప్రజాసంఘాలు, జనతన సర్కార్లు, మిలీషియా, భూంకాల్ స్కూళ్ళ వరకు విస్తరించి ఆచరణలో విస్తృతిని పెంచుకున్నది. వీటన్నింటితోపాటు పార్టీ చేపడుతున్న పితృస్వామ్య వ్యతిరేక దిద్దుబాటు ఉద్యమాలు ప్రజల్లో చైతన్యం ఎక్కువ పెంచడానికి తోడ్పడుతున్నాయి.

**క్రాంతి:** నూతన ఆర్థిక విధానాల ప్రభావం దండకారణ్య మహిళలపై ఎలా వుంది?

**నర్మద:** బ్రిటీష్ వారి కాలం నుండి దండకారణ్యంలోని అటవీ సంపదలపై సామ్రాజ్యవాదుల డేగ కన్ను పడింది. 1825 నుండి 1964 వరకు జరిగిన అదివాసీ తిరుగుబాట్ల చరిత్రను తిరగవేస్తే ఈ విషయం మనకు అర్థం అవుతుంది. వీరబాబురావు, గుండాదూర్, గేందసింగ్‌లతో పాటు పరాల్‌కోట జమీందారు బిడ్డ రమోతిన్ తన తోటి మహిళలతో కలిసి బ్రిటీష్ వాళ్లను పారదోలడానికి గెరిల్లా యుద్ధం చేసింది. ఆదివాసుల అడవుల నుంచి అత్యంత విలువైన ప్రకృతి సంపదను దోపిడి దొంగలు కొల్లగొట్టుకు పోవటానికి దళారీ పాలక వర్గాలు చేపట్టిన రోడ్ల నిర్మాణాలన్నింటిలో మహిళలు తమ శ్రమ శక్తిని వెచ్చించని రోడ్డే లేదు. బస్తర్‌లోని బైలడిల్లాలో ముడి ఇనుప ఖనిజ తవ్వకాలు ప్రారంభమయిన తర్వాత ఇక్కడి ఆదివాసీ మహిళలను కూడా తమ వ్యాపారానికి సరుకులుగా మార్చేశారు. బైలాడిల్లా గనులలో దగాపడిన చెల్లెళ్ళు ఎందరో! 1991 నుండి మొదలైన నూతన ఆర్థిక విధానాలు అమలులో ముందుకొచ్చిన ఇపిజడ్‌లు, 2005 నుండి జోరుగా ముందుకు వస్తున్న ప్రత్యేక ఆర్థిక మండలాలు (ఎస్.ఇ.జడ్) సామ్రాజ్యవాద దోపిడి ప్రక్రియను వేగవంతం చేశాయి. లక్షల కోట్ల రూపాయల ఎంఒయులపై ప్రభుత్వాలు సంతకాలు చేసుకుంటున్నాయి. వారి ఏజెంట్లయిన స్థానిక ప్రభుత్వాలు 'ఈ అడవి మాదే', 'ఈ అడవిలోని సంపదలు మావే' అంటూ నినదిస్తున్న ఆదివాసుల గొంతులను నిర్దాక్షిణ్యంగా నులిమి వేస్తున్నాయి. రాజ్యం సల్వాజుడుం పేరుతో ఫాసిస్టు నిర్బంధాన్ని తెచ్చి ఆదివాసీ మహిళల జీవితాలనూ, శరీరాలను ఛిద్రం చేసింది. నూతన ఆర్థిక విధానాల వల్ల లోహండిగూడ నుండి బుద్వారీమాడ్, కువ్వెమారి, పల్లామాడ్‌ల మీదుగా సూర్జాగఢ్ వరకూ సంస్కృతి పరాయికరించబడి ఆదివాసీ మహిళలు సహజత్వాన్ని కోల్పోయి వారి మనుగడకే ప్రమాదం ఏర్పడింది.

**క్రాంతి:** సామ్రాజ్యవాద సంస్కృతి ప్రభావం దండకారణ్య మహిళలపై ఎలా వుంది?

**నర్మద:** టి.వి.లు తెచ్చే సినిమా సంస్కృతి, వస్తు వినిమయ సంస్కృతి. అర్థశాస్త్ర పరిభాషలో ప్రదర్శన ప్రభావం పెరిగింది. వారం వారం జరిగే సంతలకు రకరకాల సౌందర్య సాధనాలు, అలంకరణ వస్తువులను తెచ్చి వాటిని అలవాటు చేస్తున్నారు. కియోకార్పిన్ లాంటి తలనూనెలు, ఫెయిర్ అండ్ లవ్‌లీ, లిప్‌స్టిక్, గోళ్ళ రంగు, నైటీల లాంటి వస్తువులను విరివిగా అమ్ముతున్నారు. మెడలో ప్రియంగా ధరించే పూసలు కూడా ప్లాస్టిక్‌వి వచ్చి చేరాయి. మార్కెట్ ద్వారా సామ్రాజ్యవాద వస్తు వినిమయ సంస్కృతిని చొప్పించే ప్రయత్నాలు ముమ్మరంగానే సాగుతున్నాయి. వీటిని అరికట్టడానికి కె.ఎ.ఎం.ఎస్ కార్యక్రమం తీసుకోవాల్సి వున్నది.

అవిభాజిత బస్తర్‌లో అభివృద్ధి పేరుతో టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నారు. చిత్రకూట్ జలపాతం, కాంగేర్ ఘాటీ, నేషనల్ పార్క్, బార్సూర్, తీరథగఢ్, కొటంసర్‌లను ప్రత్యేక టూరిస్టు కేంద్రాలుగా మారుస్తున్నారు. 'బస్తర్ లోకోత్సవ్' రాజ్యోత్సవ్‌ల ద్వారా విదేశీయులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. సామ్రాజ్యవాద అనుకూల పారిశ్రామికీకరణతో పాటు ప్రవేశించే సరుకు సంస్కృతి, హీన భావజాలం, ఎయిడ్స్ లాంటి భయంకర రోగాలు

దండకారణ్యంలోని ఆదివాసులకు వ్యాపింప చేస్తున్నారు. బైలదిల్లా గనుల్లో దగాపడిన చెల్లెళ్లు వీటికి సజీవ సాక్ష్యాలు.

**క్రాంతి:** 'పోరుమహిళ' పత్రిక ఎటువంటి పాత్రను పోషిస్తోంది? నడపడంలో ఎదుర్కొంటున్న సాధకబాధకాలేంటి?

**నర్మద:** 1996లో ప్రారంభమయింది. అర్ధవార్షిక పత్రికగా హిందీ, తెలుగు భాషలలో వెలువరించాలనేది దీని లక్ష్యం. ఇది కె.ఎ.ఎం.ఎస్. అధికార పత్రిక. దండకారణ్య మహిళా సబ్‌కమిటీ దీన్ని నిర్వహిస్తుంది. ఇద్దరు ఇ.బి.సభ్యులతో ఏర్పడింది. పత్రిక సంపాదకవర్గ సభ్యురాలిగా వున్న కామ్రేడ్ నిర్మల కె.ఎ.ఎం.ఎస్. జోన్ కార్యవర్గంలో సెక్రటరీగా ఉంటూ 2007 జూన్‌లో అరెస్టయిన తర్వాత ఒక్కరి మీదనే బాధ్యత పడింది. అయితే కొంతమంది కంట్రిబ్యూటర్స్ పత్రికను వెలువరించడానికి తమ సహాయ, సహకారాలు అందిస్తున్నారు. కె.ఎ.ఎం.ఎస్. కార్యకర్తలు, కార్యవర్గాల సభ్యురాళ్లు ఎంతో పట్టుదలతో కష్టపడుతున్నారు. దాని పునాదులను పటిష్టం చేయటం కోసం రాత్రింబవళ్ళు ఆరాటపడుతున్నారు. తమ కృషినంతటినీ అక్షరాలలో పేర్చి పత్రికకు అందించడంలో సమస్య ఉన్నది. ఏదైన పత్రిక తనకంటూ కనీస సిబ్బంది లేకుండా రెగ్యులర్‌గా తీసుకురావటంలో సమస్య ఉన్నది. పత్రిక తన పాఠకుల వరకు చేరి తన గళాన్ని వినిపించటానికి, రెగ్యులర్‌గా వెలువరించాలని నిర్ణయించుకున్నాం.

**క్రాంతి:** కె.ఎ.ఎం.ఎస్. మహాసభ సందర్భంగా నిర్ణయించుకున్న తక్షణ కర్తవ్యాల డైరెక్షన్ ఏమిటి?

**నర్మద:** కె.ఎ.ఎం.ఎస్. నిర్మాణం 1986లో ప్రారంభం అయిందని ముందే చెప్పాను. 1991లో మొదటి జిల్లా మహాసభ జరిగింది. 1992లో నిర్బంధం విరుచుకు పడిన తర్వాత ఆ నిర్మాణాలు ధ్వంసమైపోయి 2000 వరకూ గడ్చిరోలిలో పునరుద్ధరించలేక పోయినాం. ఇటు బస్తర్‌లో 90ల నుండి మహిళా సంఘాల నిర్మాణం ప్రారంభం అయి క్రమంగా ఊపందుకుంది. అయినా 2005 వరకు జిల్లా కమిటీల నిర్మాణం చేయలేకపోయాం. విప్లవ ప్రజాసంఘాల ఉన్నత స్థాయి కార్యవర్గాలను నడిపించడంపై ఉన్న అనవగాహన మూలంగా ఉన్నత స్థాయి నిర్మాణాన్ని చేపట్టలేక పోయినాం. దండకారణ్య ఉద్యమంతో పాటు ఎదుగుతున్న విప్లవ మహిళా సంఘం ఆ ఉద్యమం తీసుకున్న విముక్తి ప్రాంత లక్ష్యానికి అనుగుణంగా తన ప్రణాళికలో మార్పులు చేసుకున్నది. రాజ్యాధికార స్థాపన లక్ష్యానికి అనుగుణంగా తన ప్రణాళికలో తక్షణ కర్తవ్యాలను రూపొందించుకున్నది. ఆ కర్తవ్యాల వెలుగులో మహిళా విముక్తి లక్ష్యంగా మహిళల భాగస్వామ్యాన్ని పెంచి, ప్రజాయుద్ధంలో శత్రు దాడిని ఓడిస్తూ, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడుతుంది, విశాల ప్రజా ఉద్యమాలతో, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలతో మమేకం అవుతుంది.

**క్రాంతి:** కె.ఎ.ఎం.ఎస్. మొదటి నుండి ఎటువంటి ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటోంది?

**నర్మద:** కె.ఎ.ఎం.ఎస్. పై నిర్బంధం మహారాష్ట్ర, పాత వుమ్మడి మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు ఒకే సమయంలో అంటే 1990ల నాటికి నిర్బంధాన్ని ప్రయోగించటం మొదలయింది. మహారాష్ట్ర ప్రభుత్వం 1991 నుండి 1995 వరకు టాడాను ప్రయోగిస్తూ దాని కార్యకలాపాలను అడ్డుకునే ప్రయత్నం చేసింది. రాజీవ్‌గాంధీ హతుడైన 1991 మే 21ని టెర్రరిస్టు వ్యతిరేక దినంగా పాటిస్తూ అప్పటి నుండే అన్ని విప్లవ ప్రజా సంఘాల మీద అప్రకటిత నిషేధం అమలు చేస్తున్నారు. టాడా స్థానంలో 2001లో పోటా పేరుతో మరింత ఫాసిస్టు చట్టాన్ని తీసుకొచ్చారు. మహారాష్ట్ర ప్రభుత్వం 2002 తర్వాతి నుండి సంఘటిత నేరాల నిరోధక చట్టం (మకోకా) పేరుతో అప్రకటిత నిషేధాన్ని అమలు జరుపుతూ వస్తోంది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 2006, ఏప్రిల్ 19న చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంలోని అధికరణ ప్రకారం కేంద్ర ప్రభుత్వం విప్లవ ప్రజా సంఘాలైన డి.ఎ.కె.ఎం.ఎస్., కె.ఎ.ఎం.ఎస్., సి.ఎన్.ఎం., ఆదివాసీ బాలల సంఘాలనూ నిషేధించింది. ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటికీ ప్రభుత్వం ఏడాదికొకసారి తన నిషేధపు వుత్తర్వులను కొత్తగా విడుదల చేస్తూనే ఉంది. కేంద్ర ప్రభుత్వం 2009, జూన్ 21న మరోసారి చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టాన్ని (యుఎపిఎ) ముందుకు తెచ్చి కె.ఎ.ఎం.ఎస్.తో సహా అన్ని ప్రజాసంఘాలపై నిషేధం ప్రకటించింది. చట్టాలతో నిషేధం ఇలా వుంటే వీటి ఆచరణ రూపం అతి పాశవికంగా ఆదివాసీ మహిళలను పీడించుకు తింటున్నది. 1991–95 కాలంలో వందల మంది కె.ఎ.ఎం.ఎస్. కార్యకర్తలపై టాడా చట్టం ప్రయోగించి జగ్దల్‌పూర్, అమరావతి, చంద్రాపూర్, రాయపూర్ జైళ్ళల్లో బంధించారు. చైతి పల్లో అనే ఒక మహిళ యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నది. గడ్‌చిరోలి, బండారా జిల్లాల్లో 100 మందికి పైగా మహిళల్ని జైళ్లలో పెట్టారు. బస్తర్ నుండి 40 మంది మహిళలను నిర్బంధించి దంతెవాడ, సుక్‌మా సబ్ జైళ్ళలో పెట్టారు. 2005 నుండి 2009 వరకు వందల కొద్ది మహిళలు జైలు నిర్బంధాన్ని అనుభవించారు. వారిలో 80 మంది మహిళలు దంతెవాడ, జగ్దల్‌పూర్, రాయపూర్ జైళ్ళలో ఇంకా మగ్గుతున్నారు.

కె.ఎ.ఎం.ఎస్. జోన్ కార్యదర్శి కామ్రేడ్ నిర్మలను రాయపూర్‌లో అరెస్టు చేసి ఆమెపై వందకు పైగా తప్పుడు కేసులు పెట్టారు. తీవ్రమైన ఆస్తమాతో బాధపడుతున్న నిర్మలను కస్టడీలో ఎన్నో చిత్రహింసలు పెట్టారు. జైలులో కూడా ఆమెను నరకయాతనలు పెడుతున్నారు. జైళ్ళలో పీడిత మహిళల పక్షాన నిలబడి వారి

హక్కుల కోసం మాట్లాడుతున్నందుకు ఆమెను నానా రకాలుగా హింసిస్తున్నారు. కాళ్ళు, చేతులు తాళ్ళతో కట్టేసి పొద్దంతా ఎర్రటి ఎండలో పడేస్తున్నారు. సరైన ఆహారం, వైద్య సౌకర్యాలు లేక ఆరోగ్యం రోజు రోజుకూ క్షీణిస్తున్నది. ప్రజాస్వామికులైన న్యాయవాదులు, ముఖ్యంగా మహిళా న్యాయవాదులు ఆమె విడుదల కోసం సహకరించాలని  కె.ఎ.ఎం.ఎస్. తరపున విజ్ఞప్తి చేస్తున్నాను.

1991 నుండి  కె.ఎ.ఎం.ఎస్.పై ప్రభుత్వం నిర్బంధ కోరలు చాచింది.  కె.ఎ.ఎం.ఎస్. కార్యకర్తలు సుకుడి, సుకాయ్‌లపై పోలీసులు అత్యాచారం చేసి చంపారు. హంతక పోలీసులు సడ్మెన్ సీతక్క అనారోగ్యంతో హాస్పటలుకు పోగా వైద్యం అందకుండా చేసి ఆమెను చంపారు. బేవర్‌టోలకు (భండారా జిల్లా) చెందిన నలుగురు కార్యకర్తలను మాయం చేశారు. ఇప్పటికీ వారి జాడ కోసం తమ బంధువులు పరితపిస్తున్నారు. గోందియా జిల్లా మసేలి గ్రామస్థురాలు పావురిబాయి జైలులో నరకయాతనలు అనుభవించిన ఫలితంగా విడుదల అయిన నెల రోజులకే కన్నుమూసింది. ఈ ముప్ఫై ఏళ్ళ ఉద్యమ చరిత్రలో పోలీస్ ముష్కరుల లైంగిక అత్యాచారానికి గురయి మానసిక గాయాలతో కుమిలి పోతున్న మహిళలు వందల సంఖ్యలో ఉన్నారు. 1991-92 నిర్బంధ కాలంలో పోలీసుల అత్యాచారానికి గురైన ఒక మహిళ గురించి ఈ మధ్యనే మాకు తెలిసింది. జీజవండిటోలకు చెందిన ఈ మహిళ ఆకుల కోసం అడవికి పోగా సి.ఆర్.పి.ఎఫ్. పోలీసులు ఆమెను పిచ్చికుక్కల్లా పీక్కుతిన్నారు. కాళ్ళు అవిటి అయిపోయి జీవచ్ఛంలా బతుకుతున్నది. సల్వాజుడుం మొదలయిన తర్వాత లైంగిక హింస మరింత పాశవికతను సంతరించుకున్నది. 1990 నుండి 2010 వరకు కె.ఎ.ఎం.ఎస్. చరిత్రంతా రక్తధారల చరిత్రే. రాజ్యహింసకు బలయిన చరిత్ర. అయితే ఎక్కడ నిర్బంధం పెచ్చరిల్లుతుందో అక్కడ ప్రతిఘటన చెలరేగుతుంది. ఈ 30 సంవత్సరాలలో దండకారణ్య మహిళ రాజ్యహింసను ప్రతిఘటిస్తూ రాటుదేలింది. చిత్రహింసల కొలిమిలోంచి కణ కణలాడే ఇనుప కమ్మీలా దృఢపడింది.

**క్రాంతి:** ప్రస్తుతం సల్వాజుడుం మహిళా ఉద్యమంపై ఎటువంటి ప్రభావాన్ని వేస్తోంది?

**నర్మద:** ప్రస్తుతం ఫాసిస్టు సల్వాజుడుంగా దేశవ్యాప్తంగా ప్రచారంలోకి వచ్చిన సైనిక క్యాంపెయిన్ 2005 జూన్ నుండి మొదలయి 2009 వరకూ నడిచింది. సల్వాజుడుం ఎత్తుగడ ఓడిపోయిందనీ, దాన్ని ఆపుకున్నామనీ రమణ్‌సింగ్, నన్‌కిరాం కంవర్, మహేంద్రకర్మ, చిదంబరంలు ప్రకటించి తమ ఓటమిని స్వీకరించారు. విప్లవ మహిళా ఉద్యమం సల్వాజుడుంను ప్రతిఘటిస్తూ, ఓడిస్తూ పటిష్టపడింది. అన్యాయమైన యుద్ధాన్ని విప్లవ మహిళలు న్యాయమైన ప్రజాయుద్ధంలో భాగమై ఓడించారు. సల్వాజుడుంను చావుదెబ్బ కొట్టారు.

సల్వాజుడుం కంటే ముందు బస్తర్‌లో రెండు సార్లు ఇలాంటి దాడులను 'జనజాగరణ'ల పేరుతో నడిపించిన పాలక వర్గాలు అప్పుడూ చిత్తుగా ఓడిపోయాయి. జాగృతం అయిన ప్రజలను అణచివేసే క్యాంపెయిన్ 'జన జాగరణ్' (జన జాగృతి) 1990లో మొదటి విడత, 1997లో రెండవ విడత సాగినవి. బస్తర్ ప్రజల అటవీ సంపదలను దోచుకోవటం దోపిడి పాలక వర్గాల లక్ష్యం అయితే మహేంద్రకర్మ లాంటి బంటుల లక్ష్యం తెగాధిపత్యాన్నీ, భూస్వామ్య అధికారాన్నీ, తెగ పితృసామ్యాన్ని కాపాడుకోవటం. దోపిడి వర్గాలు తమ దోపిడిని నిరంతరాయంగా కొనసాగించడానికి సమాజంలో పితృస్వామ్యం వేళ్ళూనుకొని ఉండటం వారికి అవసరం. అందుకే దోపిడీ, పితృస్వామ్య వ్యతిరేక పోరాటం చేస్తున్న కె.ఎ.ఎం.ఎస్.ను దోపిడివర్గాలు సహించలేవు. నేడు దండకారణ్యంలో ప్రజలను ముఖ్యంగా జనాభాలో సగభాగాన్ని చైతన్యవంతం చేస్తోన్న కె.ఎ.ఎం.ఎస్. పార్టీకీ, పి.ఎల్.జి.ఎ.కు విప్లవోద్యమంలో ఒక ప్రధాన వనరుగా వుంది. అందుకే జుడుం  కె.ఎ.ఎం.ఎస్.ను ఒక పథకం ప్రకారమే నిర్మూలించాల్సిన లక్ష్యంగా చేసుకుంది.  కె.ఎ.ఎం.ఎస్. నాయకులనూ, కార్యకర్తలను భౌతికంగా నిర్మూలించడం, వారిని చిత్రహింసలకు గురిచేసి జైళ్ళలో పెట్టడం, అత్యాచారాలకూ, అవమానాలకూ గురి చెయ్యడం వంటి ఎన్నో అణచివేత రూపాలను అది ప్రయోగించింది. ఇలా అణచివేతను ప్రయోగించడం ద్వారా సభ్యులనే కాక భవిష్యత్‌లో సభ్యులయ్యే అవకాశాలున్న మహిళలనూ బెదరగొట్టి సంస్థను నిర్వీర్యం చేయపూనుకుంది. కానీ సల్వాజుడుమే నిర్వీర్యమై  పోయింది.

దోపిడిపాలక వర్గాలు, వారి సామ్రాజ్యవాద బాస్‌లు ఊరుకోరు కదా! వాళ్ళ లక్ష్యం నెరవేరే వరకు ఎన్నో కుట్రలు కుహకాలకు పాల్పడుతారు. ఆగస్టు 2009 నుండి గ్రీన్‌హంట్ పేరుతో ఆదివాసీ స్త్రీ పురుషుల నరమేధం మొదలు పెట్టారు. ఆగస్టు 2009 నుండి ఫిబ్రవరి 2010 వరకు 15 మంది మహిళలను చంపేశారు. గ్రామాలపై దాడి చేసి ఇళ్ళల్లో పనులు చేసుకుంటున్న వారిపై, సంతలకు పోయి తిరిగి వస్తున్న వారిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి చంపారు. ఇవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లు. కేంద్ర ప్రభుత్వం దాని సూత్రధారులైన సోనియా-మన్‌మోహన్-చిదంబర త్రయం రమన్, కంవార్, కర్మలు ఆదివాసీ మహిళలపై కక్షగట్టారు. వారి అస్తిత్వాన్ని రూపు మాపాలని కంకణం కట్టుకున్నారు. సుమారు లక్షకు పైగా బలగాలను మోహరించి వారిపై యుద్ధం ప్రకటించారు. కోబ్రా, కోయ కమాండో, క్రాక్ కమాండో, సి.ఆర్.పి.ఎఫ్., బి.ఎస్.ఎఫ్., గ్రేహౌండ్స్ బలగాలను వేట కుక్కల్లా వారిపైకి వుసిగొల్పుతున్నారు. ఎన్ని బలగాలు వచ్చినా అస్తిత్వం కాపాడుకోవటం కోసం పోరాడుతాం. మా అడవీ, అటవీ సంపదలు,

మా భూమి, నీరు, వీటిని కాపాడుకోవడం కోసం సర్వానికి తెగించి పోరాడుతాం. మాది న్యాయమైన యుద్ధం, చరిత్రలో న్యాయమైన యుద్ధాలు గెలిచినాయి. మేం కూడా గెలుస్తాం. ఆత్మరక్షణా యుద్ధం ద్వారా 'గ్రీన్‌హంట్'లను మట్టికరిపిస్తూ విప్లవ మహిళా ఉద్యమాన్ని బలోపేతం చేస్తాం.

**క్రాంతి:** మహిళా ఉద్యమ నిర్మాణ కృషిలో అసువులు బాసిన కొందరు కామ్రేడ్స్ గురించి చెప్తారా?

**నర్మద:** ముప్పై ఏళ్ళ దండకారణ్య ఉద్యమంలో కె.ఎ.ఎం.ఎస్. నాయకత్వం, కార్యకర్తలు, సాధారణ సభ్యులు, ప్రజావిముక్తి సైన్యంలోని మూడు రకాల బలగాలైన ప్రధాన, ద్వితీయ, పునాది బలగాలలోని సభ్యులూ, కమాండర్లు, పార్టీ నాయకత్వం, జనతన సర్కార్ల అధ్యక్షులు, వివిధ సహాయక శాఖలలో విశేషమైన సేవలందిస్తున్న క్రమంలో మొత్తం 264 మంది మహిళా కామ్రేడ్స్ అమరత్వం చెందారు. వీరిలో ఎల్లంకి అరుణ, మట్టా రత్తక్క, బయ్యా వేలాది, మడకం బిచ్చక్క, సడ్మెక్ సీతక్క, లింగె నానొ, పావురిబాయి సలామి, కడ్తి సోమే, మిచ్చ సరిత(మీనా), కమలక్క కరుణ, పెంటి, ఏముల పాయికే, మాడివి సీతి, ఈరిల్ కమల – వీరంతా మహిళా ఉద్యమంలో తమదైన విశిష్ట సేవలను అందించిన వీరయోధులు, ప్రజా నాయికలు.

**క్రాంతి:** మహిళా ఉద్యమ కార్యకర్తలకు పార్టీ ప్రధానంగా ఏ విషయాల్లో ఎడ్యుకేషన్‌ను అందిస్తుంది? అలాగే సాధారణ సభ్యులకూ, మహిళలకూ కె.ఎ.ఎం.ఎస్. అందిస్తోన్న ఎడ్యుకేషన్ గురించి చెప్పండి?

**నర్మద:** మహిళా ఉద్యమ కార్యకర్తలందరు ఆయా స్థాయిల్లో పార్టీ ఏరియా, జిల్లా, జోనల్ కమిటీలలో ఉంటున్నారు. ఆయా స్థాయిల్లో నిర్వహించే రాజకీయ, సైనిక, సైద్ధాంతిక మూలాలను అర్థం చేసుకోవటానికి ఎంగెల్స్ రచించిన 'కుటుంబం– వ్యక్తిగత ఆస్తి–రాజ్యాంగాల పుట్టుక', పార్టీ రూపొందించిన పాలసీపేపరు 'మహిళా సమస్యలపట్ల మన దృక్పథం' పై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం. వీటితో పాటు నిర్మాణ పద్ధతులను కూడా బోధిస్తున్నాం. కె.ఎ.ఎం.ఎస్. కార్యకర్తలకు ప్రాథమికంగా సంఘం ప్రణాళిక–నిబంధనావళిపై క్లాసులు నిర్వహిస్తాం. ప్రస్తుత రాజకీయ పరిస్థితి, నిర్మాణ సమస్యలు, శత్రు నిర్బంధం మొదలైన విషయాలపై విడుదల చేసిన లేఖలు, సర్క్యులర్లపై అధ్యయన తరగతులు, సెమినార్లు నిర్వహిస్తాం. కె.ఎ.ఎం.ఎస్. నిర్వహించే సభలు, విప్లవ దినాలు, సదస్సుల ద్వారా కూడా పెద్ద ఎత్తున రాజకీయ చైతన్యం మహిళలలో పెరుగుతుంది.

ఒకప్పుడు తమ గ్రామం చుట్టుపక్కల అడవి గురించి తప్ప తెలియని మహిళలు నేడు అమెరికా సామ్రాజ్యవాదం గురించి, ఇరాక్‌పై సైనిక దాడి గురించి వేదికలెక్కి ఉపన్యసించగలుగుతున్నారు. దళారీ పాలకుల నూతన ఆర్థిక విధానాల గురించీ ఎస్.ఇ.జడ్.ల గురించి, వాటి దుష్ప్రభావాల గురించి, నిర్వాసిత సమస్య గురించి విశ్లేషిస్తున్నారు. పొట్టకూటి కోసం ఆరుగాలం కష్టపడ్డం తప్ప ఇంకేమీ ఆలోచించలేని మెదళ్ళు నేడు సంస్థ రాజకీయ, నిర్మాణపరమైన సమస్యల్ని పరిష్కరించడానికి పదునెక్కుతున్నాయి. ఒక సంఘనాయకురాలు వివరించినట్లు, "పురుషుల్లోనే కాక మహిళల్లోనూ సంఘం చాలా మార్పు తెచ్చింది, నలుగురు మహిళలు కలిస్తే ఏదో ఒక సంఘం విషయమే ఇపుడు చర్చకు వస్తోంది."

ఆయా సందర్భాలలో వెలువరించే కరపత్రాలు, బుక్‌లెట్లు, పోరుమహిళ పత్రిక, పుస్తకాలు, అనువాద రచనల ద్వారా కె.ఎ.ఎం.ఎస్. కార్యకర్తల, సభ్యుల రాజకీయ చైతన్యం పెంచటానికి కృషి చేస్తున్నాం.

**క్రాంతి:** చివరగా, కె.ఎ.ఎం.ఎస్. భారతదేశ మహిళా ఉద్యమంలో ఎటువంటి పాత్రను పోషిస్తుందనుకుంటున్నారు?

**నర్మద:** మహిళా విముక్తి లక్ష్యానికి కట్టుబడి కె.ఎ.ఎం.ఎస్. దేశంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై తన వంతు కృషి చేస్తుందని కె.ఎ.ఎం.ఎస్. తన ప్రణాళికలో స్పష్టంగానే రాసుకున్నది. నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యం పీడిత ప్రజల రాజ్యాధికారాన్ని స్థాపించటం; దీన్ని సాధించాలంటే ఇక్కడ ప్రధాన పోరాట రూపం యుద్ధం, ప్రధాన నిర్మాణ రూపం సైన్యం. విప్లవ ప్రజాసంఘాలతో సహా అన్ని నిర్మాణాలూ సైన్యానికి వాహకాలుగా పని చేస్తాయి. సైన్యం రక్షణలోనూ సాయుధంగానూ అవి తమ కార్యకలాపాలు కొనసాగించుతాయి. సైన్య నిర్మాణంలో కె.ఎ.ఎం.ఎస్. తన వంతు పాత్రను నిర్వహిస్తున్నది. ఈ రోజు ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంలో 40 శాతానికి పైగా మహిళలు ఉన్నారు. దాదాపుగా లక్ష సభ్యత్వంతో విప్లవ మహిళా ఉద్యమం పురోగమనం వైపు అడుగులు వేస్తున్నది.

భారతదేశ మహిళా ఉద్యమం విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్, ఎ.ఒ.బి., ఉత్తర తెలంగాణలలోని విప్లవ మహిళా సంఘాలు, బీహార్ – ఝార్ఖండ్‌లోని నారీ ముక్తి సంఘం – బెంగాల్‌లోని లాల్‌గఢ్ మహిళా ఉద్యమం ఇవన్నీ కలిసి భారతదేశ విప్లవ మహిళా ఉద్యమంలో ఒక కీలకమైన, నిర్ణయాత్మకమైన పాత్రను పోషించగలవు.

★

*(మార్చి 8 ప్రత్యేక సంచికలో వేద్దామనుకున్న కా. నర్మద ఇంటర్వ్యూ ఆలస్యంగా అందడంతో ఈ సంచికలో ప్రచురిస్తున్నాం – సంపాదకవర్గం)*

# విప్లవోత్సాహం వెల్లివిరిసిన మార్చి 8 శత వార్షికోత్సవ సభలు

వంద సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈ సంవత్సరం మార్చి 8 శతవార్షికోత్సవాన్ని గొప్ప పోరాట స్ఫూర్తితో ఘనంగా జరపాలని దండకారణ్య జోన్ కె.ఎ.ఎం.ఎస్. ఇచ్చిన పిలుపులో భాగంగా పశ్చిమ బస్తర్ డివిజన్‌లో ముందు నుండే డివిజన్ వ్యాప్తంగా కరపత్రాలు, పోస్టర్ల ద్వారా, క్యాంపెయిన్ బ్యాచ్‌ల ద్వారా విస్తృతంగా ప్రచారం జరిగింది. డివిజన్‌లోని నాలుగు ఏరియాల్లో శతవార్షికోత్సవాల సందర్భంగా నాలుగు వర్క్‌షాపులు నిర్వహించారు. అలాగే సి.ఎన్.ఎం. కళాకారులు మార్చి 8 సందర్భంగా మూడున్నర రోజుల చొప్పున నాలుగు ఏరియాలలో వర్క్‌షాపులు జరిపి మహిళా సమస్యలపై దాదాపుగా 30 పాటలు, నాటికలు తయారు చేసి ప్రజల్లో ప్రచారం చేసారు.

శత వార్షికోత్సవాల సందర్భంగా పశ్చిమ బస్తర్ డివిజన్ మహిళా అమరుల స్థూపాన్ని నిర్మించాలని నిర్ణయం జరిగింది. గంగలూర్ ఏరియాలో నిర్మించిన స్థూపం 40 అడుగుల ఎత్తు వుంది. పడియోర్ పరివార్ (అమరుల బంధుమిత్రుల) కమిటి 'ప్రత్యక్ష పర్యవేక్షణ'లో 10 జనతనా సర్కార్ల పరిధిలోని గ్రామాల ప్రజలంతా వందలాది మంది ప్రజలు వంతుల వారిగా ఈ స్థూప నిర్మాణంలో పాల్గొన్నారు. సుమారు రెండు నెలలు శ్రమించి తమ ప్రియతమ మహిళా అమరుల స్థూపాన్ని నిర్మించారు.

శత్రువు ఒకవైపు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో పెద్ద ఎత్తున దాడిని ప్రారంభించి పదుల సంఖ్యలో ప్రజల్ని సామూహిక హత్యాకాండకు గురిచేస్తూ బీభత్సాన్ని సృష్టిస్తున్న వాతావరణంలో కూడా శత్రు క్యాంపులకు రెండు గంటల దూరంలోనే రెండు నెలలపాటు వందలాదిమంది శ్రమించి నిర్మించిన స్థూపంను శత్రువు కండ్లుగప్పి వేలాది మంది ప్రజలతో జరిగిన సభలో ఆవిష్కరించారు. గంగలూరు-బైరంగఢ్ రెండు ఏరియాలకు సంబంధించిన 150 గ్రామాల నుండి ప్రజలు రెండు రోజులు ప్రయాణించి సభాస్థలానికి చేరుకున్నారు. 15 వేల 600 మంది ప్రజలు సభలకు హాజరుకాగా, సభలకు రక్షణ కల్పించడంలో భాగంగా వందల మంది మిలీషియా అనేక వలయాలుగా సెంట్రీలు, ఆంబుష్‌లు ఏర్పర్చి సభలకు గట్టి రక్షణను కల్పించారు.

డౌలా రెయిడ్‌లో అమరురాలైన కామ్రేడ్ కరుణ తల్లి స్థూపావిష్కరణ చేసింది. కె.ఎ.ఎం.ఎస్. అధ్యక్షురాలు కామ్రేడ్ జైమతి ప్రజలనుద్దేశించి పశ్చిమ బస్తర్ డివిజన్‌లో మొదటి మహిళా అమరురాలు కామ్రేడ్ కుర్సం రాజక్క నుండి మొదలుకొని ఇప్పటివరకు అమరులైన అమరవీరుల త్యాగాలను ఎత్తిపడుతూ మాట్లాడింది. అమరుల కుటుంబాలను పరిచయం చేసారు. సభా ప్రాంగణమంతా ఉద్విగ్న వాతావరణం ఏర్పడింది. తర్వాత కామ్రేడ్స్ సన్నీ, జ్యోతి(డీవీసీఎం), నర్మద (ఎస్.జడ్.సి.ఎం.), మాధవి (డీవీసీఎస్)లు మున్నగువారు మాట్లాడారు. దోపిడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాలను ఏర్పర్చుకోవాలని దీనికోసం జనతా సర్కార్లను ఏర్పర్చుకొని వాటి నాయకత్వంలో సమిష్టి సహకార పనులలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ మార్చి 8 సందర్భంగా ఆరు పుస్తకాలను ఆవిష్కరించారు. అవి 1) దండకారణ్య మహిళా అమరవీరుల పుస్తకం 2) మార్చి 8 చరిత్ర 3) కామ్రేడ్ క్లారాజెట్కిన్ చరిత్ర 4) ఎల్.టి.టి.ఇ. మహిళా గెరిల్లా పోరాట చరిత్ర 5) జైలు కామ్రేడ్స్‌కు జేజేలు 6) దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర. ఈసారి సభ రెండు రోజులు జరిగింది.

ఈ రెండు రోజుల సభ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజలకు (అనారోగ్యంగా వున్న వాళ్లకు) ట్రీట్‌మెంట్ చేయడం కోసం ప్రజావైద్యుల నాయకత్వంలో హాస్పటల్‌ను ఏర్పర్చారు.

శత్రువు ఎంతటి నిర్బంధాన్ని ప్రయోగించినా మనమంతా సంఘటితంగా వుంటే ఎన్ని అద్భుతాలైనా చేయవచ్చుననే భరోసాను ఈ సభలు కల్గించాయి. సి.ఎన్.ఎం. కళాకారులు తమ ఆట, పాట, నాటికలతో ఇచ్చిన సందేశాలు, వక్తలు తమ తమ ఉపన్యాసాల్లో ఇచ్చిన సందేశాలు, అమరవీరుల కుటుంబాలు ప్రేక్షకుల్లో కల్పించిన ప్రేరణ, ఫోటోల ప్రదర్శన, విల్లంబుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు సభాముఖంగా జరిగిన సన్మానం, బహుమతుల పంపకం అన్నీ ప్రజలపై గొప్ప ప్రభావాన్ని వేసాయి. మరింత దృఢంగా, సంఘటితంగా పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లేలా ఉత్సాహపరచి, పోరాటోన్ముఖులను చేసాయి.

# తడపాల ఎన్‌కౌంటర్‌లో అమరులయిన కామ్రేడ్స్ పుల్లయ్య, లక్ష్మిలకు జోహార్లు

ఖమ్మం జిల్లా వెంకటాపురం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన కామ్రేడ్ కంతి పుల్లయ్యనూ, అతని జీవిత భాగస్వామి కామ్రేడ్ లక్ష్మినీ, 2010, మార్చి 19న నరహంతక గ్రేహౌండ్స్ పోలీసులు అదే గ్రామంలో రెండు వేర్వేరు ప్రదేశాల్లో పట్టుకొని, చిత్రహింసలకు గురిచేసి సమీపంలోని తడపాల గుట్టలలో పాశవికంగా కాల్చిచంపి, నిస్సిగ్గుగా ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు. ఈ జంటకు ఇద్దరు ఆడపిల్లలున్నారు.

## కామ్రేడ్ కంతి పుల్లయ్య (వెంకన్న)



కామ్రేడ్ పుల్లయ్య 1980ల నుండి పీపుల్స్‌వార్ పార్టీకి, గోదావరి ఇవతలి ప్రాంతానికి కొత్తగా వచ్చిన దళానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించేవాడు. విప్లవ రాజకీయాలు, విప్లవ పాటలు వినడమే కాకుండా పాడడం చేసేవాడు. చిన్నప్పటి నుండి ఎంతో ఉత్సాహంగా వుండే కామ్రేడ్ వెంకన్న దోపిడీ వర్గాల గురించి తెలుసుకుని విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడయ్యాడు.

2002లో వెంకటాపురంకు కొత్తగా దళం వచ్చినప్పటి నుండి దళానికి సహకరిస్తూ, గ్రామాలలో ప్రజలను ఏవిధంగా అభివృద్ధి చేయాలి, వాళ్లను రాజకీయంగా ఎట్లా ముందుకు తీసుకుపోవాలని తపన పడేవాడు. 2004వ సంవత్సరంలో పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో చర్చలు జరిపినపుడు కామ్రేడ్ వెంకన్న ప్రజలలో తిరుగుతూ ప్రభుత్వ బూటకత్వాన్ని విప్పి చెపుతూ మావోయిస్టు రాజకీయాలను ప్రజల్లోకి తీసుకుపోయాడు. హైదరాబాద్, వరంగల్‌లలో జరిగిన సభలకు ప్రజలను కదిలించడంలో కీలక పాత్ర వహించాడు. పోలీసుల కంటిలో నలుసుగా మారిన కామ్రేడ్ వెంకన్న కోసం పోలీసుల వేట మొదలయింది. పార్టీ పిలుపును అందుకొని పూర్తికాలం కార్యకర్తగా దళంలో నెల రోజుల పాటు తిరిగాడు. ఆతర్వాత కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో కామ్రేడ్ వెంకన్న సతమతమవుతూ కూడా వర్గ సంబంధాన్ని వదలలేదు. కర్రెగుట్టలపై పార్టీ అప్పచెప్పిన పనులు చేయడం, గుట్టపై గ్రామాలలో ఆర్గనైజర్‌గా తిరుగుతూ సంఘాలు పెట్టి వాటిని అభివృద్ధి చేయడం కోసం వేసిన కొత్త టీమ్‌కు కమాండర్‌గా బాధ్యతలు తీసుకున్నాడు. నిర్బంధం మూలంగా గ్రామాలన్నీ కిందికి దిగిపోవడం, టీములోని సభ్యులు శత్రువు ముందు లొంగిపోవడం జరిగినా పట్టుదలతో కాంకేర్ ఆర్.పి.సి. అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకొని ప్రజలతో వుంటూ ఆట, పాటలతో ప్రజల మనస్సులో చెరిగిపోని ముద్ర వేశాడు. దళంలోకి కొత్త వాళ్లని రిక్రూట్ చేయడం, వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడంలో బాధ్యతగా పని చేసాడు. కామ్రేడ్ వెంకన్న అనారోగ్యం కారణంగా ఆర్.పి.సి. బాధ్యతలు చేయలేనని సాధ్యమయిన పని చేస్తానని పార్టీతో చర్చించి 2008 నుండి ఏరియా ఆదివాసీ రైతుకూలీ సంఘం అధ్యక్షునిగా పని చేసాడు. ఇదే క్రమంలో పార్టీ దెబ్బతిన్న సంబంధాలను పునర్‌నిర్మాణం చేసి, ప్రజా పంచాయితీలు చేసాడు. వెంకన్న మంచి అనుభవమున్న కామ్రేడ్. శత్రువు నిఘా పెరిగి అతని కుటుంబాన్ని పోలీసులు కౌన్సిలింగ్‌లో "వెంకన్నను పట్టించుకునే వారు ఎవరూ లేరని" పెద్ద ఎత్తున ప్రచారం చేసినాగానీ కామ్రేడ్ వెంకన్న మాత్రం పార్టీనీ, ప్రజలని వదలలేదు. ముకునూర్ ఎన్‌కౌంటర్‌కు కారకుడు, ఇన్‌ఫార్మర్ దేవాల్‌ను శిక్షించడం, ఆలుబాక సుంకరి సతీష్‌ను చంపడం, గ్రామాలలోని ఇన్‌ఫార్మర్స్‌ని దేహశుద్ధి చేయడం, వాళ్లని ఎప్పటికప్పుడు పరిశీలించడంలో ముందుండేవాడు. కామ్రేడ్ వెంకన్న ఎనిమిది సంవత్సరాల విప్లవ జీవితంలో ప్రజలని అంటిపెట్టుకొని పని చేయడంలో మంచి పని శైలి వుండేది. అది సహించని పోలీసులు మార్చి 19వ తారీఖున ఉదయం ఇంటి వద్ద నిద్రిస్తున్న వెంకన్నను పట్టుకొని అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి కాళ్లు, చేతులు విరిచి, బూటకపు ఎన్‌కౌంటరలో కాల్చి చంపారు. కామ్రేడ్ వెంకన్న ఆశయాన్ని ముందుకు తీసుకపోదామని శపథం చేద్దాం.

## కామ్రేడ్ కంతి లక్ష్మి

కామ్రేడ్ కంతి లక్ష్మి ఆర్థిక పరిస్థితి కారణంగా భర్తతో కల్సి వెదురుబొంగులు తెచ్చి చాటలూ, గుళ్లలు, గంపలు, తడకలు

⇨

# ప్రతిఘటనా - పోరాటాలూ - సభలు

## ఎన్.టి.

కె.కె.డబ్ల్యు.

### చిట్యాల-పెద్దపల్లి ఏరియాలో మండల కాంగీ నాయకుడు లింగపెల్లి మోహన్‌రావు ఖతం

చిట్యాల మండలం రామక్రిష్టాపూర్ గ్రామంలో భూస్వామ్య వర్గానికి చెందినవాడు. గతంలో తెలుగుదేశం అధికారంలో వుండగా ప్రజలపై దాడులు, అరెస్టులు చేయించడంలో ముందు వరుసలో వున్నాడు. మళ్లీ కాంగ్రెస్‌లో 2004 చేరి అయిదు సంవత్సరాలు సర్పంచ్‌గా కొనసాగాడు. ప్రస్తుతం తన భార్య సర్పంచ్‌గా కొనసాగుతుంది. మండలంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు డబ్బులు పంచడం, విచ్చల విడిగా సారాను పంచడం, ప్రజలను బెదిరించడం, తనను వ్యతిరేకించిన వారిని కొట్టించడం చేసాడు. స్థానికంగా తనకు తెలిసిన ఎం.ఎల్.ఎ. గెలవడంతో మండలంలో హోదాను వుపయోగించుకొని పార్టీకి బలమైన గ్రామాల్లో తిరుగుతూ కాంగ్రెస్‌లో చేరండి ఇక నుండి మాదే రాజ్యం, మావోయిస్టులు లేరని దురుసుగా మాట్లాడుతూ మన సమాచారం చెప్పాలనీ, ఎంతైనా డబ్బులు ఇస్తామని ప్రలోభాలకు గురి చేసేవాడు. మండలంలో వచ్చిన డబ్బులు కాజేసేవాడు. మొదటి నుండి మన పార్టీకి, ప్రజలకు వ్యతిరేకంగా వుండేవాడు. ఆగస్టు 29న ఏరియా దళం ప్రజల కోరికమేరకు ఇతన్ని ఖతం చేసింది.

### సింగిల్‌విండో ఛైర్మన్ సమ్మిరెడ్డి ఖతం

కరీంనగర్ జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఎదులపురం గ్రామానికి చెందినవాడు. ఇతను భూస్వామ్య వర్గానికి చెందినవాడు. మొదటి నుండి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తూ మన కార్యకర్తలను అరెస్టు చేయించడం, గూండా గ్యాంగ్‌లను పెంచి పోషించడం, ప్రజల మధ్య చీలికలు సృష్టించడం, మండలంలో మనం ఆపిన భూస్వాముల భూములను పోలీసుల అండతో అమ్మించడం, మండలంలో కాంగ్రెస్ విస్తరణలో ముందు వుండడంతో పాటు రైతులకు వచ్చిన ఎరువులను స్వాహా చేసి అవినీతిలో పేరు గడించాడు. ప్రజలపై దాడులు చేయడంలో ముందు వుంటూ ప్రజా కంటకుడిగా మారాడు. సెప్టెంబర్ 25న ఏరియా దళం ఇతనిని ఖతం చేసింది.

చిట్యాల, పెద్దపల్లి పరిధిలో జరిగిన పొలిటికల్ యాక్షన్స్ ప్రజలకు, మన శక్తులకు ధైర్యాన్నిచ్చాయి. మైదానంలో మాదే రాజ్యం అంటూ, మేము చెప్పిందే వేదం అంటూ పాత పాలన మళ్లీ సాగాల్సిందేనని విర్రవీగిన కాంగీ నాయకులు, నల్లదండు ముఠాలు, ప్రజా వ్యతిరేకులు పట్టణాలకు పరుగులు తీసారు. విప్లవోద్యమం ప్రజల వెన్నంటే వుంటుందని దోపిడి పాలకవర్గాల కాకీమూకల పడగ పహారాలు కాపాడలేవని నిరూపితమైంది.

### ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ ఏరియాలో శత్రువు నెట్‌వర్క్ ధ్వంసం

**రాంలాల్ నాయక్:** ఈ ఏరియా పరిధిలో మహాముత్తారం మండలానికి చెందిన ఎత్తునగారం గ్రామస్తుడు. మొదట లంపెన్ భావాలు కలిగి వుండి యువతతో తాగుతూ జల్సాగా వుండేవాడు. తొలుత ప్రతిఘటన పార్టీ దళ కమాండర్‌గా పని చేశాడు. ఆ ప్రాంతంలో ఆ గ్రూపు ప్రజలపై దాడులు, చందాల దందా కొనసాగిస్తూ ఆ ప్రాంత నాయకుడుగా పోలీసులతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని డబ్బులు వసూలు చేసి చివరికి ఆయుధాలతో లొంగిపోయాడు. శత్రువుతో ఒప్పందంలో భాగంగానే కొద్ది రోజులు

---

⇨

చేసి, అమ్మడం ద్వారా కుటుంబ పోషణలో భాగం పంచుకునేది. కా. వెంకన్న పార్టీ పనుల మీద పోయినపుడు కామ్రేడ్ లక్ష్మక్కను పోలీసులు వేధించారు. కామ్రేడ్ వెంకన్నను లొంగిపోయేలా లక్ష్మక్కపై ఒత్తిడి తెచ్చారు. ఇబ్బందులను తట్టుకుంటూనే వెంకన్నతో కలిసి పార్టీ పనులు, ఇంటి పనులు చూసుకుంటూ గుట్టపైన సమిష్టి వ్యవసాయం పనులలో పాల్గొనేది. అట్లా వెంకన్నతో రహస్యంగా తిరుగుతూ గుట్టలపై వుండేది.

కామ్రేడ్ లక్ష్మక్క ఎవరితోనయినా తక్కువ మాట్లాడేది. ఆమె పనులు ఆమె చేసుకునేది. అమాయకంగా వుండే లక్ష్మిని మార్చి 19 ఉదయం నీళ్ల తేవడానికి చెలిమె వద్దకు పోయినపుడు పోలీసులు చూచి పట్టుకొని చిత్రహింసలు పెట్టి కాళ్లు, చేతులు విరిచి, అత్యాచారం చేసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు.

ఈ రాజ్యం, పోలీసుల క్రూరత్వం ఎంత నగ్నంగా వుందో ప్రజలందరికి అర్థమైంది. ఈ దోపిడీ రాజ్యాన్ని అంతం చేయడం ద్వారా కామ్రేడ్ లక్ష్మక్క ఆశయాలను ముందుకు తీసుకపోదాం.

★

తర్వాత బయటికొచ్చాడు. సాధారణంగా ఇంటివద్ద వుంటున్నట్లు నమ్మిస్తూ రోజువారిగా నిమ్మగూడెం, కణుకురు, రెడ్డిపల్లి, మోదేడ్ గ్రామాల నుండి సమాచారం సేకరించి సెల్‌ఫోన్ ద్వారా సమాచారం చేరవేసేవాడు. గ్రామాల్లో యువతకు సెల్‌ఫోన్స్, డబ్బులు అందజేసేవాడు. పార్టీకి చెందిన కుటుంబాల మీద నిఘా పెట్టడం, కదలికలను గమనిస్తూ వెంబడించడం చేసాడు. దళం ఆ ప్రాంతం పోతె తన కుటుంబీకులను అటవి ఉత్పత్తుల సేకరణకు, పశువుల కాసే కాపర్లుగా పంపి దళం మకాం వేసిన స్థలాన్ని గురించి తెలుసుకుని ఫోన్ ద్వారా సమాచారం అందజేసేవాడు. ఒకసారి మనం మకాం మార్చిన తర్వాత పోలీసులు ఆ స్థలాన్ని చుట్టుముట్టారు. ఇతను మహాముత్తారం ఎస్.ఐ.కి గైడ్‌గా వుంటూ రహస్యంగా బలగాలలో తిరిగేవాడు. 2009 అక్టోబర్ 13న ఏరియా దళం రాంలాల్ నాయక్‌ను ఖతం చేసింది.

**రావుల శ్రీనివాస్‌గౌడ్:** కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌కు చెందిన శ్రీనివాస్ గౌడ్‌ను ఎస్.ఐ.బి. ఆర్గనైజ్ చేసి పంపింది. దళంలోకి రిక్రూట్ అయ్యాక పెద్దపల్లి ఆర్గనైజర్‌ను దెబ్బకొట్టే లక్ష్యంతో సి.ఐ. మొగిలయ్య నేతృత్వంలో పథకం రూపొందింది. కుటుంబంలో తగాదాలు వున్నాయనీ, పరిష్కారం కావడం లేదని, తన ఆస్తి మొత్తం గుంజుకున్నారని, పార్టీలోనే వుంటానని తన పేరు, గ్రామం పేరు మార్చి తప్పుడు అడ్రస్ చెప్పి నమ్మించే ప్రయత్నం చేశాడు. తనవద్ద సెల్‌ఫోన్ లేదని చెప్పాడు. అతని మాటలూ, ప్రవర్తనపై అనుమానంతో తనిఖీ చేయగా సెల్‌ఫోన్, గుర్తింపు కార్డులు దొరికాయి. ఇంటరాగేట్ చేయడంతో తనను ఎస్.ఐ.బి. పంపించిన విషయం ఒప్పుకున్నాడు. కరీంనగర్‌లో మనకు వ్యతిరేకంగా పోలీసులు ఏర్పాటు చేసిన యువజన సంఘంలో చేరి యువతను ఆర్గనైజ్ చేస్తూ నెట్‌వర్క్ పెంపుదలకు కృషి చేశాడు. తరువాత ఎస్.పి. షానవాజ్ కాశీం లింకులో ప్రజాపోరాటాల్లో పాల్గొంటున్న వాళ్లందరి ఫోటోలు సేకరించడం, తాను కూడా ఉద్యమ కార్యకర్తగా పరిచయం చేసుకుంటూ వివరాలు సేకరిస్తూ రిపోర్టులను పోలీసులకు అందజేయడం చేశాడు. తదుపరి రిక్రూట్ అయి దెబ్బకొట్టే లక్ష్యంతో వచ్చాడు. ఇతన్ని 2009 డిసెంబర్‌లో ఏరియా దళం ఖతం చేసింది.

## ఫారెస్టు ఆఫీసర్స్‌పై దాడి- ఎస్.ఎల్.ఆర్. స్వాధీనం

ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర-ఎన్.టి. బార్డర్ గ్రామాల్లో ఫారెస్టు వాళ్లు కలప రవాణాను నిలువరించేందుకు పోలీసులతో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఫారెస్టు వాళ్లకు శిక్షణనిచ్చి ఆయుధాలను ఇచ్చింది. పెట్రోలింగ్‌కు వచ్చిన ఫారెస్టు వాళ్లపై సోమునురు (మహారాష్ట్ర) వద్ద దాడి చేసి ఒక ఎస్.ఎల్.ఆర్. 20 తూటాలు, ఎయిర్ రైఫిల్ స్వాధీనం చేసుకోవడం జరిగింది.

## వరంగల్ జిల్లా మండల కాంగ్రెస్ నాయకుడు నర్సింహారెడ్డి ఖతం

పాఖాల కొత్తగూడెం మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి భూస్వామి. ఎరువుల వ్యాపారం చేస్తూ పేదల భూములు కాజేశాడు. కాంగ్రెస్‌ను విస్తరింపజేయడంలో ముందు వుంటున్నాడు. ప్రజలపై దురుసుగా వ్యవహరిస్తూ భూస్వామ్య పద్ధతులు అవలంభించేవాడు. ప్రజా కంటకుడిగా మారడంతో ప్రజల కోరికమేరకు అక్టోబర్ 28న ఏరియా దళం ఇతన్ని ఖతం చేయడం జరిగింది.

## బంద్ ప్రచారం

నిర్వాసితుల సమస్యపై ఎస్.జడ్.సి. ఇచ్చిన సెప్టెంబర్ 1,2 తేదీలలో బంద్ పిలుపు విజయవంతంకై డీవీసీ, ఏసీల తరపున పత్రికా ప్రకటనలు ఇచ్చారు. కొత్తగూడెం-నర్సంపేట ఏరియాలోని గ్రామాలలో పోస్టర్లు వేశారు. ఏరియా వ్యాప్తంగా తీవ్ర కూంబింగుల మధ్యనే ప్రచారం, బంద్ విజయవంతం అయింది.

## ప్రజా పోరాటాలు

ఆదివాసీ ప్రాంతాలలో ఓపెన్‌కాస్టుల తవ్వకాలు, ఇనుము తరలింపు, నీళ్ల తరలింపు తదితర అంశాలపై ప్రచారం చేశారు. నవంబర్ 23 నాడు డివిజన్‌లోని ఖమ్మం (భద్రాచలం), వరంగల్ (ఏటూరునాగారం)లలో ఐ.టి.డి.ఎ.ల ముందు ధర్నా నిర్వహించారు. సుమారు 700 మంది ప్రజలు పాల్గొన్నారు. ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలు, ప్రజాస్వామికవాదులు పాల్గొన్నారు. ధర్నానుద్దేశించి ఆదివాసీ పోరాటాల ప్రాధాన్యతను వివరిస్తూ హక్కులకై ఉద్యమించాలని స్వయం పాలన సాధించుకోవాలని ప్రసంగించారు.

## ఖమ్మం జిల్లా

## శబరి ఏరియాలో ఇద్దరు ఇన్‌ఫార్మర్లు ఖతం

దుమ్ముగూడెం మండలం కొమ్మనపల్లి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ కణితి రాజు 2005 నుండి ప్రజావ్యతిరేకిగా, పెత్తందారుగా వుండేవాడు. గ్రామంలో రాజు, సుబ్బయ్యలకు గ్రామ ప్రజలతో భూమి తగాదాలు వున్నాయి. దీనిని పరిష్కరించుకొనుటకు 2007లో పార్టీ దగ్గరకు వచ్చారు. పార్టీ ప్రజల సమక్షంలో పరిష్కరించడం జరిగింది. మొదటి నుండి గ్రామంలో పెత్తందారులైన వీరు అహంభావంతో ప్రజల తీర్పును గౌరవించకుండా గ్రామ ప్రజలపై కక్ష పెంచుకున్నారు. అప్పటి నుండి పోలీసు ఇన్‌ఫార్మర్లుగా మారి తమకు వ్యతిరేకులైన ప్రజలనూ మావోయిస్టు సానుభూతిపరుల గురించి స్టేషన్‌లలో చెప్పడం, చిత్రహింసలు పెట్టించడం, జైల్లో

వేయించడం లాంటివి చేసేవాళ్లు. వీరు పోలీసుల అండదండలతో మమ్ములను ఎవరూ ఏమీ చేయలేరని విర్రవీగుతూ దళంను పట్టించడం కొరకు పోలీసులకు సమాచారం ఇచ్చేవాళ్లు. వీరిద్దరూ ఇచ్చిన సమాచారంతో పోలీసులు దళంపైకి దాడికి వచ్చారు. ప్రజల సహకారంతో దళం అక్కడి నుండి తప్పుకుంది. 2009 డిసెంబర్‌లో వీరిద్దరిని ఇంటరాగేషన్ చేసి ప్రజల ఆమోదంమేరకు మరణశిక్ష విధించడం జరిగింది.

## పోలీసు ఇన్‌ఫార్మర్ షేక్ ఖాజా పాషా పి.ఎల్.జి.ఎ. మిలీషియా చేతుల్లో ఖతం

ఖమ్మం జిల్లా వెంకటాపురం మండలం విజయపురి కాలనీకి చెందిన కిరాణా వ్యాపారి, సి.పి.ఎం. పార్టీ నాయకుడు. ఇతను గత కొంత కాలంగా పోలీసులకు మన సానుభూతిపరుల, మిలీషియా, దళం కదలికలు, కార్యక్రమాలను పోలీస్ స్టేషన్‌కు ఫోన్ ద్వారా చేరవేస్తున్నాడు. పంచాయితీలు చేయడం, లంచాలు తీసుకోవడం, ఎస్.ఐ.కి చెప్పి భయపెట్టడంతో పాటు నాకు తెలవకుండా ఎవరూ పోలీస్ స్టేషన్‌కు రిపోర్టు చేయవద్దని కూడ కంట్రోల్ చేసేవాడు. అదే గ్రామానికి చెందిన బొల్లి వెంకటేశ్వర్లును కొట్టి హెచ్చరించినా, ఖాజా పాషాలో మార్పు రాలేదు. మార్చి 18 తారీఖున ప్రజల అభిప్రాయంమేరకు పి.ఎల్.జి.ఎ. ఖాజా పాషాను ఖతం చేసింది.

## ఇన్‌ఫార్మర్‌ను ఖతం చేసిన మిలీషియా

శబరి దళం ఏరియాలో చింతూరు మండలం చట్టి గ్రామానికి చెందిన రవ్వ క్రిష్ణ చైతన్య 10వ తరగతి చదువుకొని లంపెన్‌గా తిరుగుతూ వుండేవాడు. 2005లో ఛత్తీస్‌గఢ్ సల్వాజుడుం క్యాంపు ఏర్పాటు చేసిన తర్వాత ఆ క్యాంపుతో సంబంధాలు పెట్టుకొని (బార్డర్‌లో వున్న) ఆంధ్రా గ్రామాలలో సమాచారం సేకరించి ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ పోలీసులకు చేరవేసేవాడు. 2006లో రవ్వ చైతన్యను పోలీసులు హోంగార్డుగా తీసుకొని ప్యారా టీచర్‌గా ఉద్యోగం ఇప్పించి ఏడురాళ్లపల్లి గుట్టలపై గ్రామాలకు పంపినారు. ఆ గ్రామాలలోని ప్రజలు శత్రువుకు చైతన్య సమాచారం చేరవేస్తున్నాడని తెలుసుకొని గుట్టల పైనుండి వెళ్లగొట్టారు. తర్వాత చట్టి గ్రామంలో ఉంటూ కుటుంబ సంబంధాల పేరుతో గ్రామాల్లో తిరుగుతూ దళం, సంఘ సమాచారాన్ని సేకరించి పోలీసులకు అందించేవాడు. అతను ఇచ్చిన సమాచారంతో చింతూరు, భద్రాచలం మండలంలోని పది గ్రామాలపై పోలీసులు దాడి చేసి ప్రజలనూ, కమిటీ సభ్యులను అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టి జైళ్లకు పంపారు. ప్రజా ద్రోహి చైతన్య ఆగడాలు భరించలేని ప్రజలు అతన్ని శిక్షించాలని డిమాండ్ చేయడంతో మిలీషియా టీం మే 5న క్రిష్ణ చైతన్యను ఖతం చేసింది. వీడి మరణం విన్న శత్రువు వులిక్కిపడ్డాడు. రెండు మండలాల ప్రజలు సంతోషించారు.

# ఎ.ఒ.బి.

## మల్కాన్‌గిరి జిల్లా

## బలిమెల జల విద్యుత్ కేంద్రానికి నీళ్లు అందించే పంప్‌హౌస్, వాల్వ్‌హౌస్‌లపై ప్రజల ఆగ్రహం

డిసెంబర్ 20, 2009 రాత్రి 12.30 గంటల సమయంలో టన్నెల్ క్యాంప్ సమీపంలోని పంప్‌హౌస్‌పైన అలాగే టన్నెల్ క్యాంప్, బలిమెల మధ్య ఘాటీపైనున్న వాల్వ్‌హౌస్‌పైన పి.ఎల్.జి.ఎ., మిలీషియా, ప్రజలు కలిసి 200 మంది దాడి చేసారు. జల విద్యుత్ కేంద్రంలో ఎనిమిది యూనిట్లు వున్నాయి. వీటన్నింటికి ఈ రెండింటి ద్వారా నీళ్లు అందిస్తారు. డిసెంబర్ 24, 25, 26 తేదీలలో ఎస్.ఒ.సి.-ఎ.ఒ.బి. సంయుక్తంగా నిర్వహించిన ఆర్థిక దిగ్బంధనం సందర్భంగా నిర్బంధం, స్థానిక ప్రజలకు కరెంట్ ఇవ్వాలనీ డిమాండ్స్‌పై ధ్వంసం చేయడం జరిగింది. కలిమెల ప్రాంతంలో అరెస్టులు, ఒక సర్పంచ్‌తో సహా ఆరుగురి యువకుల మాయం, ప్రజల ఆస్తులు, మందులు దోచుకోవడం, ఆంధ్ర-ఒడిషాలలో సంయుక్త కూంబింగ్స్‌కు వ్యతిరేకంగా వీటిని ధ్వంసం చేయడం జరిగింది. దీనిలో భాగంగానే చిత్రకొండ-బలిమెల మధ్య ఘాటీ రోడ్డును నక్కమడుగు, టన్నెల్ క్యాంప్ పంచాయితీలకు చెందిన ప్రజలు 500 మంది వరకు కదిలి ధ్వంసం చేశారు. రాకపోకలు బంద్ చేయడానికి రోడ్లపై చెట్లు నరికి అడ్డుగా వేశారు.

మొత్తంగా యంత్రాలకు రెండు కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది.

మొట్ట మొదటిసారి విద్యుత్ కేంద్రానికి సంబంధించిన దాడి కావడంతో ఒడిషాలోని అన్ని రకాల ప్రాజెక్టులకు రక్షణ ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజలకు కరెంట్ ఇస్తామని ప్రకటించారు.

ఈ చర్య ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేసింది. స్థానిక సమస్యలైన నిర్బంధం, కరెంట్‌లపై ప్రభుత్వం స్పందించింది. కలెక్టర్ స్టేట్‌మెంట్ ఇవ్వాల్సి వచ్చింది. ఇక ఇందులో కదిలిన ప్రజలల్లో రోడ్డు వైపు వారే ఎక్కువగా వున్నారు.

ఇదే సమయంలో బలిమెల జంక్షన్‌లోని బి.ఎస్.ఎన్.ఎల్. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, ఫారెస్టు చెక్‌పోస్ట్, ఫారెస్ట్ రెస్ట్ హౌస్‌లను ధ్వంసం చేసారు. ★

**ఎ.ఒ.బి., ఎన్.టి. ఉద్యమాల్ని అభివృద్ధి చేద్దాం! నల్లమలకు విస్తరిద్దాం!!**

(...52వ పేజీ తరువాయి)

నాజీ మూకల్లా సామూహిక అత్యాచారం చేసి ఘోరంగా చంపివేశారు. ఎన్‌కౌంటర్స్ పేరుతో పోలీసులు చేసిన హత్యలన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లే. పోలీసులు పెట్టిన క్రూరమైన చిత్రహింసలు, వేధింపులు భరించలేక కొంతమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఏర్పరచిన హంతక ముఠాలు మన కామ్రేడ్స్‌ని పట్టుకొని పలు రకాలుగా చిత్రహింసలు పెట్టి హత్య చేశాయి. మరికొంత మంది కామ్రేడ్స్ ప్రమాదవశాత్తు ఆయుధాలు పేలి అమరులైనారు. అనారోగ్యంతో కూడా కొంత మంది కామ్రేడ్స్ కన్ను మూశారు.

మన బలగాలకూ శత్రు బలగాలకూ మధ్య జరిగిన దాడులు-ప్రతిదాడుల సందర్భంగానూ శత్రు బలగాలు నిరాయుధులైన ప్రజలపై విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లోనూ చాలా మంది కామ్రేడ్స్ గాయపడినారు. వేలాది మంది స్థానిక ప్రజా నిర్మాణాల కామ్రేడ్స్, ప్రజలు అరెస్టు చేయబడి తీవ్రమైన చిత్రహింసలకు గురైనారు. వీరిలో వందలాది మంది బూటకపు కేసుల్లో ఇరికించబడి జైళ్లలో బంధించబడినారు. అమానుష పరిస్థితులున్న జైళ్లలో వందలాది మంది కామ్రేడ్స్ సంవత్సరాల తరబడి మగ్గిపోతున్నారు. అనేక మందిపై నల్ల చట్టాలు మోపబడ్డాయి. ఆస్తుల విధ్వంసం, లూటీ, గ్రామాల దగ్ధం, పంటల నాశనం, పెంపుడు జంతు సంపద లూటీ దిన దినం పెరిగి పోతున్నది. ప్రజల విస్థాపన కొనసాగుతూనే వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే దేశవ్యాప్తంగా ఫాసిస్టు శత్రువు కొనసాగిస్తున్న మాపింగ్ అప్ మహా విధ్వంసకాండ దిన దినం పెరిగిపోయి ప్రజల బతుకుల్ని అల్లకల్లోలం చేస్తున్నది.

అడుగడుగునా శత్రు దమనకాండను తిప్పికొడుతూ పోరులో నేలకొరిగిన వందలాది మంది కామ్రేడ్స్ ప్రజాస్వామిక-కమ్యూనిస్టు చేతనతో ప్రదర్శించిన సాహసం, వీరత్వం పాటించిన విలువలు, నెలకొల్పిన ఆదర్శాలు-త్యాగ సంప్రదాయాలు, అందించిన విలువైన అనుభవాలు భారత నూతన ప్రజాస్వామిక పోరు మార్గాన్నీ, ప్రపంచ సోషలిస్టు మహా విప్లవ మార్గాన్నీ కాంతివంతం చేశాయి. అమరుల సంస్మరణ వారాన్ని పురస్కరించుకొని మన ప్రియతమ నాయకులు, త్యాగమూర్తులు కామ్రేడ్స్ సి.ఎం., కె.సి.లనూ, నక్సల్బరీ నుండి నేటి వరకు అమరులైన వేలాది మంది జ్ఞాత, అజ్ఞాత అమరులందరినీ తలచుకుంటూ పొలిట్‌బ్యూరో బరువెక్కిన గుండెలతో వినమ్రంగా తలవంచి నివాళులర్పిస్తున్నది. వారి ఆశయ సాధనకు తుదివరకూ అవిశ్రాంతంగా పోరాడుతామని శపథం చేస్తున్నది. ఈ సందర్భంగా అమరుల బంధుమిత్రులందరికీ, సహచరులందరికీ ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ వారి సంవేదనలో పాలుపంచుకుంటున్నది. అమరులు లేని లోటును పూడ్చాలని వారి ప్రియ సహచరులందరినీ కోరుతున్నది. క్షతగాత్రులైన కామ్రేడ్స్ ప్రదర్శించిన గొప్ప స్పిరిట్‌కు అభినందిస్తూ వారు త్వరగా కోలుకొని క్రియాశీలంగా ఉద్యమంలో పాలుపంచుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నది. శత్రువుచే అరెస్టు చేయబడినప్పటికీ క్రూరమైన చిత్రహింసలకు వెరవకుండా అత్యంత ధైర్యాన్ని, త్యాగనిరతిని ప్రదర్శించి, అమానుష పరిస్థితులలో సైతం జైళ్లను వర్గపోరాట కేంద్రాలుగా మలిచిన సాహసిక కామ్రేడ్సందరికీ మన పి.బి. హార్థికాభినందనలు తెలియజేస్తున్నది. దేశవ్యాప్తంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ దమనకాండకు గురైన లక్షలాది ప్రజానీకపు బాధలో పాలుపంచుకుంటున్నది. తమ కష్టాలకు, కన్నీళ్లకు, బాధలన్నింటికీ కారణమైన శత్రువుకు వ్యతిరేకంగా మరింత వర్గ కసితో దృఢంగా అంతిమ విజయం సాధించే వరకు పోరాడాలని కోరుతున్నది.

ప్రజాస్వామ్యం, జాతీయ విముక్తి కోసం, వర్గ దోపిడీ పీడనల నుండి విముక్తి కోసం సామ్రాజ్యవాదానికి, అన్ని రకాల ప్రతీఘాతుకత్వానికీ వ్యతిరేకంగా పోరాడే క్రమంలో దేశంలోనూ, వివిధ దేశాల్లోనూ గత పది నెలల కాలంలో వందలాది మంది మావోయిస్టులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థి యువజనులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు, ఉద్యోగులు, మహిళలు, పీడిత జాతి ప్రజలు అమరులైనారు. వీరందరినీ అమరుల సంస్మరణవారం సందర్భంగా స్మరించుకొని నివాళులర్పిద్దాం.

కామ్రేడ్స్,

మన పార్టీ నాయకత్వంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధం తీవ్రతరమవుతున్నది, విస్తృతమవుతున్నది, విజయాలు సాధిస్తున్నదీ, నూతన ప్రజాస్వామిక అధికారాన్ని సృష్టిస్తున్నది. కళింగనగర్, సింగూర్, నందిగ్రాం, సమరశీల ప్రజా ఉద్యమాల ప్రేరణతో వినూత్న తరహాలో పెల్లుబికిన లాల్‌గఢ్, నారాయణపట్న చారిత్రాత్మక సమరశీల ప్రజా పోరాటాలు దేశ రాజకీయాలలో, ప్రజా ఉద్యమాలలో నూతన ఒరవడిని సృష్టించాయి. ఇవి దేశంలో మావోయిస్టు పార్టీ నాయకత్వ ఆవశ్యకతను చాటి చెప్తున్నాయి.

గత పది నెలల ఉద్యమ చరిత్రంతా శత్రువు కొనసాగిస్తున్న బహుముఖ-భారీ సైనిక దాడికి, ప్రత్యేకంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఎ. బలగాలు, ప్రజలు కొనసాగించిన పోరాట చరిత్రే. మన గొప్ప అమరుల త్యాగాలు లేకుండా, లక్షలాది మంది పీడిత ప్రజల కష్టాలు కన్నీళ్లు లేకుండా ప్రజాయుద్ధంలో మనం సాధించిన ఏ ఒక్క విజయాన్ని ఊహించలేము. వీరి త్యాగాలు లేకుండా పార్టీ చేపట్టిన రాజకీయ,

సైనిక, నిర్మాణ, ఉత్పత్తి, ప్రజాసంక్షేమం, విస్తరణ వగైరా క్యాంపెయిన్లను, అవి సాధించిన సత్ఫలితాలను కూడా ఊహించలేము. అమరుల త్యాగాలు లేకుండా దేశంలోని వివిధ ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధం తీవ్రతరం–విస్తృతం కావడాన్నీ, ఈ యుద్ధంలో విజయాలు సాధించడాన్నీ, నూతన అధికారాన్ని సృష్టించడాన్నీ ఊహించలేం. లాల్‌గఢ్, నారాయణపట్న, కళింగనగర్ తదితర పోరాట విజయాలలో ఏ ఒక్కటీ అమరుల త్యాగాలు లేకుండా సాధించుకోలేదు. దేశంలోని ప్రజాస్వామికవాదులు, ప్రగతిశీల శక్తులు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా సమైక్యంగా ఉద్యమించడానికి అమరుల త్యాగాలు ప్రేరణనందించాయి. అలాగే అమరుల త్యాగాలు లేకుండా మన ప్రజాయుద్ధానికి లభించిన దేశ విదేశ పోరాట శక్తుల మద్దతును గురించి కూడా ఊహించలేము. ఒక్క మాటలో చెప్పాలంటే మన పార్టీ ఈ కాలంలో సాధించిన ప్రతి రాజకీయ, సైనిక, నిర్మాణ విజయాలన్నింటికీ ప్రేరణ, స్ఫూర్తి నందించింది అమరుల త్యాగాలే.

కామ్రేడ్స్,

భారత పాలకవర్గాలు అనుసరిస్తూ వచ్చిన ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విస్తరణవాదపూరిత, అభివృద్ధి నిరోధక ఆర్థిక, రాజకీయ, సామాజిక, పర్యావరణ విధానాల వల్లా, విప్లవోద్యమాన్ని అణచివేయడం పేరుతో ప్రజలపై ప్రతీఘాతుక యుద్ధాన్ని రుద్దడం వల్ల దేశంలో సామాజిక వైరుధ్యాలన్నీ మరింతగా పదునెక్కుతున్నాయి. దీనివల్ల మావోయిస్టు శక్తులు, ప్రగతిశీల ప్రజాస్వామిక శక్తులు, దేశభక్త శక్తులు, విశాల ఆదివాసీ, దళిత, మత మైనారిటీ తదితర సామాజిక పీడిత జన సమూహాలు, భారత విస్తరణవాద పీడన పాలైన జాతీయ విముక్తి ఉద్యమ శక్తులు సమైక్యం కావడానికీ, విస్తృత సమరశీల ప్రతిఘటన కొనసాగించడానికీ గొప్ప అవకాశాలు ముందుకొస్తున్నాయి. దక్షిణాసియా జ్వలిస్తున్నది. ప్రపంచంలో మౌలిక వైరుధ్యాలన్నీ తీవ్రతరమవుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే దేశ, ప్రపంచ వస్తుగత పరిస్థితి అద్భుతంగా వుంది.

విప్లవోద్యమంపై శత్రువు అత్యంత క్రూరంగా కొనసాగిస్తున్న ప్రతీఘాతుక దాడి వాడి రాజకీయ దివాళాకోరుతనాన్నే రుజువు చేస్తున్నది. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌నే గాకుండా పాలకవర్గాలు ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రతి పథకమూ ప్రజల ప్రతిఘటనతో అభాసుపాలై పోయింది, విఫలమైపోయింది. ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత సైన్యం, పారా మిలటరీ, ప్రత్యేక పోలీసు బలగాల్ని దించి రక్తపుటేరులు పారించినా అవి పూర్తిగా సమసిపోలేదు. కాశ్మీర్, మణిపూర్, గూర్ఖాలాండ్, తెలంగాణా తదితర ప్రజా ఉద్యమాలు ఆరని మంటల్లా రగులుతూనే వున్నాయి.

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని పోరాట ప్రాంతాలలోని పీడిత ప్రజానీకం అత్యంత ద్వేషంతో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దేశవ్యాప్తంగా చాలా తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతిఘటన ఫలితంగా ప్రజలు చారిత్రాత్మక లాహిరి, సరండ, సింగన్‌మడుగు, గయ, ఔరంగాబాద్, షిల్దా, తాడిమెట్ల సైనిక పోరాటాలనూ, లాల్‌గఢ్, నారాయణపట్న, కందమాల్ సమరశీల ప్రజా ఉద్యమాలను సృష్టించుకున్నారు. గ్రీన్‌హంట్‌ని దేశంలోని పీడిత ప్రజలూ, మావోయిస్టు విప్లవకారులు, ప్రజాస్వామికవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఫాసిస్టు పాలకులు, సామ్రాజ్యవాదులు కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కి వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధమే దేశ ప్రజల సమీకరణ శక్తిగా వుంది. అంతేగాకుండా ఈ దాడిని అంతర్జాతీయంగా కార్మికవర్గ విప్లవ శక్తులు, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు వ్యతిరేకిస్తున్నాయి. నేటి సామాజిక దిశను నిర్దేశిస్తున్న వీరంతా వివిధ రూపాలలో మన ప్రజాయుద్ధ పురోగమనానికి తోడ్పడుతున్నారు.

కామ్రేడ్స్,

మన ప్రియతమ అమరవీరులు ఏకతా కాంగ్రెస్ నిర్ణయించిన కేంద్ర కర్తవ్యం పరిపూర్తి చేయడానికి తమ సర్వస్వాన్ని త్యాగం చేసి ఆ బాధ్యతను మనపై ఉంచి వెళ్లారు. గొప్ప త్యాగాలు లేకుండా ప్రపంచంలో ఏ విప్లవమూ విజయం సాధించలేదు. అమరుల త్యాగాలు వృధా కావు. ఇది విప్లవాల యుగం. ఇది త్యాగాల–విజయాల యుగం. నేడు విప్లవం మనల్ని పెద్ద విజయాలు సాధించడానికి మరిన్ని త్యాగాలకు సిద్ధం కమ్మంటోంది. విజయ సాధనకు తెగించి పోరాడేలా అమరులు మనని పురికొల్పుతున్నారు. పోరాడ సాహసించిన ప్రజలు–మావోయిస్టులు అజేయులని చరిత్ర చాటి చెప్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో అమరుల రక్తంతో ఎరుపెక్కిన అంతర్జాతీయ కార్మికవర్గ జెండా చేబూని మహోన్నత లక్ష్యంతో వారు నడిచిన ప్రజాయుద్ధ బాటలో దృఢ సంకల్పంతో పురోగమించండి!

మన మార్గం ఎంత కష్టభరితంగా ఉన్నా, మలుపులు మెలికలతో కూడి ఉన్నా భవిష్యత్తు అత్యంత ఆశాజనకంగా, అద్భుతంగా వుంది. మన పార్టీ నాయకత్వంలో ప్రజలు పోరాడుతున్నారు. వారు మన పార్టీపై ఎంతో నమ్మకంతో ఉన్నారు. మనపై గొప్ప చారిత్రక బాధ్యత వుంది. అంతిమ విజయం మనదే–పీడిత ప్రజలదే!

కామ్రేడ్స్,

అమరవీరుల సంస్మరణ వారాన్ని విప్లవ స్ఫూర్తి ఉట్టిపడేలా ఊరూరా దేశవ్యాప్తంగా ఘనంగా జరపండి. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను భూస్థాపితం చేసే రాజకీయ కర్తవ్యాన్ని చేబూని ఊపిరిసలపని నిర్బంధం నడుమ అడుగడుగునా శత్రువును ఎదుర్కొంటూ అమరులైన కామ్రేడ్స్ అంకితభావన, ధైర్యసాహసాలు, సృజనాత్మకత, కమ్యూనిస్టు విలువలు, త్యాగనిరతిని ఎత్తిపట్టండి. ఆదర్శవంతమైన అమరవీరుల జీవిత చరితలను ప్రచురించండి. ఊరూరా అమరుల స్థూపాలను నిర్మించండి. కరపత్రాలు పంచడం, వాల్ పోస్టర్లు వేయడం, వాల్ రైటింగ్స్ రాయడం, బ్యానర్లు కట్టడం తదితర రూపాల్లో సృజనాత్మక పద్ధతుల్లో ప్రభావవంతంగా అమరుల గురించి విస్తృతంగా ప్రచారం చేయండి. అమరుల ఆదర్శాలను ఎలుగెత్తి చాటేలా సభలు–సమావేశాలు నిర్వహించండి. పార్టీ, ప్రజావిముక్తి గెరిల్లా సేన, ప్రజా నిర్మాణాలు, ప్రజల్లో విప్లవోత్తేజం నింపేలా అమరుల సంస్మరణ వారం విజయవంతం చేయండి.

ఈ సంవత్సరం మనం అమరులను సంస్మరించుకునే సందర్భంగా వారి ఆశయ సాధనకు నేటి నిర్దిష్ట పరిస్థితులలో ఈ కింది కర్తవ్యాలను నెరవేర్చడానికి మన పొలిటికల్ బ్యూరో యావత్తు పార్టీకీ, పి.ఎల్.జి.ఎ.కూ, ప్రజా నిర్మాణాలకూ, ప్రజలకూ పిలుపునిస్తున్నది.

- నేలకొరిగిన వీరుల స్థానాలను భర్తీ చేయడానికీ, పెద్ద సంఖ్యలో నూతన వారసులను తయారు చేయటానికీ పార్టీని సైద్ధాంతికంగా, రాజకీయంగా సంఘటితపరచండి! అసంఖ్యాక నూతన సభ్యులను భర్తీ చేయండి! అనవసర నష్టాలను నివారించండి! కార్మికవర్గేతర ధోరణులు వదిలించండి!
- ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని ఓడించటానికి అసంఖ్యాకంగా లాహిరి, సరండా, సిల్దా, తంగినిగూడ, తాడిమెట్లలను సృష్టించండి! అసంఖ్యాకంగా ప్రజలను కదిలించండి!
- భారత పాలకవర్గాలను, సామ్రాజ్యవాదులను ప్రజా ప్రభంజనంతో తుడిచిపెట్టడానికి అసంఖ్యాకంగా కళింగనగర్, నందిగ్రాం, లాల్‌గఢ్, నారాయణపట్నలను సృష్టించండి!
- ప్రజా పునాదిని బలోపేతం చేయడానికి పార్టీ రాజకీయ పంథాను, వర్గపంథాను, ప్రజాపంథాను అంటిపెట్టుకొని వుండండి!

1 జూన్ 2010

విప్లవాభివందనాలతో,<br>
పొలిట్‌బ్యూరో,<br>
సి.పి.ఐ.(మావోయిస్టు)


## మార్కెట్‌లో కొత్త పుస్తకాలు

1. ఉత్తర తెలంగాణ విప్లవోద్యమంలో అసువులుబాసిన అమరుల జీవిత చరిత్రలు 3వ భాగం (1990-94)
   దిక్సూచి ప్రచురణలు - వెల: 60 రూ.
2. ఉత్తర తెలంగాణ విప్లవోద్యమంలో అసువులుబాసిన అమరుల జీవిత చరిత్రలు 4వ భాగం (1995-98)
   దిక్సూచి ప్రచురణలు - వెల: 40 రూ.
3. ప్రజాయుద్ధంలో నేలకొరిగిన ఉత్తర తెలంగాణా మహిళా అమరుల జీవిత చరిత్రలు
   విరసం ప్రచురణలు - వెల: 35 రూ.
4. దండకారణ్య మహిళా ఉద్యమ చరిత్ర (1980-2009)
   విరసం ప్రచురణలు (శబరి కూర్పు) వెల: 50 రూ.
5. నారాయణపట్నం ఆదివాసీ రైతాంగ పోరాట జ్వాలల్ని ఎవరూ ఆపలేరు
   ఆదివాసీ ఛసి ములియా సంఘం, నారాయణపట్నం ప్రచురణ వెల: 5 రూ.
6. శ్యాం సంకలిత రచనలు : దిక్సూచి ప్రచురణలు



# అమరుల త్యాగాలను సమున్నతంగా ఎత్తిపట్టండి! అమరుల ఆశయ సాధనకు ప్రజాయుద్ధ మార్గంలో దృఢ సంకల్పంతో పురోగమించండి!

*2010 జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారం ఘనంగా జరపాలని పార్టీ శ్రేణులకూ, పి.ఎల్.జి.ఎ. కమాండర్లకూ–యోధులకూ, విప్లవ ప్రజానీకానికీ పొలిట్‌బ్యూరో, సి.పి.ఐ.(మావోయిస్టు) పిలుపు*

ప్రియమైన కామ్రేడ్స్!

మహోన్నత లక్ష్య సాధన కోసం మన పార్టీ గొప్ప నిర్మాతలు – నాయకులు – అమరులు అయిన కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ్ ఛటర్జీలు చూపిన ప్రశస్తమైన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో పయనిస్తూ గత అమరవీరుల దినం – 28 జూలై 2009 – తర్వాత 240 మందికి పైగా విప్లవ కార్మికవర్గ పుత్రికలు, పుత్రులైన మన ప్రియతమ కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. వీరందరికీ మన పార్టీ కేంద్ర కమిటీ, సి.ఎం.సి., కేంద్ర సుకోమోల తరపున పి.బి. వినమ్రంగా అరుణారుణ జోహార్లు పలుకుతోంది. మన ప్రియతమ అమరుల స్మృతిలో ప్రతి సంవత్సరంలానే ఈసారి అమరుల సంస్మరణ వారాన్ని ఘనంగా జరపాలని పార్టీకీ, పి.ఎల్.జి.ఎ.కీ, ప్రజా సంఘ నిర్మాణాలకూ, ప్రజలకూ పిలుపునిస్తున్నది.

దేశంలో పురోగమిస్తున్న ప్రజాయుద్ధ సమూల నిర్మూలనా లక్ష్యంగా భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి మద్దతుతో, సహాయ సహకారాలతో కొనసాగిస్తున్న ప్రతీఘాతుక బహుముఖ–భారీ సైనిక దాడిని వీరోచితంగా తిప్పికొట్టే క్రమంలో ఈ కామ్రేడ్స్ నేలకొరిగారు. దేశం నలుమూలలా – దండకారణ్యం, ఝార్ఖండ్, బీహార్, బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లోని విశాల ప్రాంతాల్లో – అమరుల నులివెచ్చని రక్తం చిందింది. అమరుల రక్తంతో కొండకోనలు, మైదానాలు, గనులు, జనావాసాలు, పంట పొలాలు అన్నీ ఎరుపెక్కాయి. ఫాసిస్టు పాలకవర్గాలు అపూర్వ స్థాయిలో కొనసాగిస్తున్న అత్యంత క్రూరమైన దాడి నుండి ప్రజాయుద్ధ విజయాలను కాపాడుకోవడానికీ, ప్రజలను, పార్టీని, ప్రజాసేనని, నూతన ప్రజాస్వామిక అధికారాన్ని రక్షించుకోవడానికీ, ప్రజాయుద్ధ పురోగమనానికీ వీరంతా మొక్కవోని ధైర్య సాహసాలతో పోరాడి తుదిశ్వాస విడిచారు.

మన ప్రియతమ అమరుల్లో పార్టీ కేంద్ర సైనిక ఇంటెలిజెన్స్ విభాగం బాధ్యుడు, సీనియర్ రాష్ట్ర కమిటీ స్థాయి కామ్రేడ్ అయిన శాఖమూరి అప్పారావు (రవి, జయలాల్) మొదలుకొని సాధారణ సభ్యుల వరకు వున్నారు. ఈ అమరుల్లో అసమాన ధైర్య సాహసాలు, వీరత్వం, త్యాగశీలత ప్రదర్శించిన షిల్దా వీరులు, తాడిమెట్ల (ముక్రాం) యోధులు ఉన్నారు. కామ్రేడ్ మంగేష్ లాంటి డివిజన్ కమాండ్ ఇన్‌ఛార్జ్ నుండి, మిలీషియా కామ్రేడ్ శకుంతల వరకూ, కామ్రేడ్ స్వర్ణ లాంటి సీనియర్ మహిళా కామ్రేడ్ నుండి, ప్రజావ్యవసాయ క్షేత్ర కార్యకర్త కామ్రేడ్ కుమ్లి వరకూ, ప్రజా నిర్మాణాల నేతలైన కామ్రేడ్స్ సింగన్న, ఆంధ్రు, సుధీర్ మెహతోల నుండి సభ్యుల వరకూ, 70 సంవత్సరాల వృద్ధుల నుండి ముక్కుపచ్చలారని 10 సంవత్సరాల పిల్లల వరకూ ఉన్నారు. అమరుల్లో ఒక రాష్ట్ర కమిటీ సభ్యుడు, జోనల్/డీసీ/డివిజన్ కమిటీ సభ్యులు, సబ్ జోనల్/సబ్ డీవీసీ కమిటీ సభ్యులు, ఏ.సి.ఎం.లు, పి.ఎం.లు ఉన్నారు. మొత్తం అమరుల్లో మహిళా కామ్రేడ్స్ వున్నారు.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో శత్రువు కొనసాగించిన హత్యాకాండలోనే అత్యధికులు అమరులయ్యారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని భూస్థాపితం చేయటానికి శత్రు బలగాలపై చేసిన లాహిరి, షిల్దా, తాడిమెట్ల వగైరా వీరోచిత యుద్ధాల సందర్భంగానూ, శత్రు కిరాయి బలగాలు చేసిన దాడుల్ని మన బలగాలు వీరోచితంగా తిప్పికొట్టే క్రమంలోనూ అమరులైన కామ్రేడ్స్ సంఖ్య గణనీయంగా వుంది. శత్రువు చాలా మంది కామ్రేడ్స్‌ని పట్టుకొని తీవ్ర చిత్రహింసల పాల్జేసి హత్య చేశాడు. మహిళలపై

*(మిగతాది 49వ పేజీలో...)*